ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

ప్రకాశం

జిల్లా వార్తలు

మంగళవారం 2, సెప్టెంబరు 2025

# గడప వద్దకే సంక్షేమం

## ఇంటింటికీ తిరిగి భరోసా పించన్లు పంపిణీ

- మర్రిపూడి మండలంలో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి
- పలుచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు
- గంటల వ్యవధిలో లబ్ధిదారులకు నగదు అందజేత



పింఛన్ సొమ్ము తీసుకుని ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు

ఒంగోలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ఈనెల సామాజిక పింఛన్‌ల పంపిణీ సోమవారం ఉత్సాహంగా సాగింది. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు సిబ్బంది వెళ్లి పింఛన్ సొమ్మును అందజేశారు. కొద్దిగంటల వ్యవధిలోనే లబ్ధిదారులలో అందుబాటులో ఉన్న వారందరికీ పంపిణీ చేశారు. జిల్లాలో ఈనెల సామాజిక పింఛన్‌లు మొత్తం 2,84,625 మందికి రూ.124.53 కోట్లు విడుదల య్యాయి. సోమవారం ఉదయం 7 గంటలకు పంపిణీ ప్రారంభమైంది. పది గంటలకే 65 శాతం మందికి అందించారు. సాయంత్రం


మిగతా 6వ పేజీలో

# కల నెరవేరబోతున్న వేళ..

## డీఎస్సీ అభ్యర్థుల ఎంపిక షురూ

- రేపటి నుంచి మంగళగిరిలో ఫైనల్ ప్రక్రియ ప్రారంభం
- డీఈవో, సిబ్బందికి విద్యాశాఖ కమిషనర్ పిలుపు
- నేడు 2వ విడత సర్టిఫికెట్ల పరిశీలన.. తర్వాత తుదిజాబితా

డీఎస్సీ అభ్యర్థుల తుది ఎంపికకు ముహూర్తం ఖరారైంది. బుధవారం నుంచి మంగళగిరిలోని పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయంలో ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు అక్కడి నుంచి డీఈవో కార్యాలయానికి సమాచారం అందింది. ఎంపిక ప్రక్రియకు డీఈవో, సంబంధిత సెక్షన్ అసిస్టెంట్, ఏపీవోలు రావాలని కోరారు. ఇప్పటికే మొదటి విడతలో సర్టిఫికెట్ల పరిశీలనను విజయవంతంగా ముగించారు. వీరిలో కొందరు ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు ఎంపిక కావడంతో దరఖాస్తు సమయంలో వీరు ఇచ్చిన ప్రాధాన్యతను బట్టి మిగిలిన పోస్టులకు తర్వాత మెరిట్ వారిని సర్టిఫికెట్ల పరిశీలనకు ఆహ్వానిస్తున్నారు. వీరికి సోమవారం రాత్రి లేదా మంగళవారం ఉదయం మెసేజ్‌లు, కాల్ లెటర్లు పంపనున్నారు. మంగళవారం వీరి సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. బుధ వారం పూర్తి వివరాలతో ఫైనల్ ప్రక్రియ అయిన అభ్యర్థుల ఎంపికకు అధికారులు హాజరు కావాల్సి ఉంటుంది.






సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు (ఫైల్)

ఒంగోలు విద్య, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : టీచర్ ఉద్యోగం సాధించాలన్న వారి కల సాకారం కాబోతోంది. డీఎస్సీ నియామకాలకు సంబంధించి కీలక ఘట్టం ముగిసింది. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయ్యింది. చివరిదైన ఎంపిక ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభంకానుంది. జిల్లాలో మెగా డీఎస్సీలో 672 పోస్టులు భర్తీ చేస్తున్నారు. ప్రభుత్వ, జడ్పీ యాజమాన్యంలో 599, మునిసిపల్ యాజమాన్యంలో 30, గిరిజన స్కూళ్లలో 43 పోస్టులు ప్రకటించారు.

### సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

డీఎస్సీలో ప్రకటించిన 657 పోస్టులకు అంతే మందిని సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. వారిలో 652 మంది హాజరయ్యారు. అందరి సర్టిఫికెట్లు సక్రమంగా ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. మిగిలిన ఐదుగురిలో ముగ్గురు

మిగతా 6వ పేజీలో



శివపురంలో మ్యాజిక్ డ్రెయిన్ శంకుస్థాపనకు హాజరైన మంత్రి స్వామి

# ఉపాధి హామీతో మ్యాజిక్ డ్రెయిన్లు

## తక్కువ ఖర్చుతో గ్రామాల్లో కాలువలు

- మురుగు పారుదల కన్నా భూమిలో ఇంకేలా నిర్మాణం
- జిల్లాలో ఆరు గ్రామాలు ఎంపిక
- శివపురంలో శంకుస్థాపన చేసిన మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తక్కువ ఖర్చుతో మురుగు కాలువల నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం ఉపక్రమించింది. డ్వామా ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం నిధులతో వీటిని చేపడుతోంది. నందిగామ నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా తొలుత చేపట్టగా విజయవంతమైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అక్టోబరు 2 నాటికి వంద గ్రామాల్లో నిర్మాణాలు పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తదనుగుణంగా జిల్లాలో ఆరు గ్రామాలను ఎంపిక చేసింది. అందులో ఒకటైన టంగుటూరు మండలం శివపురంలో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి సోమవారం శంకుస్థాపన చేశారు. వెలిగండ్ల మండలం చోడవరంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి భూమిపూజ చేశారు. కొత్తపట్నం మండలం పాదర్తి బీసీ కాలనీ, రాచర్ల మండలం గౌతవరం, ముండ్లమూరు మండలం రమణారెడ్డి ఆవాసం, మార్కాపురం

మిగతా 6వ పేజీలో

# ఖరీఫ్ అరకొరే..!

ఒంగోలు సమీపంలో దున్ని విత్తనం వేయని పొలం



## మూడు నెలలు.. మూడో వంతూ సాగు కాలేదు

జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రతికూలంగానే సాగుతోంది. కీలకమైన జూలై, ఆగస్టు నెలల్లో సగటు వర్షపాతం సాధారణం కన్నా అధికంగా ఉన్నప్పటికీ కొన్ని మండలాల్లో భారీ వర్షమే కురిసింది. అయితే అది పంటల సాగుకు అంతగా అనుకూలించ లేదు. సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచినా ఖరీఫ్ సాధారణ విస్తీర్ణంలో మూడో వంతు కూడా సాగు కాలేదు. కీలక మెట్ట పంటలైన కంది, పత్తి అరకొరగా సాగవగా ఇప్పుడు అదును దాటింది. జూన్‌లో వేసే తొలకరి పైర్లు వర్షాభావంతో ముందుకు సాగలేదు. కాగా సాగర్ నీటి సరఫరాపై భరోసాతో ఆయకట్టు ప్రాంతంలో ముమ్మరంగా వరినాట్లు కొనసాగుతున్నాయి. అవి మరింతగా ఊపందుకోనున్నాయి. అలాగే మొక్కజొన్న సాగువైపు కూడా పలు ప్రాంతాల రైతులు మొగ్గు చూపుతున్నారు.

- కంది, పత్తికి మించిన సమయం
- ప్రతికూల వాతావరణమే కారణం
- సాగర్ నీటి భరోసాతో ముమ్మరంగా వరినాట్లు
- మొక్కజొన్నవైపు రైతుల మొగ్గు
- వర్షాలు కురిసిన ప్రాంతాల్లోనూ సాగుకు అనుకూలించని పరిస్థితి

ఒంగోలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయశాఖ పరిధిలో సుమారు లక్షా 29 వేల హెక్టార్లలో పంటలు సాగవుతున్నాయి. జూన్ నుంచి సెప్టెంబరు వరకు ఖరీఫ్ సీజన్ కాగా ఈ సమయానికి కనీసం 75 శాతం విస్తీర్ణంలో పంటలు సాగు కావాలి. జూన్‌లో తొలకరి పైర్లుగా పిలిచే సజ్జ, పెసర, పశుగ్రాసం.. జూలై, ఆగస్టులలో వర్షాధారంగా వేసే కంది, పత్తి, సెప్టెంబరులో వరి విస్తారంగా సాగు చేస్తారు. అలాగే జూలై నుంచి మిర్చి కూడా అధికంగా వేస్తారు. అయితే ఈ ఏడాది జూన్‌లో లోటు వర్షపాతంతో తొలకరి సాగు ముందుకు సాగలేదు. తర్వాత జూలైలో సాధారణం కన్నా అధికంగా వర్షపాతం నమోదైనా ఎక్కువగా ఆ నెల రెండో పక్షంలోనే కురిసింది. కొన్నిచోట్ల భారీ వర్షమే పడింది. ఆ వర్షాలతో భూములు పదునెక్కాయి. దున్నకం చేసి పంటలు వేసేందుకు చాలా ప్రాంతాల్లో భూములు ఆరక ప్రతికూలత ఏర్పడింది. ఆగస్టులోనూ అలాంటి పరిస్థితే నెలకొంది. జూన్‌లో లోటు

మిగతా 6వ పేజీలో

జిల్లాలో వినాయక నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. తీర ప్రాంతాలైన కొత్తపట్నం, మడనూరు, కనపర్తి, పాకల తదితర ప్రాంతాల్లో సోమవారం కూడా కోలాహలం నెలకొంది. పెద్ద సంఖ్యలో గణపతి విగ్రహాలతోపాటు భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆయా ప్రాంతాల్లో సందడి వాతావరణం కనిపించింది. కొన్నిచోట్ల స్థానికంగా ఉన్న నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు. - ఆంధ్రజ్యోతి, ఒంగోలు

# నిమజ్జన సందడి..



నిమజ్జనం కోసం కొత్తపట్నం తీరానికి తీసుకొచ్చిన వినాయక విగ్రహాలు

వినాయక నిమజ్జనంలో

## అపశ్రుతి

7

- ప్రమాదవశాత్తూ సాగర్ కాలువలో పడిన దివ్యాంగుడు
- కాపాడబోయి ప్రాణాలు కోల్పోయిన టీడీపీ యువనాయకుడు

పోలీసులపై మంత్రి స్వామి

## ఆగ్రహం

7

- విజిలెన్స్ కమిటీ సమావేశంలో కేసుల వారీ సమీక్ష



ఎంపీ మాగుంటకు వినతిపత్రం అందజేస్తున్న తాళ్లూరు, ముండ్లమూరు మండలాల నాయకులు

# ప్రకాశంలోనే కొనసాగించాలి

- ముండ్లమూరు, తాళ్లూరు మండలాల నేతల విజ్ఞప్తి
- ఎంపీ మాగుంట, కలెక్టర్ అన్సారియాను కలిసి వినతిపత్రాలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు, తాళ్లూరు మండలాలను ప్రకాశం జిల్లాలోనే కొనసాగించే విధంగా చూడాలని ఆయా మండలాల ప్రజాప్రతినిధులు కోరారు. ఈమేరకు వారు సోమవారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియాలను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలను అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా తీసుకున్న నిర్ణయాల కారణంగా ఉమ్మడి జిల్లా మూడు ముక్కలైందన్నారు. మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలని వినతులు వచ్చినా పట్టించుకోలేదన్నారు. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్కాపురం జిల్లా ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. దర్శి నియోజకవర్గాన్ని కలుపుకొని మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం యోచిస్తున్నదన్నారు. అయితే మార్కాపురం జిల్లా ఏర్పాటును తాళ్లూరు, ముండ్లమూరు మండలాల ప్రజలు, ప్రజాప్రతినిధులుగా తాము స్వాగతిస్తున్నామన్నారు. మార్కాపురం జిల్లాలో ఈ రెండు మండలాలను విలీనం

మిగతా 6వ పేజీలో

# విలువైన రికార్డులు ఎట్టికే..!

- శిథిలమైపోతున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం
- వర్షం పడితే నీరు కారుతున్న దుస్థితి
- చేసేది లేక వసారాలో విలువైన ఫైళ్లు
- చినుకుపడితే ప్రాంగణమంతా రొచ్చురొచ్చే
- ఎమ్మెల్యే ఉగ్ర చొరవతో నూతన భవన నిర్మాణం

7



కార్యాలయ వసారాలో ఉంచిన రెవెన్యూ రికార్డులు

కంభం చెరువులో 7 అడుగుల మేర చేరిన నీరు



## కంభం చెరువు కళకళ

కంభం చెరువు నీటితో కళకళలాడుతోంది. సోమవారం ఉదయానికి 7 అడుగులకుపైగా నీరు చేరడంతో రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల నుంచి వరుస వర్షాలతో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు జలకళను సంతరించుకోగా నల్లమల అడవుల్లో ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో కంభం చెరువులో కేవలం 4 అడుగుల వరకే నీరు ఉంది. దీంతో రైతులు దిగాలు చెందారు. ఈనేపథ్యంలో గతవారం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో భారీ వర్షం కురిసి గుండ్లకమ్మ, జంపలేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో చెరువులో ఉన్న నాలుగు అడుగులకు తోడు మరో మూడు అడుగులు నీరు చేరింది. మొత్తం 7 అడుగులకుపైగా నీటితో కళకళలాడుతోంది. చెరువులోని నీటిని, కంభం చెరువుకట్ట పరిసరాలను తిలకించేందుకు పర్యాటకులు వస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, కంభం

## కల నెరవేరబోతున్న వేళ..

(5వ పేజీ తరువాయి)

ఇతర ఉద్యోగాల్లో స్థిరపడినందున అన్‌విల్లింగ్ లేఖలు ఇచ్చారు. మరో ఇద్దరిని వివిధ కారణాలతో అనర్హులుగా ప్రకటించారు. పరిశీలనకు పిలిచిన వారిలో కొందరు ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు అర్హత సాధించారు. వీరిని ఒక పోస్టుకు పరిమితం చేసి మిగిలిన పోస్టులకు మెరిట్‌లో వీరి తర్వాత వారిని సర్టిఫికెట్ల పరిశీలనకు పిలవాల్సి ఉంది. ఈ ప్రక్రియను మంగళవారం పూర్తి చేయనున్నారు. బుధవారం నుంచి ఎంపిక ప్రక్రియను ప్రారంభించనున్నారు. అందుకోసం మొదటిసారిగా మూడు రకాల రిజర్వేషన్లను ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. అభ్యర్థుల ఎంపిక మూడు దశల్లో చేపడుతోంది.

**మొదటిదశ**

ఓపెన్ కాంపిటేషన్ (ఓసీ) పూర్తిగా మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.

**రెండో దశ**

వర్టికల్ రిజర్వేషన్లు, సామాజికపరంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోటాలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**మూడో దశ...**

హారిజాంటల్ రిజర్వేషన్ (ప్రత్యేక) అమలు. ఈ కోటాలో మహిళలు,దివ్యాంగులు, ఎక్స్ సర్వీసుమెన్లు, ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేస్తారు. మహిళా అభ్యర్థులకు అన్ని కేటగిరీల్లో మూడో వంతు రిజర్వేషన్లు ఇస్తారు.

**స్పోర్ట్స్ కోటాలో..**

ఈ కోటాలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు పోటీ పరీక్ష లేకుండా నేరుగా ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. వీరికి 3శాతం పోస్టులు కేటాయించారు. గతంలో ఈ రిజర్వేషన్లకు పోటీ పరీక్షల్లో మెరిట్ సాధించిన వారినే ఎంపిక చేసేవారు. ప్రస్తుతం వీరిని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) ఎంపిక చేస్తుంది. వీరు సూచించిన వారినే నేరుగా టీచర్లుగా నియమిస్తారు. జిల్లాలో 629 పోస్టుల్లో 19 మందిని ఈ కోటాలో ఎంపిక చేస్తారు.

**ఎస్సీ రిజర్వేషన్లు ఇలా..**

ఎస్సీ రిజర్వేషన్లు 15 శాతం కొత్తగా అమల్లోకి వచ్చిన మూడు గ్రూపులకు వర్తింపజేస్తారు. వీరిలో గ్రూపు-1లోని ఉపకులాలకు 1 శాతం, గ్రూపు-2లోని ఉపకులాలకు 6.5శాతం, గ్రూపు-3లోని ఉపకులాలకు 7.5శాతం రిజర్వేషన్లు వర్తింపజేస్తారు. దీనికి సంబంధించి అభ్యర్థులు ఆయా గ్రూపులకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలి.

**హారిజాంటల్ రిజర్వేషన్లు**

ప్రభుత్వం జారీ చేసిన 77 జీవో ప్రకారం డీఎస్సీ ఎంపికలకు మొదటిసారిగా హారిజాంటల్ రిజర్వేషన్లకు అమలు చేస్తున్నారు. ఈ విధానం ప్రకారం రిజర్వేషన్ రోస్టర్ పాయింట్‌తో సంబంధం లేకుండా ఆ సైకిల్ కేటగిరీ అభ్యర్థి ఎక్కడ వచ్చినా రిజర్వేషన్ అమలు అయినట్లుగా పరిగణిస్తారు. డీఎస్సీ ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ప్రకటించారు.

## గడప వద్దకే సంక్షేమం

(5వ పేజీ తరువాయి)

నాలుగు గంటలకు 2.38 లక్షల (87.51శాతం) మందికి సుమారు రూ.117.66 కోట్ల మేర నగదు అందజేశారు. మరికొంతమందికి సాయంత్రం అందుబాటులోకి రాగా వారికి కూడా ఇచ్చారు. వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం పాల్గొనాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో జిల్లాలోని పలుప్రాంతాల్లో నేతలు పాల్గొన్నారు.

**ఆప్యాయంగా పలుకరిస్తూ..**

మంత్రి స్వామి తన నియోజకవర్గ పరిధిలోని మర్రిపూడి మండలం పన్నూరు గ్రామంలో సోమవారం ఉదయాన్నే పింఛన్లు పంపిణీ చేశారు. అనేక మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారిని ఆప్యాయంగా పలుకరించి యోగక్షేమాలను అడిగి పెన్షన్ మొత్తాలను అందించారు. ఒంగోలు నగరంలోని 33వ డివిజన్‌లో కొత్త డొంకలో పేదల నివాసాల వద్దకు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వెళ్లి పంపిణీ చేశారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ మంగమూరులో, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి వెలిగండ్ల మండలం మొగళ్లూరులో, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తర్లుపాడు మండలం మేకలవారిపల్లిలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి గిద్దలూరు పట్టణంలోని నల్లబండ బజారులో, టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు వైపాలెం పట్టణంలోని ఎస్‌బీఐ బజారులో పింఛన్లు పంపిణీ చేశారు. దర్శి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పింఛన్లు పంపిణీ చేయగా జిల్లావ్యాప్తంగా గ్రామ, గ్రామాన ఉత్సాహంగా స్థానిక నాయకులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అతీగతీ లేని తీగలేరు నిర్మాణం

**అసంపూర్తి పనులతో రైతులకు శాపం**

**పదేళ్లుగా పైరుకు నోచుకోని ఐనముక్కుల భూములు**

**కాలువ కట్టలు సక్రమంగా లేక ముంపునకు గురవుతున్న తిమ్మాపురం పొలాలు**

**వరద నీరు రాక చిన్నగుడిపాడు చెరువు వెలవెల**



పొలాల్లో నిలిచిన వాన నీరు



అసంపూర్తిగా నిలిచిన బ్రిడ్జి నిర్మాణం

పెద్దదోర్నాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ వస్తోంది.. మా బతుకుల్లో వెలుగులు నింపుతుందని వేయి కళ్లతో ఎదురుచూసిన రైతులకు ప్రాజెక్టు పూర్తి మాట అటుంచితే.. తమ బతుకులకు శాపంగా మారిందని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్ట్ అనుసంధానంలో భాగంగా తవ్విన తీగలేరు కాలువ అసంపూర్తి పనుల వల్ల రైతులు ఇబ్బందులుపడుతున్నారు.

**తీగలేరు స్వరూపం ఇదీ**

వెలిగొండ ప్రాజెక్ట్‌లో కీలకమైన సప్లై చానల్ తీగలేరు కాలువ నిర్మాణం. గొట్టిపడియ రిజర్వాయర్ నుంచి పెద్దారవీడు మండలం నుంచి దోర్నాల మండలంలోని కటకానిపల్లె, తిమ్మాపురం, ఐనముక్కల మీదుగా దోర్నాల పొలాల గుండా జమ్మిదోర్నాల వ్యవసాయ భూములు దాటుకుని ఎర్రగొండపాలెం, అక్కడ నుంచి పుల్లలచెరువుకు చేరుతుంది. ఈ క్రమంలో తీగలేరు కాలువ 15 ఏళ్ల కిందట నిర్మించారు. కాలువను పూర్తి చేయకుండా గాలికి వదిలేశారు. దీంతో దోర్నాలలోని నిదానంపాటి అమ్మవారి దేవాలయం వెనుక భాగాన ఐనముక్కుల గ్రామానికి చెందిన రైతుల భూముల్లో వరదనీరు ప్రవహించే చోట తీగలేరు కాలువ నిర్మాణంలో భాగంగా బ్రిడ్జిని నిర్మించాల్సి ఉంది. బ్రిడ్జి నిర్మాణంతో పాటు ఇంకా కొన్ని అసంపూర్తి పనులున్నాయి. పైగా మట్టి కట్టలు కూడా తొలగించలేదు. దీంతో వర్షాలకు వచ్చే వరద నీరు ప్రవహించే వీలులేక వ్యవసాయ భూముల్లోనే నిలిచిపోతున్నాయి. అలా పొలాల్లో నిలిచిన నీరు నెలల కొద్దీ ఇంకడంలేదు. అలాగే వరద ప్రవాహం లేక చిన్నగుడిపాడు చెరువు కూడా నిండడం లేదు. దీంతో రెండు గ్రామాల రైతులకు భారీ నష్టం జరుగుతోంది. అలాగే తీగలేరు కాలువలో వరద నీరు ముందుకు వెళ్లే అవకాశం లేక వెనక్కి ప్రవహించి తిమ్మాపురం వద్ద కరకట్ట తెగి పొలాలపై ప్రవహించడంతో కోతలకు గురవుతున్నాయి. ఈ సమస్యలన్నీ సంబంధిత అధికారులకు బాధిత రైతులు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని విలపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించాలని, తమ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

ప్రధానంగా మండలంలోని ఐనముక్కల గ్రామానికి చెందిన జంగిలి పిచ్చయ్య, లోకసాని వెంకటరామిరెడ్డి, కాశయ్య, ఏర్వ వెంకటరామిరెడ్డి, చిన్న కాశిరెడ్డి, ఏర్వ చెన్నారెడ్డి, రామిరెడ్డి తదితర 20 మందికి చెందిన 50 ఎకరాల వ్యవసాయ భూముల్లో పదేళ్లకుపైగా పైరు వేసింది లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తీగలేరు కాలువ నిర్మాణం అసంపూర్తిగా వదిలేయడంతో తమ చెరువుకు నీళ్లు రాక పదేళ్లకు పైగా ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయని చిన్నగుడిపాడు గ్రామానికి చెందిన రైతులు చెబుతున్నారు. బోరు బావుల్లో జలాలు అడుగంటాయని వాపోతున్నారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన కొందరు రైతులు.. కాలువ పూర్తి చేయకపోవడంతో వరదనీరు అసంపూర్ణంగా ఉన్న తీగలేరు కాలువకు చేరి పల్లపు ప్రాంతానికి వెళ్లే అవకాశం లేక వెనక్కి మళ్లీ తమ భూములను కోతలకు గురి చేస్తున్నాయని ఆరోపిస్తున్నారు.

**పదేళ్లుగా బీళ్లే**

**లోకసాని వెంకట రామిరెడ్డి, రైతు, ఐనముక్కుల**

తీగలేరు పూర్తి కాకపోవడంతో పంటలు వేసే పరిస్థితి లేదు. పదేళ్లుగా బంగారం పండే భూములు బీళ్లుగా మారాయి.

**ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోలేదు**

**జంగిలి పిచ్చయ్య, రైతు, ఐనముక్కుల**



తీగలేరు కాలువ అసంపూర్తిగా వదిలేయడంతో తమ భూములు సాగుకు నోచుకోవడం లేదు. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా ప్రయోజనం లేదు. ప్రజా ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేయాలి.

**భూములు కోతకు గురయ్యాయి**

**కే సత్యనారాయణ, రైతు, తిమ్మాపురం గ్రామం**

తీగలేరు పూర్తి చేయకపోవడంతో కాలువకు చేరిన వరదనీరు కిందికి పోక కరకట్ట తెగి నా భూమిలో ప్రవహిస్తుంది. దీంతో భూములు కోతలకు గురవుతున్నాయి. ప్రభుత్వం న్యాయం చేయాలి.

# పేదరికం లేని సమాజమే లక్ష్యం

**అర్హుల పింఛన్‌లను తొలగించం**

**మంత్రి స్వామి**



సమావేశంలో మాట్లాడుతున్న స్వామి

మర్రిపూడి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. మండలంలోని పన్నూరులో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను ఆయన ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈసందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలును అడిగి తెలుసుకున్నారు. పింఛన్‌ల పంపిణీపై వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దని ప్రజలను కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. అర్హుల పింఛన్‌లను ఎట్టిపరిస్థితుల్లోనూ తొలగించబోమని స్పష్టం చేశారు. పింఛన్‌ల పంపిణీపై మాట్లాడే కనీస అర్హత కూడా వైసీపీ నేతలకు లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పింఛన్ మొత్తాన్ని రూ.2వేల నుంచి రూ.3వేలకు పెంచేందుకు 5 సంవత్సరాలు పట్టిందని ఎద్దేవా చేశారు. దివ్యాంగులకు రూ.6 వేలు, మంచానికే పరిమితమైన రోగగ్రస్తులకు రూ.15వేలు పింఛన్ అందిస్తున్న ఘనత దేశంలోనే మన రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈరోజు ఒక చారిత్రక దినమని మంత్రి అభివర్ణించారు. దార్శనిక నేత చంద్రబాబునాయుడు 30ఏళ్ల క్రితం ఇదేరోజు ముఖ్యమంత్రి పదవి చేపట్టారని పేర్కొన్నారు. తెలుగుజాతి కీర్తి ప్రతిష్ఠను ప్రపంచ నలుమూలలకూ విస్తరింపచేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని కొనియాడారు. ప్రతి ఆడపడుచుకూ ఉచిత బస్సు సౌకర్యం కల్పించి ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీని నెరవేర్చామని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంతర్గత రహదారులను అభివృద్ధి చేయాలని ప్రజలు మంత్రిని కోరారు. రక్షిత నీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని మహిళలు విజ్ఞప్తి చేయగా స్పందించిన మంత్రి వెంటనే వాటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ జనార్దన్, ఎంపీడీవో ఖాసింపీరా, కొండపి సీఐ సోమశేఖర్, మర్రిపూడి, చిమట సొసైటీ అధ్యక్షులు యర్రమోతు శ్రీనివాసులు, మలసాని కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు రేగుల వీరనారాయణ, శ్రీనివాసరెడ్డి, నరసింహారావు, కిలారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

**వినాయక పూజలో మంత్రి**

కొండపి : మండలంలోని చినకండ్లగుంట గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో సోమవారం జరిగిన పూజా కార్యక్రమంలో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా స్థానికులతో ఆయన మాట్లాడారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

**వేతనాలు పెంచాలని వినతి**

అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలని, 5జీ నెట్‌వర్క్ ట్యాబ్‌లు ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ ప్రతినిధులు మంత్రి స్వామిని కోరారు. ఈమేరకు సోమవారం ఆయనకు తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బరావమ్మ, వై.సత్యవతి, ఈదర అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

# ఉపాధి హామీతో మ్యాజిక్ డ్రెయిన్లు

(5వ పేజీ తరువాయి)

మండలం పెద్దనాగులవరంలలో కూడా చేపడుతున్నారు. సాధారణంగా మురుగు కాలువలను సిమెంట్, కాంక్రీటుతో నిర్మిస్తారు. ఇళ్లలో నుంచి అలాగే వర్షాల సమయంలో ఆ కాలువల నుంచి నీరు పారి దిగువకు పోతుంది. ఇప్పటి వరకూ నిర్మిస్తున్న కాలువల్లో మట్టి, ఇతర వ్యర్థాలు పేరుకుపోతుంటాయి. వీటి నిర్మాణానికి భారీ వ్యయం అవుతుంది. ఇంజనీరింగ్ అంచనా ప్రకారం ఆ తరహా కాలువల నిర్మాణాలకు కిలోమీటరుకు రూ.60లక్షల వరకు ఖర్చవుతుంది. అయితే ప్రస్తుతం ప్రభుత్వం ప్రత్యేక టెక్నాలజీతో నిర్మించతలపెట్టిన మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి కిలోమీటరుకు రూ.9లక్షలు మాత్రమే వ్యయమవుతుందని సమాచారం. అంతేకాక ఇళ్లలో నుంచి వచ్చే మురుగు నీరు నేరుగా కాలువలో చివరి వరకు పారుదల కాకుండా ఎక్కడికక్కడ భూమిలో ఇంకేలా నిర్మించనున్నారు. ఈ కాలువలను అడుగున్నర వెడల్పు, రెండు అడుగుల లోతు తవ్వుతారు. అడుగున స్థానికంగా దొరికే కంకర తరహా రాళ్లను ఉపయోగిస్తారు. పైన మందంగా ఉండే కంకరు, ఆపైన చిన్న సైజు కంకరను వేస్తారు.

**దుర్వాసన ఉండదు..**

గ్రామాల్లో నిర్మించిన సిమెంట్ రోడ్ల పక్కన సమాంతరంగా తవ్వి ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు ఆ కాలువల్లోకి చేరేలా ఏర్పాటు చేస్తారు. కాలువ పొడవునా ప్రతి 50 మీటర్లకు ఒకచోట ఇంకుడు గుంతలు తవ్వుతారు. కాలువలకు ఇరువైపులా మట్టి విరిగి లోపల పడిపోకుండా పరుపు రాళ్లతో గోడ తరహాలో ఏర్పాటు చేస్తారు. ఈ ప్రక్రియలో మురుగు కాలువల్లోకి వచ్చేనీరు నేరుగా కాలువలో ముందుకు ప్రవాహ రూపంలో వెళ్లకుండా ఎక్కడికక్కడ కంకరలో నుంచి భూమిలోకి దిగుతుంది. అధిక ప్రవాహం వచ్చినప్పుడు కొంత దూరం ప్రవహించి అక్కడక్కడా తవ్విన ఇంకుడు గుంటల్లోకి చేరి భూమిలోకి ఇంకుతుంది. దీని వల్ల కాలువల్లో నీరు, మురుగు పేరుకపోయి దుర్వాసన రాకుండా, దోమలు చేరకుండా ఆరిపోతుందని చెప్తున్నారు.

**అన్ని గ్రామాల్లోనూ ఇదే తరహా..**

నందిగామ మండలంలో విజయవంతమైన తర్వాత గతనెల 23న పెద్దాపురంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడు హాజరైన సందర్భంగా ఈ తరహాలో అక్కడ తవ్విన కాలువలను ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం వచ్చేనెల 2లోపు రాష్ట్రవ్యాప్తంగా వంద గ్రామాల్లో ఈ తరహా డ్రైన్లు తవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మ్యాజిక్ డ్రెయిన్లు చేపట్టాలని భావిస్తోంది. కాగా ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో చిన్న గ్రామాలుగా ఉన్న ఆరింటిలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నట్లు డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ తెలిపారు. నిర్దిష్ట కాల వ్యవధిలో వీటిని పూర్తిచేస్తామన్నారు.

## ఖరీఫ్ అరకొరే!

(5వ పేజీ తరువాయి)

వర్షపాతంతో పంటల సాగు కాకపోగా, జూలై, ఆగస్టులో సాధారణం కన్నా అధికంగా వర్షం కురిసినా సకాలంలో పొలం ఆరక కీలక మెట్ట పంటలను రైతులు వేయలేకపోయారు. ప్రధానంగా కంది, పత్తిసాగుపై ఆ ప్రభావం పడింది. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం లక్షా 29వేల హెక్టార్లలో అత్యధికంగా 62,827 హెక్టార్ల (48.23శాతం) విస్తీర్ణంలో కంది, 26,981 హెక్టార్ల (20.10శాతం) విస్తీర్ణంలో పత్తి, 12,826 హెక్టార్ల(9.94శాతం) విస్తీర్ణంలో వరి సాగు చేపడతారు. అంటే ఈ సీజన్ మొత్తం సాగు విస్తీర్ణంలో ఈ మూడు పంటలే 78శాతానికిపైగా సాగవుతాయి. అయితే ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తే మొత్తం సాగు విస్తీర్ణంలో లక్షా 29వేల హెక్టార్లకు కేవలం 41,607 హెక్టార్ల(32.23శాతం)లో మాత్రమే పంటలు సాగయ్యాయి. అంటే మూడో వంతు విస్తీర్ణంలో కూడా విత్తనం పడలేదు.

**పడిపోయిన కంది సాగు**

ప్రధానమైన కంది పంట చూస్తే 68,287 హెక్టార్లకు కేవలం 13,450 హెక్టార్ల (25.55శాతం)లో మాత్రమే రైతులు వేశారు. పత్తి పంట 26,981 హెక్టార్లకు 10206 హెక్టార్లు (37.83శాతం) మాత్రమే సాగు చేశారు. వరి 12,826 హెక్టార్లకు 2,253 హెక్టార్లు (17.56శాతం) వేయగలిగారు. ప్రస్తుతం వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవలి వర్షాలు, సాగర్ కాలువల్లో నీటి సరఫరాపై భరోసాతో రైతులు వరిసాగు చేశారు. ఈనెలలో వరినాట్లు మరింత ఊపందుకునే అవకాశం ఉంది. మెట్టపంటల్లో కీలకమైన కంది, పత్తి సాగుకు సమయం దాటిపోయింది. దీంతో నీటివసతి ఉన్న ప్రాంతాల రైతులు మొక్కజొన్న సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. మొత్తంగా చూస్తే ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రతికూలంగానే సాగుతోంది. సాధారణంలో సగం విస్తీర్ణానికి మించి పటంలు సాగయ్యే సూచనలు కనిపించడం లేదు.

**ఈ సీజన్ వర్షపాతం వివరాలు**

| నెల | సాధారణ వర్షపాతం (మి.మీ) | నమోదైంది (మి.మీ) | తేడా (శాతం) |
|---|---|---|---|
| జూన్ | 57.90 | 37.4 | 35.4 |
| జూలై | 87.90 | 102.2 | ప్లస్16.7 |
| ఆగస్టు | 92.00 | 114.4 | ప్లస్ 19.44 |

**ప్రధానపంటల సాగు వివరాలు**

| పంట | సాగు విస్తీర్ణం (హెక్టార్లు) | సాగైన విస్తీర్ణం | సాగైన శాతం |
|---|---|---|---|
| కంది | 68,287 | 17,451 | 25.55 |
| పత్తి | 26,981 | 10,206 | 37.83 |
| వరి | 12,826 | 253 | 17.56 |
| సజ్జ | 7,020 | 2,251 | 32.07 |
| నువ్వు | 3,457 | 2,816 | 81.46 |
| మొక్కజొన్న | 3,120 | 3,997 | 128.12 |



## 'ప్రకాశం'లోనే కొనసాగించాలి

(5వ పేజీ తరువాయి)

చేయడం వలన తాము 90 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఈ రెండు మండలాలను ప్రస్తుతం ఉన్న ఒంగోలు కేంద్రంగానే కొనసాగించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో తాళ్లూరు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ ముండ్లమూరు, తాళ్లూరు మండలాల అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, సాగర్, రైతు నాయకులు జి.రంగనాయకులు, మేదరమెట్ల వెంకట్రావు, చావా బ్రహ్మయ్య, నిడమానూరు శ్రీనివాసరావు, రాచకొండ వెంకట్రావు, పిన్నిక రమేష్ ఉన్నారు.

## నాణ్యమైన నారును ఎంచుకోవాలి

కొండపి, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): రాబోయే పంట కాలానికి పొగాకు సాగు చేసే రైతులు నాణ్యమైన నారును ఎంపిక చేసుకోవాలని కొండపి వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ సూచించారు. సోమవారం పెరిదేపిలోని పొగాకు నారుమడులను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. రైతులు బోర్డు అనుమతించిన మేరకే పొగాకును పండించాలని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిని సాధించాలన్నారు.

## 'స్త్రీశక్తి'పై మహిళల కృతజ్ఞతా ర్యాలీ

**అవీఇవీ**



ర్యాలీ చేస్తున్న మహిళలు

సింగరాయకొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకంపై మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించినందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ మండల టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి కందుకూరు రోడ్డు వరకు ఇది సాగింది. తొలుత ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళా నేతలు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రజా ప్రభుత్వం నేరవేరుస్తున్నదన్నారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ రూ.13వేల చొప్పున ఇవ్వడం ద్వారా కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య, నేతలు వేల్పుల సింగయ్య, సంధానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, చీమకుర్తి కృష్ణ, చంటి, ముళ్లపూడి సత్యనారాయణ, కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు,

## తాగునీటి సమస్య పరిష్కరిస్తా : ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



డీప్‌బోరుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. సోమవారం గిద్దలూరు పట్టణంలో రూ.70లక్షలతో 4 నూతన మంచి నీటి పథకాలకు శంకుస్థాపన చేసి డీప్‌బోర్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీలన్నింటిని ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు దూసుకుపోతుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్య పరిష్కారానికి 16 బోర్లు, 2 పైపులైన్లు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్ భైలడుగు బాలయ్య, కమిషనర్ ఇ.వి.రమణబాబు, ఎఇలు రవీంద్ర, పోర్సియా, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## పత్తి దిగుమతులపై పన్ను రద్దు దారుణం

**సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు సంఘాల ఆందోళన**



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

మార్కాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పత్తి దిగుమతులపై 11 శాతం పన్ను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి చెప్పారు. పన్ను రద్దును నిరసిస్తూ రైతు సం ఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యమని ఆగస్టు 15న ఎర్రకోటపై ఘనంగా ప్రసంగించిన ప్రధాన మోదీ 15 రోజుల్లోనే పత్తి రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా జీవో తీసుకురావడం దుర్మార్గ చర్య అన్నారు. ఈ దిగుమతి సుంకం రద్దు వలన దేశంలో పత్తిని నమ్ముకుని సాగు చేస్తున్న ఆరు కోట్ల మంది రైతుల జీవనం ప్రశ్నార్థకంగా మారనుందని అన్నారు. దేశంలో ఇప్పటికే పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. జిల్లా నాయకులు డి.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తిరోగమన విధానాల ఫలితంగా రైతులు పెద్ద ఎత్తున సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు అందె నాసరయ్య, ఎస్కే ఖాశిం, ఢాకాల పుల్లయ్య, బాణాల రామయ్య, జోసఫ్, కె.కొండయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు డి.సోమయ్య, డి.పాపిరెడ్డి, గాలి వెంకటరామిరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ పాల్గొన్నారు.


## అంతర్జాతీయ వెబినార్ ఫ్లయర్ ఆవిష్కరణ



వెబినార్ ఫ్లయర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ ప్రసన్నకుమార్, అధ్యాపకులు

మార్కాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడు రోడ్డులోని డాక్టర్ శామ్యూల్ జార్జి ఫార్మసీ కాలేజీలో సోమవారం క్వాలిటీ అండ్ సేఫ్టీ ఇన్ హెల్త్‌కేర్ అనే అంశంపై ఈ నెల 2న జరుగనున్న అంతర్జాతీయ వెబినార్‌కు సంబంధించిన ఫ్లయర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఆరోగ్యరంగంలో నాణ్యత భద్రత అనేవి అత్యంత కీలకమైన అంశాలన్నారు. విద్యార్థులు ఈ తరహా కార్యక్రమాల ద్వారా విశాలమైన జ్ఞానం, అవగాహన పొందుతారన్నారు. అంతర్జాతీయ నిపుణుల సూచనలు భవిష్యత్ ఆరోగ్యరంగ అభివృద్ధికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వైసునీత, డాక్టర్ కె.అశోక్‌బాబు, డాక్టర్ అనూష, ఎ.దీప్తి, ఆపీస్ అడ్మినిస్ట్రేటర్ కృపాల్ పాల్గొన్నారు.

## శ్మశానానికి దారి చూపండి



బురదలో నుంచి మృతదేహాన్ని మోసుకువెళ్తున్న దళితులు

రాచర్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మృతదేహాలను శ్మశానానికి తీసుకువెళ్లాలంటే దారిలేక ఇబ్బందులు పడుతున్నామని శ్మశానానికి దారి చూపాలని రాచర్ల గ్రామానికి చెందిన దళితులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విజ్ఞప్తి చేశారు. గ్రామ సమీపంలో తమకు తమ పూర్వీకుల నాటి నుంచే శ్మశాన స్థలం ఉందని అక్కడికి వెళ్లేందుకు సగిలేరు కాల్వ వెంట రస్తా కూడా ఉండేదని అయితే దానిని కొందరు వ్యక్తులు దున్నడం వలన రస్తా అంతా కుచించుకుపోయిందన్నారు. దీంతో శ్మశానానికి దారిలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటీవల కాలంలో ఉపాధి హామీ ద్వారా శ్మశానానికి దారిని ఏర్పాటు చేసుకున్నామని దానిని కూడా సమీప పొలాల వారు దున్నేశారన్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల మరణిస్తే అతని శవాన్ని తీసుకెళ్లడానికి దారి లేక బురద గుంటలోనే తీసుకువెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి శ్మశానానికి దారి చూపించాలని వారు కోరారు.



రొచ్చు రొచ్చుగా మారిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ప్రాంగణం (ఫైల్)

# విలువైన రికార్డులు ఎట్టికే!

- శిథిలమైపోతున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం
- వర్షం పడితే కార్యాలయం పైపెంకుల నుంచి నీరు కారుతున్న దుస్థితి
- చేసేది లేక కార్యాలయ వసారాలో ఉంచిన విలువైన రికార్డులు
- వర్షం పడిందంటే ప్రాంగణమంతా గుంతలతో రొచ్చురొచ్చు
- ఎమ్మెల్యే ఉగ్ర చొరవతో నూతన కార్యాలయం భవన నిర్మాణం
- పీ4 ద్వారా అధునాతన సౌకర్యాలతో బిల్డింగ్ ఏర్పాటుకు చర్యలు

*నూతన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం శిథిలమై కార్యకలాపాలకు ఇబ్బందిగా మారింది. వర్షం పడిందంటే కార్యాలయం లోపల పైపెంకుల నుంచి నీరొడుస్తోంది. గతంలో రికార్డుల గదిలో వర్షం పడి రికార్డులన్నీ తడిచి ముద్దయ్యాయి. దశాబ్దకాలంపైగా ఇదే దుస్థితిలో కొనసాగుతూ ప్రజలకు, అధికారులకు ఇబ్బందిగా మారింది. వర్షం పడిన సమయంలో కార్యాలయం వద్దకు రావలంటే బురద రొచ్చులో తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎంతో కాలంగా అవస్థల మధ్య నడుస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం దుస్థితి నుంచి తప్పించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నూతన కార్యాలయం నిర్మాణానికి పరోక్షంగా చర్యలకు ఉపక్రమించారు.*

కనిగిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఎంతో పురాతన భవనంలో దశాబ్దాల కాలంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ప్రజలకు వివిధ సేవలు అందిస్తోంది. బ్రిటీష్ కాలం నాటి భవనం కావటంతో ఇప్పటికే అందులో భాగమైన పాత తహశీల్దార్ కార్యాలయం స్లాబ్ పై పెంకులు కొంత భాగం పడిపోవటంతో నూతన తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటై పదేళ్లకుపైగా ప్రజలకు సేవలు అందుతున్నాయి. కానీ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పైపెంకు స్లాబ్ శిథిలమై వర్షపు నీరు ఒడుస్తున్నప్పటికీ మరమ్మతులు చేయించటంతో కొంత వరకు మెరుగ్గా ఉంది. కార్యాలయం ప్రాంగణం మాత్రం వర్షం వచ్చిందంటే గుంతల్లో నీరు నిలిచి రొచ్చురొచ్చుగా మారిపోతుంది. వర్షం పడిన సమయంలో విలువైన డాక్యుమెంట్లు కూడా తడిచిపోతున్నాయి. ఇప్పటికే విలువైన రికార్డులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని పంచ వసారాలో రికార్డులు ఉంచారు. భారీ వర్షం పడినపుడు జల్లులు కారణంగా రికార్డులు తడిచిపోతున్నాయి.

**ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చొరవతో నూతన భవనం**

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చొరవతో ముక్కు నరసా రెడ్డి పేరు మీద నందితశ్రీ - నివేదితశ్రీ డెవలపర్స్ వెంచర్ నిర్వాహకులు నూతన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పనులు పీ4 కార్యక్రమం ద్వారా చకచకా పనులు జరుగుతున్నాయి. దాదాపు రూ.2కోట్లతో అధునాతన సౌకర్యాలతో నూతన భవన నిర్మాణం ఏర్పాలు కానుంది. ప్రత్యేకంగా రికార్డు గది, సబ్‌రిజిస్ట్రార్ చాంబర్‌లో వివిధ రకాల సేవలతో సిబ్బంది లాంజ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా పై అంతస్తులో అధునాతన హంగులతో ఉన్నతాధికారి విశ్రాంతి గది నిర్మాణం కానుంది. కనిగిరి, పామూరు, హెచ్‌ఎంపాడు, వెలిగండ్ల, సీఎస్‌పురం, పీసీపల్లి మండలాల ప్రజలకు అనుకూలంగా మధ్యే మార్గంలో పామూరు రోడ్డులోని హెరిటేజ్ వద్ద ఉన్న వెంచర్‌లో ఏర్పాటైతున్న నూతన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఈ ఏడాది నవంబరు నెల చివరికే తయారయ్యేలా చకచకా పనులు జరుగుతున్నాయి.



రూ.2కోట్లతో ఇప్పటికే పునాదులు పూర్తయిన నూతన భవనం

# వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

- ప్రమాదవశాత్తూ సాగర్ కాలువలో పడిన దివ్యాంగుడు
- కాపాడబోయి ప్రాణాలు కోల్పోయిన టీడీపీ యువ నాయకుడు



వలేటి వెంకటేశ్వర్లు(ఫైల్)



నివాళులర్పిస్తున్న దర్శి నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత సాగర్ దంపతులు

ముండ్లమూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద ఉల్లగల్లు గ్రామానికి చెందిన వలేటి శేషయ్య ధనలక్ష్మి కుమారుడు, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జ్ వలేటి వెంకటేశ్వర్లు(27) ప్రమాదవశాత్తూ సాగర్ కాలువలో పడి మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో జరిగింది. గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా ఊరేగింపుగా గ్రామానికి చెందిన యువకులు వినాయక విగ్రహాన్ని రెడ్డినగర్ సమీపంలోని నాగార్జున సాగర్ కాలువలో నిమజ్జం చేసేందుకు వెళ్ళారు. రాత్రి సమయం కావటంతో అదే గ్రామానికి చెందిన మాదాల రామాంజనేయులు అనే మూగ యువకుడు నిమజ్జనం చేసే సందర్భంగా మునిగి పోయాడు. అతన్ని కాపాడేందుకు అదే గ్రామానికి చెందన బొట్ల నాగేశ్వరరావు, వలేటి వెంకటేశ్వర్లు కాలువలోకి దిగారు. కాలువ ఉధృతంగా ప్రవహించటంతో వెంకటేశ్వర్లు మునిగిపోయాడు. రామాంజనేయులు, నాగేశ్వరరావులను మాత్రం బయటకు తీసుకువచ్చారు. వెంకటేశ్వర్లు ఎంత సేపటికీ రాకపోవటంతో మరి కొంతమంది కాలువలోకి దూకి గాలించగా గంట తరువాత మృతదేహాన్ని బయటకు తీశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరు మున్నీరయ్యారు. వెంకటేశ్వర్లుకు ఐదు సంవత్సరాల క్రితం రాజ్యలక్ష్మితో వివాహమైంది. మృతుడి భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

**వెంకటేశ్వర్లు కుటుంబాన్ని ఆదుకుంటాం : గొట్టిపాటి లక్ష్మి**

వలేటి వెంకటేశ్వర్లు సాగర్ కాలువలో ప్రమాద వశాత్తు పడి మృతి చెందారన్న విషయం తెలుసుకున్న వెంటనే దర్శి నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులు... మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. లక్ష్మీ మాట్లాడుతూ వెంకటేశ్వర్లు టీడీపీకి మంచి కార్యకర్త అని, ఏ కార్యక్రమం నిర్వహించిన చురుగ్గా పాల్గొనేవాడని, వారి కుటుంబాన్ని పార్టీ పరంగా ఆదుకుంటామని తెలిపారు.



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

# నల్లబర్లీని ప్రభుత్వమే కొనాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నల్లబర్లీ పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జే జయంతిబాబు డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన నల్లబర్లీ పొగాకు రైతులకు డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు తుబటి శ్రీకాంత్ అధ్యక్షత వహించారు. ధర్నాలో జయంతిబాబు మాట్లాడుతూ గత ఏడాది జిల్లాలో ప్రైవేటు కంపనీలు పొగాకు కొనుగోలు చేస్తామని చెప్పి తీర పంట చేతికి వచ్చాక కొనుగోలు చేయకుండా మోసం చేశారని ఆరోపించారు. రైతులు వంద రోజుల పాటు ఫలితంగా ప్రభుత్వం రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. జిల్లాలో ఆరువేల మెట్రిక్ టన్నుల పొగాకు నిల్వ ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు లెక్కతేల్చారని తెలిపారు. తీరా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కేవలం వెయ్యి మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని ఆరోపించారు. కొనుగోలు ప్రారంభించి రెండు నెలలు గడిచినా ఇంత వరకు రైతులు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం రైతుల వద్ద నుంచి కేవలం 17 శాతం పొగాకు మాత్రమే కొనుగోలు చేయగా ఇంకా 83శాతం పొగాకు నిల్వ ఉందన్నారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కనుమర్తి సుబ్బారావు, చెరుకూరి వాసు, నల్లూరిప్రసాద్, పోకిరి నాగరాజు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, ముత్తుముల, ఉగ్ర, కందుల, కలెక్టర్, ఎస్పీ

# పోలీసులపై మంత్రి స్వామి ఆగ్రహం

- విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కేసుల వారీ సమీక్ష

ఒంగోలుక్రైం, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కేసులు పరిష్కారంలో అలసత్వం వహించవద్దని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో గల కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మంత్రి స్వామి సమీక్ష నిర్వహించారు. 2023 నుంచి ఎస్సీ, ఎస్టీ కేసులు పెండింగ్ ఉండటం ఏమిటి? ఎందుకు అలా ఉన్నాయి? అని ప్రశ్నించారు. 'ఒంగోలు సబ్‌డివిజన్‌లో నమోదు అయిన కేసులు ఎవరి వద్ద ఎన్ని కేసులు ఉన్నాయి, వాటి వివరాలు తెలియజేయండి' అని మంత్రి ప్రశ్నించారు. దీంతో పోలీసులు కొద్దిసేపు తర్జనభర్జనపడ్డారు. సమగ్ర సమాచారం లేకుండా సమావేశాలకు రావడం ఏమిటని పోలీసు అధికారులను నిలదీశారు. వచ్చే సమావేశానికి కేసుల వారీగా సమగ్ర సమాచారంతో రావాలని ఎస్పీ దామోదర్‌కు సూచించారు. మంత్రి స్వామి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సంక్షేమంతోపాటుగా వారి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులు సత్వరం పరిష్కరించి పరిహారం అందించేలా పోలీసు, రెవెన్యూ శాఖలు పనిచేయాలని అన్నారు. సివిల్ రైట్స్ డే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటుగా మీడియాలో ప్రాచుర్యం వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కేసుల దర్యాప్తులో వేగం పెంచాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన వాటికలకు సంబంధించి ప్రభుత్వ భూమలను పరిశీలించాలని, అలా లేనిచోట భూసేకరణ చేసి శ్మశాన స్థలాలు ఇవ్వాలని అధికారలను ఆదేశించారు.

కలెక్టర్ తమీమ్ అన్సారీయా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల్లో భాధితులకు సకాలంలో పరిహారం చెల్లించినప్పుడే న్యాయం చేకుర్చినట్లు అవుతుందని అన్నారు. అందుకు రెవెన్యూ, పోలీసుల సమన్వాయంతో పనిచేయాలన్నారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రస్తావించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఏఆర్.దామోదర్ మాట్లాడుతూ భాధిత కుటుంబాలకు మేలు జరిగే విధంగా దర్యాప్తులో జాప్యం లేకుండా పోలీసు అధికారులు పనిచేయాలన్నారు. బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లింపులో అలసత్వం విడనాడాలని కోరారు. సమావేశంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దనరావు, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల ఆశోక్‌రెడ్డి, డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, బియన్.విజయకుమార్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, మార్కాపురం సబ్‌కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, డీఆర్‌వో చిన ఓబులేసు, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, తదితర అధికారులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొండపి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనకర్లపూడి సమీపంలో ఓ ప్రైవేటు స్కూల్ సమీపంలో మర్రిపూడి మండలం చిలంకూరు గ్రామానికి చెందిన వేజెండ్ల గంగాధర్ (25) సోమవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఆర్టీసీ బస్సు కిందపడి మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం గంగాధర్‌కు ఆర్నెల్ల నెలల క్రితం చీమకుర్తి మండలం బూసరపల్లి గ్రామానికి చెందిన అమ్మాయితో వివాహం అయ్యింది. బూసరపల్లి గ్రామం భార్య వద్దకు మోటార్‌సైకిల్‌పై వెళ్లి తిరిగి కొండపి వచ్చి కూరగాయలు తీసుకుని తిరిగి చిలంకూరు గ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో అనకర్లపూడి గ్రామానికి సమీపంలోని ఓ ప్రైవేటు స్కూల్ సమీపంలో ముందుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును దాటుకునివెళ్లబోయి రోడ్డు మార్జిన్‌లో తన ద్విచక్రవాహనం అదుపుతప్పి బస్సుకింద పడి మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని కొండపి సీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు.

# పొగాకు పంటపై పన్ను తగ్గించేలా చూడాలి

- ఎంపీ మాగుంటకు వినతిపత్రం అందజేసిన రైతు నేతలు



ఎంపీ మాగుంటకు వినతిపత్రం అందజేస్తున్న పొగాకు రైతుల సంక్షేమ సంఘం నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో పలు రకాల వస్తువులకు ట్యాక్స్‌ను తగ్గించేందుకు జీఎస్టీ సమావేశం జరుగుతున్నందున ఆ సమావేశంలో పొగాకు పంటపై కూడా ట్యాక్స్ తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని నల్లరేగడి నెలల పొగాకు రైతుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. సోమవారం స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రెండుమూడు రోజుల్లో జీఎస్టీ ట్యాక్స్‌ను తగ్గించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నందన్నారు. ఈ సమావేశంలో పలు రకాల వస్తువులకు జీఎస్టీ తగ్గించే అవకాశం ఉన్నందున పొగాకు పంటకు కూడా జీఎస్టీ ట్యాక్స్ తగ్గించే విధంగా చూడాలని కోరారు. మాగుంటను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు పోతుల నరసింహరావు, పి.వెంకటేశ్వర్లు, పమ్మిభద్రిరెడ్డి, వడ్డెళ్ళ ప్రసాద్, భాస్కర్, చింపిరయ్యతో పాటు పలువురు సంఘం ప్రతినిధులు ఉన్నారు.

# మహిళల సంబరాలు

## మద్దిపాడు, యర్రగొండపాలెంలలో స్త్రీ శక్తి విజయోత్సవ సభలు

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న స్త్రీశక్తి పథకం విజయవంతంగా అమలు చేయడంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పథకం అమలు చేసినందుకు జిల్లాలోని యర్రగొండపాలెం, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో సోమవారం మహిళలు కృతజ్ఞతా ర్యాలీలు నిర్వహించారు. మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాల మేరకు తల్లికి వందనం, ఉచిత గ్యాస్, ఉచిత బస్సు ప్రయాణ పథకాలు అమలవుతున్నాయని టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. స్త్రీ శక్తి పథకాలు అమలు చేసినందుకు సోమవారం మహిళలు కృతజ్ఞతా భారీ ర్యాలీని నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు సాగిన ర్యాలీలో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు ఆర్టీసీ బస్టాండులో బస్సు ఎక్కి మహిళలకు ఉచిత బస్సు టికెట్లను అందజేశారు. ఉచిత ప్రయాణంపై మహిళల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం జరిగిన విజయోత్సవ సభలో కేక్ కట్‌చేసి సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, పుల్లలచెరువు మండల అధ్యక్షుడు ప్రసాద్, టీడీపీ నాయకులు చిట్యాల వెంగళరెడ్డి పాల్గొన్నారు.

**మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు : బీఎన్**

మద్దిపాడు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాటలు వేశారని స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మద్దిపాడు నటరాజకళా క్షేత్రంలో సోమవారం స్త్రీ శక్తి విజయోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అన్నిరంగాలలో ముందువరసలో ఉండాలని ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పగుండూరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా మండలంలోని నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



కృతజ్ఞతా ర్యాలీలో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు, మహిళలు



మద్దిపాడులోని సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్

# అంతర్ జిల్లాల బదిలీలకు 44 దరఖాస్తులు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్, మండల పరిషత్, మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న 45 మంది ఉపాధ్యాయులు అంతర్ జిల్లా బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో ఒక దరఖాస్తు తిరస్కరణకు గురికావడంతో 44 దరఖాస్తులను సోమవారం పాఠశాల విద్యా డైరెక్టర్ కార్యాలయానికి పంపించారు. వీటిలో 22 జీవిత భాగస్వామి(స్పౌజ్), 22 మంది పరస్పర బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నారు. ఇతర జిల్లాల నుంచి 36 మంది టీచర్లు మన జిల్లాకు వస్తున్నారు. వీరిలో 22 మంది పరస్పర బదిలీలు, 14 మంది స్పౌజ్ కేటగిరిలో దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను పాఠశాల విద్యాడైరెక్టర్ కార్యాలయంలో పరిశీలించిన అనంతరం ప్రభుత్వానికి పంపుతారు. అక్కడ ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేస్తే వీరి బదిలీ ఉత్తర్వులు జారీ అవుతాయి.


జేసీతో చర్చిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

## సమస్యలపై జేసీతో మాగుంట భేటీ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి భేటీ అయ్యారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో సోమవారం ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు అంశాలపై చర్చించారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి భూసేకరణతో పాటు అభివృద్ధి పనులపై చర్చించారు.

**అభివృద్ధిపై మాగుంట కార్యాలయంలో చర్చ**

కాగా స్థానిక రామనగర్‌లో మాగుంట కార్యాలయంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావులతో ఒంగోలు నగర అభివృద్ధిపై ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి చర్చలు జరిపారు. ముండ్లమూరు మండలం ఉమామహేశ్వరపురం సొసైటీ చైర్మన్ కాటూరి గురవయ్య ఈ సందర్భంగా ఎంపీ మాగుంటను కలిశారు.ఈసందర్భంగా మాగుంటను శాలువతో సత్కరించారు. అదేవిధంగా పలు ప్రాంతాలనుంచి వచ్చిన పార్టీ శ్రేణులు మాగుంటను మర్యాదపూర్వకంగా కలిశారు.


కలెక్టర్ అన్సారియాకు బొకే ఇస్తున్న ఒడా చైర్మన్ రియాజ్

## కలెక్టర్‌ను కలిసిన ఒడా చైర్మన్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సోమవారం కలెక్టర్ అన్సారియాను కలిసి బొకే ఇచ్చి అభినందించారు. ఈసందర్భంగా ఒడాకు సంబంధించి పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.



మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా కార్యదర్శి వెంకట్రావు

## లోగ్రేడ్ పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

చీమకుర్తి,సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): లోగ్రేడ్ పొగాకును క్వింటా రూ.20వేలకు తగ్గకుండా ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతుసంఘ జిల్లా కార్యదర్శి పమిడి వెంక ట్రావు డిమాండ్ చేశారు. రైతుసంఘ 9వ మండల మహా సభలను సోమవారం చీమకుర్తిలో ఘనంగా నిర్వహించారు. అనం తరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుమ్మిత శ్రీనివాస రెడ్డి, కార్యదర్శిగా బెజవాడ శ్రీనివాసరావు, సభ్యులుగా కొల్లూరి వెంకటే శ్వర్లు, మాదాల నరసింహారావు, చిన్నపురెడ్డి, రామాంజ నేయ రెడ్డి, అంజనేయులు, ఏడుకొండలు, శ్రీను, కోటయ్య, లక్ష్మయ్యలను ఎన్ను కున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు జయంతి బాబు, పల్లాపల్లి ఆంజనేయులు, కంకణాల వెంకటేశ్వర్లు,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకొని మహిళ మృతి

కనిగిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని మహిళ మృతి చెందింది. ఈఘటన సోమవారం రాత్రి మండలంలోని మాచవరం ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. ఎస్ఐ టి.శ్రీరాం తెలిపిన వివరాల ప్రకారం కుడుములు మరియమ్మ (34) భర్త యోహానుతో కలసి తన పుట్టినిల్లు ఎర్ర ఓబనపల్లి గ్రామంలో వివాహ వేడుక నిమిత్తం భర్తతో కలసి వెళ్ళింది. వేడుక అనం తరం మృతురాలి సోదరుడు సాల్మన్ దంపతులిద్దరిని కనిగిరి పట్టణంలోని పామూరు బస్టాండు వద్ద సోమవారం ఉదయం బైక్‌పై దించి వెళ్ళాడు. వారిరువురు ఆటోలో స్వగ్రామమైన మాచవరానికి వెళ్ళారు. మధ్యాహ్న సమయంలో మృతురాలి భర్త యోహాను కనిగిరికి వచ్చారు. సాయంత్రం సమయంలో ఇంటికి కర్రీస్ తీసుకెళ్ళేందుకు భార్యకు ఫోన్ చేయగా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో ఆయన వదినకు తెలపగా, ఆమె వెళ్ళి చూడగా తలుపుకు లోపలివైపు గడియ పెట్టుకుని నిద్రపోతున్నట్టు తెలి పింది. తిరిగి గంట తర్వాత యోహాను ఫోన్ ద్వారా ప్రయ త్నించగా ఎలాం టి స్పందన లేకపోవటంతో తన సోదరుడు విజయ్‌కు చెప్పి వెళ్ళి చూడా లని చెప్పాడు. అతను తలుపును బద్ధలుకొట్టి లో పలికి వెళ్లిచూడగా, ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉండటాన్ని గమనించి యోహానుకు చెప్పాడు. స మాచారం అందుకున్న ఎస్ఐ శీరాం సంఘటనా స్థలికి చేరకుని మరియమ్మ మృతదేహాన్ని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు తెలిపారు.

## వివాదాస్పదంగా మారిన పంచాయతీ స్థలం

ముండ్లమూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు పంచాయతీ సర్వే నెంబరు 168 ప్రభుత్వ స్థలంలో ఇటీవల ఆక్రమణలను తొలగించారు. ఈస్థలంలో వైసీపీ మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి అక్రమంగా షాపులు నిర్మించుకోవడంతో గత నెలలో పంచాయతీ అధికా రులు, రెవెన్యూ అధికారులు, పోలీసులు సంయుక్తంగా ఆక్రమణలను తొల గించారు. ఈక్రమంలో తాము దేవుడికి ఇచ్చిన స్థలమని పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. అయితే, ఆదివారం రాత్రి వైసీపీ మండల కన్వీనర్ కుటుంబసభ్యులతో పాటు మరికొంతమంది తాము దేవుళ్ళకు ఇచ్చామని చెప్పుకుంటున్న స్థలంలో ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. లక్ష్మీనరసింహ స్వామి, ఆంజనేయ స్వామి విగ్రహాలను ఏర్పాటుచేస్తున్నట్టు భూమి పూజ కూడా నిర్వహించారు. ఇందుకుసంబంధించి సోమవారం సాయంత్రం పంచాయతీ అధికారి మౌలాలి ఇన్‌చార్జ్ ఎంపీడీవో అబ్దుల్ రహీంకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

# ఎన్టీఆర్ భరోసాతో ప్రతి ఇంటిలో ఆనందం

**నగరంలో పింఛన్‌లు పంపిణీ చేసిన మాగుంట, దామచర్ల**

**ఒంగోలులో 20,403 మంది లబ్ధిదారులకు రూ. 8.94 కోట్లు పంపిణీ**

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్‌తో ప్రతి ఇల్లు సంతోషంగా ఉండాలన్నదే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని, ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు ఎంపీ మాగుంట శ్రీనివాసరావు, ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం నగరంలోని 33వ డివిజన్‌లోని కొత్తడొంకలో పర్యటించి అర్హులైన లబ్ధిదారులకు నేరుగా ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ సూపర్ సిక్స్‌లో భాగంగా తొలి హామీలో భాగంగా పింఛన్‌లు పెంచామన్నారు. పేదవారికి ఆరోగ్యంపరంగా, కుటుంబ అవసరాలకు పింఛన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తామన్నారు. త్వరలోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం లభిస్తుందని తెలిపారు. అలాగే రేషన్ కార్డులను స్మార్ట్ కార్డు రూపంలో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. అలాగే నగర సుందరీకరణ కోసం కార్పొరేషన్ ఆధ్వర్యంలో నాలుగు వేల మొక్కలు నాటుతామని, అందులో విద్యార్థులను భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఒకరోజులోనే నూరు శాతం పింఛన్‌లు పంపిణీ చేశామని తెలిపారు. కమిషనరు కే.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 20,403 మంది లబ్ధిదారులకు వృద్ధాప్య, వితంతు, ఒంటరి, దివ్యాంగుల, ట్రాన్స్ జండర్ పింఛన్‌లు రూ.8,94,72,500 అందిస్తున్నామని తెలిపారు.


మంగమూరులో పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఈ సందర్భంగా మాగుంట, దామచర్ల కొత్తడొంకలోని ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పారిశుధ్యం సమస్యను వారి దృష్టికి తీసుకురాగా సంబంధిత శానిటరీ అధికారులను పిలిపించి తక్షణమే పారిశుధ్యం మెరుగుపరచాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే విద్యుత్ స్తంభాల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు బండారు మదన్, మేడికొండ మోహన్‌రావు, నల్లూరి రవి, గంగవరపు కృష్ణమోహన్‌రావు, కట్టా లక్ష్మీదేవి, బెల్లం సత్యం తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారుకి పింఛన్ అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, పక్కన మేయర్, కమిషనర్

**కూటమి పాలనలో ప్రజలు సుభిక్షం**

సంతనూతలపాడు : కూటమి పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మంగమూరు గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను దిగ్విజయంగా అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, నాయకులు ఎన్. కృష్ణారావు, ఎన్.నారాయణరావు, ఏ.శ్రీనివాసరావు, కొండసింగురాజు, బుజ్జి, గోపి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**కలెక్టర్ తమీమ్ అన్సారియా**

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మీకోసంలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణతో కలిసి కలెక్టర్ అన్సారియా అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రీ ఓపెన్ కాకుండా సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీల పరిష్కారంపై ప్రతిశాఖలో


మీకోసంలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఆడిట్ టీంలతో పాటు నోడల్ అధికారిని ఏర్పాటు చేశామని, ఆ ఆడిట్‌లో పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. ఆయా శాఖలకు సంబంధించి డాక్యుమెంట్స్‌ను ఈపీటీఎస్ వెబ్‌సైట్‌లో రోజూ అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, వరకుమార్, జాన్సన్‌తో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.


ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

● 2008 డీఎస్సీ గ్రేడ్-2 తెలుగు పండిట్ రోస్టర్ కం మెరిట్ జాబితాలో అక్రమాలపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితిరాష్ట్ర అధ్యక్షుడు పొటికలపూడి జయరాం కోరారు.ఈమేరకు మీకోసంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి న్యాయంచేయాలని కోరారు.

**బాధితులకు సత్వర న్యాయం అందిస్తాం**

**- ఎస్పీ ఏఆర్ దామోదర్**

ఒంగోలుక్రైం,సెప్టెంబరు1(ఆంధ్ర జ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి సత్వర న్యాయం అందిస్తామని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమానికి జిల్లా నలుమూల నుంచి బాధితులు వచ్చి తమ వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే స్పందించి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అన్నారు. సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ రమణకుమార్, సీఐలు దుర్గాప్రసాద్, జగదీష్, పాండురంగారావు సిబ్బంది పాల్గొన్నారు.

**డొంక పోరంబోకు ఆక్రమణను అడ్డుకోండి**

సంతనూతలపాడు, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): డొంక పోరంబోకు స్థలం ఆక్రమణను అడ్డుకోవాలని సోమవారం సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్ నారాయణరెడ్డికి పేర్నమిట్టకు చెందిన మందాశేఖరరావు అర్జీని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేర్నమిట్ట 40వ డివిజన్ సమీపంలోని సర్వేనెంబరు 393లో డొంక పోరంబోకు భూమిని దాని పక్కనే ఉన్న వ్యక్తి ఆక్రమించి పిల్లర్లు వేసి, కంచె నిర్మాణం చేపట్టినట్లు అర్జీలో పేర్కొన్నారు. దీనిపై తహసీల్దార్ నారాయణరెడ్డిని వివరణ కోరగా సంబంధిత స్థలం వద్దకు సర్వేయరును పంపించి వచ్చిన నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.


రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

## మోదీ తల్లిపై వ్యాఖ్యలకు బీజేపీ నిరసన

● రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

ఒంగోలు కలెక్టరేట్,సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తల్లిపై బిహార్‌లో కాంగ్రెస్ పార్టీ అధినాయకుడు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై భారతీయ జనతాపార్టీ నాయకులు మండిపడ్డారు. బీజేపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్య యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం అక్కడి అంబేడ్కర్ విగ్రహం వద్ద రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ తల్లిపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. వెంటనే రాహుల్ గాంధీని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్య యాదవ్ మాట్లాడుతూ మోదీ తల్లిని అసభ్యకరంగా మాట్లాడటం దుర్మార్గంగా ఉందన్నారు. రాహుల్‌గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పీవీ కృష్ణారెడ్డి, మాకినేని అమరసింహ, టి. సత్యవతి, అపర్ణ, బొద్దులూరి ఆంజనేయుల, పి.దామోదర్, రాజేష్ వర్మ, పి.తిరుమలరావు, రాజశేఖర్, రాధాకృష్ణమూర్తి, కల్యాణ్‌రెడ్డి, బాల కోటయ్య, సుధాకర్, గుర్రం రంగనాథ్ తదితరులు ఉన్నారు.

## ప్రయాణికుల బ్యాగులు దొంగిలించే మహిళ అరెస్టు

● రూ. 8 లక్షల విలువైన బంగారం ఆభరణాలు స్వాధీనం

● వివరాలు వెల్లడించిన సీసీఎస్ సీఐ

ఒంగోలుక్రైం,సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): బస్సులలో ప్రయాణికుల వద్ద బ్యాగు లు దొంగిలించే మహిళను అరెస్టు చేసి రూ. 8 లక్షల విలువైన బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ సీఐ జగదీష్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో సీఐ మాట్లాడుతూ సింగరాయకొండ సుబ్బారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న అమావాస్య నరసమ్మను ఆదివారం మధ్యాహ్నం స్థానిక భాగ్యనగర్ 4 లైన్ వద్ద అరెస్టు చేసి రూ. 8 లక్షలు విలువైన బంగారం నగలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ఏడాది జనవరి 16 న ఇండ్ల నాగలక్ష్మి ఒంగోలు నుంచి నెల్లూరు ఆర్టీసీ బస్సులో వెళుతుండగా అమె పక్కన ప్రయాణికురాలుగా కూర్చోని బ్యాగ్‌లో ఉన్న బంగారం ఆభరణాలను దొంగిలించారు. ఈమేరకు ఒంగోలు వన్‌టౌన్‌లో పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేశారు. పాతనేరస్థురాలైయిన నరసమ్మను అరెస్టు చేసి అమె వద్ద దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితురాలు నరసమ్మపై 2014 నుంచి నెల్లూరు, గుంటూరు, పశ్చిమగోదావరిలో కేసులు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో ఒంగోలు వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు, ఏఎస్సై టి.బాలంజనేయులు, కానిస్టేబుళ్లు కే.రవి, సీహెచ్ అంజిబాబు,పి.రఘు, మహిళా కానిస్టేబుల్ వి.లక్ష్మి, హోంగార్డు సుజాత ఉన్నారు.

## స్వామిత్వ సర్వేను 15లోపు పూర్తి చేయాలి

● ఇన్‌చార్జి డీపీవో వెంకటేశ్వరరావు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న ఆస్తులకు హక్కులను కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వామిత్వ సర్వేను ఈనెల 15వతేదీలోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ ఇన్‌చార్జి అధికారి ఎం. వెంకటేశ్వరరావు ఆదేశించారు. సోమవారం డీపీవో కార్యాలయంనుంచి డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో స్వామిత్వ సర్వేను సర్వే అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ ఉద్యోగుల సహకారం తీసుకొని వేగవంతంచేయాలన్నారు. స్వామిత్వ సర్వేలో ఏమైనా ఇబ్బందులు ఉంటే సర్వేయర్లతో చర్చించుకొని అందుకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. స్వామిత్వ సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వరరావు ఆదేశించారు.

## ఫీజు రీయింబర్సును వెంటనే విడుదల చేయాలి

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : 2023-24 ఏడాదికి సంబంధించిన ఫీజు రీయింబర్సుమెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని తెలుగునాడు మెడికల్ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం. రామారావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పలు విద్యా సంస్థలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నుంచి చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజు చెల్లింపుల కోసం కాలేజి యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడి చేయకుండా తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

## సంతనూతలపాడు ఎంపీడీవోగా మద్దిపాడు ఏవో

సంతనూతలపాడు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు బాపట్ల ఈటీసీ కేంద్రంలో నెల రోజుల పాటు జరిగే శిక్షణలో పాల్గొంటుండటంతో ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా మద్దిపాడు ఏవోగా పనిచేస్తున్న డీఎస్‌వి ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు ప్రసాద్‌కు మండలపరిషత్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

# ఘనంగా నిమజ్జనాలు


తీరంలో నిమజ్జనానికి తరలిస్తున్న భారీ వినాయకుడు

**కొత్తపట్నం తీరానికి బారులు తీరుతున్న విగ్రహాలు**

**భక్తుల ప్రత్యేక పూజలు**

కొత్తపట్నం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం తీరానికి సోమవారం కూడా గణనాథుడి విగ్రహాలను ఎక్కువ సంఖ్యలో తీసుకువచ్చి భక్తులు నిమజ్జనం చేశారు. మండలంలోని కొత్తపట్నంతో పాటు మడనూరు. ఈతముక్కల తీరాల్లో అధికంగా భక్తులు విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు లారీలు,


తీరంలో పూజలు చేస్తున్న భక్తులు

బస్సులు, ట్రాక్టర్లు, మినీ లారీలు, కార్లు, ద్విచక్ర వాహనాలతో వేలాది మంది భక్తులు ఆదివారం తీరానికి చేరుకున్నారు. వినాయక విగ్రహాలతో ఊరేగింపులు, డప్పుల మోతలతో తీరానికి చేరుకున్న భక్తులు తమ విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. వినాయక విగ్రహాలను తరలించే కొత్తపట్నం-ఒంగోలు రహదారిలోని చింతల, కొప్పోలు, అల్లూరు, కొత్తపట్నం, కె పల్లెపాలెం గ్రామాల వాసులు ఆసక్తిగా తిలకించారు. నిమజ్జనం సందర్భంగా తీరంలో భక్తుల కోలాహలంగా నెలకొంది. మహిళలు కూడా విగ్రహాల వెంట వేల సంఖ్యలో తీరానికి తరలివచ్చారు. జిల్లాలోని పలుప్రాంతాల నుంచి నిమజ్జనానికి వాహనాలు తరలి వస్తుండటంతో కె పల్లెపాలెం గ్రామంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ఈనేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగాఉంటూ ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. వాహనాలను ఊరి బయటే ఆపేసి విగ్రహం ఉన్నవాహనాన్ని మాత్రమే తీరం వరకు అనుమతిస్తున్నారు.

**ఘనంగా గణేష్ ఉత్సవాలు**

ఒంగోలు కార్పొరేషన్ : గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆరవ రోజైన సోమవారం నగరంలోని ద్వారకానగర్, కుట్టుబోయిన పాలెం, కేశవ స్వామి పేట, సీఆర్పీ క్వార్టర్స్, గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ పలు ప్రాంతాలలో వినాయక విగ్రహాల వద్ద విశేష పూజలు నిర్వహించారు. స్థానిక ద్వారకా నగర్‌లో విగ్రహం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొని పూజలు చేశారు.


నిమజ్జనానికి సిద్ధంగా లంబోధరుడు

**సంతనూతలపాడులో**

: సంతనూతలపాడులో పలు చోట్ల ఏర్పాటుచేసిన గణనాథులకు సోమవారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించి అనంతరం నిమజ్జనానికి తరలించారు. సంతనూతలపాడు బస్టాండ్ సమీపంలో ఏర్పాటుచేసిన విగ్రహం వద్ద కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం లడ్డూ వేలంపాటలో పి.గుడిపాడుకు చెందిన టి.నాగరాజు వినాయకుని లడ్డూను రూ.15వేలకు, కలశాన్ని సంతనూతలపాడుకు చెందిన చిట్టిశెట్టి అంకారావు రూ.11,116లకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.


సంతనూతలపాడులో వినాయకుని విగ్రహం వద్ద కోలాటం నిర్వహిస్తున్న భక్తులు

**మట్టి వినాయక విగ్రహం తయారు చేసిన రామయ్యకు సన్మానం**

ఒంగోలు(రూరల్), :ఒంగోలు మండలం మండవవారిపాలెం గ్రామంలోని శ్రీకోదండరామ స్వామివారి దేవాలయంలో సోమవారం మట్టి వినాయక విగ్రహం తయారు చేసిన రామయ్యను గ్రామస్థులు శాలువాలతో ,పూలదండలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మారెళ్ల రామకృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

**రూ.50,001 కి లడ్డూ వేలం**

ఒంగోలు నగరం కొప్పోలు శ్రీచెన్నకేశవ స్వామివారి దేవాలయంలో వినాయక విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం జరిగిన లడ్డూవేలంలో రూ.50,001 కి పాలకేంద్రం అధ్యక్షుడు కాట్రగడ్డ నాగేశ్వరరావు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ వేలంలో పాడిన లడ్డూను గ్రామస్థులకు పంచిపెడతానని తెలిపారు. మరికొంత లడ్డూను పంట పొలాలలో చల్లుతానని తెలిపారు. ఈకార్యక్రమంలో దేవాలయ అర్చకుడు పరాంకుశం సమీర్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.


నగరంలో భారీ వినాయకుడిని ఊరేగింపుతో తరలిస్తున్న భక్తులు

# సంక్షోభంలోనూ సంక్షేమం.. ఆ ఘనత ప్రభుత్వానిదే

### పింఛన్‌ల పంపిణీలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజల కోసం ప్రభుత్వం సంక్షోభం ఉన్నా సంక్షేమాన్ని అందిస్తున్నదని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని 17, 18 వార్డులలో భాగంగా నల్ల బండ బజారులో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు పింఛన్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లు జగన్‌మోహన్ రెడ్డి పింఛన్‌దారులను మోసం చేశారని, రూ.1000 పెంచేందుకు నాలుగేళ్లు పట్టిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్క సంతకంతో రూ.1000 పెంచి ప్రతినెలా 1వ తేదీనే వృద్ధులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు, పూర్తిస్థాయి దివ్యాంగులకు రూ.15000 పంపిణీ చేస్తూ దేశంలోనే అత్యధికంగా సామాజిక పింఛన్‌లు అందిస్తున్న ఘనత చంద్రబాబుదేనని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, మున్సిపల్ కమీషనర్ ఈవీ రమణబాబు పాల్గొన్నారు.

### ఇది ప్రజా ప్రభుత్వం : ఎమ్మెల్యే కందుల

మార్కాపురం : ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. తూర్పువీధిలో సోమవారం ఉదయం సామాజిక భద్రత పింఛన్‌లను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఎక్కువ మొత్తంలో పింఛన్ల కోసం నిధులు కేటాయిస్తున్నది ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో ఏఎమ్‌సీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు దగ్గుల శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు గుంటక వెంకటేశ్వరరెడ్డి, అచ్చిరెడ్డి, చెన్నారెడ్డి, గొలమారి బాలంకిరెడ్డి, వెంకటరెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తర్లుపాడు : మండలం కలుజువ్వలపాడు పంచాయతీ మేకలవారి పల్లెలో పింఛన్లను ఎమ్మెల్యే కందుల సోమవారం పంపిణీ చేశారు. వృద్ధుల వద్దకు వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని పింఛన్లు పంపిణీ చేశారు. పలువురు దివ్యాంగులకు కూడా పింఛన్‌లు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, టీడీపీ నాయకులు అచ్చిరెడ్డి, మహేశ్, బాలయ్య, వెంకటరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పింఛన్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

రాచర్ల : ప్రభుత్వం ప్రతిష్ఠాతకంగా పేద ప్రజల సంక్షేమం కోసం పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్మును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.వెంకట రామిరెడ్డి అన్నారు. మండలంలోని జేపీచెరువు అనుములపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు ఏవి సురేష్, వీరగరుడు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



వైపాలెంలో పింఛన్ ఇస్తున్న ఎరిక్షన్‌బాబు



తూర్పువీధిలో పింఛన్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే కందుల

పెద్దదోర్నాల : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్‌లు అందజేస్తున్నట్లు ఒంగోలు పార్ల మెంట్ టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య అన్నారు. మండలంలోని హసనాబాద్ గ్రామంలో సోమవారం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్‌లపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, అలాంటి మాటలను ప్రజలు నమ్మొద్దన్నారు. ప్రజా ప్రభుత్వ పాలనలో అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరుగదని భరోసా ఇచ్చారు. వైసీపీ పాలనలో చాలా మంది అనర్హులు పింఛన్ పొందారని, వారివల్ల అర్హులకు నష్టం జరుగుతుందన్నారు.

### అవ్వాతాతల కళ్లల్లో ఆనందం : ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం : అవ్వతాతల్లో కళ్లల్లో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు కల అని, అందుకే ప్రతినెలా 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను అందజేస్తున్నారని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. స్థానిక బ్యాంకు వీధిలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను లబ్ధిదారులకు ఎరిక్షన్‌బాబు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, టీడీపీ ముఖ్యనాయకులు వేగినాటి శ్రీను, గోళ్ల సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు పీ మల్లికార్జునరావు, కొత్తమాసు సుబ్రహ్మణ్యం, చిట్యాల వెంగళరెడ్డి, తోట మహేష్ పాల్గొన్నారు.



అధికారులకు విజ్ఞప్తి చేస్తున్న రైతులు

## వరి సాగుకు కంభం చెరువు నీరివ్వండి

### ఇరిగేషన్ అధికారులకు రైతుల విజ్ఞప్తి

కంభం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం కంభం చెరువులో 7 అడుగుల మేరా నీరు వచ్చినందున కంభం మండలం చిన్నకంభం పరిధిలో వరినాట్లు వేసుకునేందుకు నీరు వదలాలని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసనాయక్‌కు చిన్న కంభం ప్రాంత రైతులు విజ్ఞప్తి చేశారు. సోమవారం రైతులు కంభం, ఇరిగేషన్ ఏఈని కలిసి కంభం మండలంలో సరైన వర్షాలు లేక తాము వరి పంటను సాగు చేయలేకపోతున్నామన్నారు. ప్రస్తుతం కంభం చెరువులో 7 అడుగుల మేర నీరు ఉన్నందున తూము ద్వారా నీరు వదిలితే సుమారు 1500 ఎకరాలలో వరినాట్లు వేస్తామని రైతులు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఏఈ శ్రీనివాస నాయక్ డీఈ దృష్టికి విషయం తీసుకెళ్లి నీరు వదిలే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

## నలుగురిని గాయపరిచిన పిచ్చి కుక్క

రాచర్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపి చెరువు గ్రామంలో పిచ్చికుక్క నలుగురిని గాయపరిచింది. ఈ ఘటన సోమవారం ఉదయం జరిగింది. ఎంపీటీసీ సభ్యుడు జెట్టి వెంకటేశ్వర్లు, సంకుల రంగయ్య, గుమ్మ రాజేశ్వరరావు, పోలెం వెంకటేశ్వర్లు పిచ్చి కుక్క దాడిలో గాయపడగా, వారిని వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. పెన్షన్ల పంపిణీ పరిశీలన చేస్తున్న ఎంపీడీవో ఎస్ వెంకట రామిరెడ్డి విషయం తెలుసుకొని ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లును పరామర్శించారు. అధికారులు కుక్కల బెడద తప్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.



రైల్వే ఉద్యోగి షకీలాను సన్మానిస్తున్న కళావేదిక ప్రతినిధులు

## షకీలాకు 'తెలుగుతేజం' పురస్కారం

గిద్దలూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరుకు చెందిన రైల్వే కమర్షియల్ క్లర్క్ షేక్ షకీలాకు అరుదైన గౌరవం దక్కింది. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రైల్వే ఉద్యోగి షకీలాకు తెలుగుతేజం జాతీయ పురస్కారాన్ని అందజేశారు. నర్సరావుపేటలో జరిగిన ఈ కార్యక్రమంలో షకీలాకు పూలమాలలు వేసి శాలువా కప్పి జ్ఞాపిక, సర్టిఫికెట్‌తో కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కె.ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరినాగభూషణం, స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. రైల్వేలో ఉద్యోగం చేస్తూ తనదైన శైలిలో కవితలు, రచనలు రాస్తూ తెలుగు సంస్కృతిని కాపాడుతున్న షకీలాను పలువురు అభినందించారు.

## శ్రీనివాసులు మాస్టార్‌కు జాతీయ ప్రతిభ అవార్డ్



ప్రశంసాపత్రంతో ఉపాధ్యాయుడు శ్రీనివాసులు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నదోర్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మండ్ల శ్రీనివాసులుకు జాతీయ ప్రతిభ అవార్డు దక్కింది. సౌత్రన్ ప్రైవేటు లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్‌పీఎల్‌టీవో) సర్వేపల్లి రాధాకృష్ణ ఈ అవార్డును గుంటూరు చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో మాజీ ఎంఎల్‌సీ కెఎస్ లక్ష్మణ్‌రావు, వైవీ ఆంజనేయులు, చలపతి గ్రూప్స్ కౌన్సిల్ సభ్యులు కన్నా సోమవారం అందజేశారు. సొంత నిధులతో పాటు గ్రామ ప్రజల సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ఆర్గనైజేషన్ గుర్తించి తనకు అవార్డు అందజేసినట్లు శ్రీనివాసులు తెలిపారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డా. సాంబశివారెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మార్కాపురం విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు డా. ఐ.బాలసుబ్బారావు అన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో బాల సుబ్బారావు మాట్లాడుతూ.. ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏలు, పీఆర్‌సీలపై ప్రభుత్వం శ్రద్ధ వహించి వారి బకాయిలు ఇవ్వాలన్నారు. అనంతరం గుంటూరుకు సంబంధించిన డా.సాంబశివారెడ్డి ఎముకలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగులకు అవసరమైన ఎముకలకు సంబంధించి వ్యాధులకు మా ఆసుపత్రిలో ఈహెచ్‌ఎస్ కార్డుతో ఉచిత ఆపరేషన్లు, వైద్యం చేస్తామన్నారు.

## కదలని మురుగు

» పెరిగిన దోమల బెడద » రోగాలతో ప్రజలు సతమతం



వైపాలెం ప్రధాన రహదారిలో కాలువలో పేరుకున్న చెత్త

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న మురుగు కాల్వల్లో ఏళ్లుగా చెత్తను తొలగించడంలేదు. దీంతో మురుగు పారక దోమల వ్యాప్తి తీవ్రమవుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు కుడుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల కిందట పడిన వర్షాలకు కాలువలు నిండి మురుగు రోడ్లపైకి చేరింది. దోమలు, ఈగల బెడద పెరిగి రోగాలబారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మురుగు కాలువలను శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## డ్రోన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల

కొనకనమిట్ల, సెప్టంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిద్ధవరం పంచాయతీలోని యల్లమ్మ కిసాన్‌డ్రోన్ గ్రూప్ సభ్యులకు వ్యవసాయశాఖ ద్వారా అందించిన డ్రోన్‌ను సోమవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాలను అందజేస్తున్నట్లు చెప్పారు. 80 శాతం సబ్సిడీతో డ్రోన్‌లను అందిస్తున్నట్లు చెప్పారు. దర్శి ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ డ్రోన్ మొత్తం ధర రూ.9 లక్షల 80వేలు ప్రభుత్వ సబ్సిడీ రూ.7లక్షల 80 వేలు రైతువాటాగా రూ.2లక్షలు చెల్లించాలని చెప్పారు. వ్యవసాయ అధికారి ప్రకాశరావు మట్లాడుతూ వరిపొలాల్లో డ్రోన్ ఉపయోగించి జింక్‌సల్ఫేట్, సూక్ష్మదాతువు పోషకాలని పిచికారి చేయవచ్చన్నారు. దీనివలన సాంప్రదాయ పద్దతుల కంటే సమర్ధవంతంగా పైరుకు పోషకాలను అందించే వీలుంటుందని చెప్పారు. అంతేకాకుండా సులువుగా తకకర్కువ సమయంలో ఎకరానికి 10 నిముషాల వ్యవధిలో, తక్కువ నీటితో పిచికారి చేయవచ్చన్నారు. పాములు, విషజంతువుల భారినపడకుండా రైతులు ప్రాణపాయ ప్రమాదంలో పడకుండా సురక్షితంగా ఉండవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, పలువురు టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

### మానవత చైర్మన్‌గా నారాయణరెడ్డి

గిద్దలూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరులోని మానవత సేవా సంస్థ ఆత్మీయ సహకార సంఘం చైర్మన్‌గా యోగా గురూజీ బీఎస్ నారాయణరెడ్డిని నియమించారు. అనాథలు, తోడూనీడ లేని వారు మృతి చెందిన సందర్భాలలో యోగా గురూజీ నారాయణరెడ్డి దాతల సహకారంతో అంత్యక్రియలు చేస్తున్న విషయాన్ని గుర్తించి ఇక నుంచి అనాథ శవాలకు అంత్యక్రియలు చేసేందుకు తన సంస్థ ద్వారా మట్టి ఖర్చులు ఇవ్వాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షుడు శివారెడ్డి, సంస్థ ప్రతినిధులు గంజి వీరయ్య, రామకృష్ణారెడ్డి, రామచంద్రరెడ్డి పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే కందుల

కొనకనమిట్ల, సెప్టంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదుస్సులో ఆయన మాట్లాడారు. రైతులు పాసుపుస్తకాలు, ఆన్‌లైన్‌వంటి తదితర సమస్యలపై సతమతమౌతున్నారని, త్వరితగతిన భూసమస్యలను పరిష్కరించాలని ఉద్దేశంతోనే రెవె న్యూ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు నుంచి స్వయంగా ఎమ్మెల్యే అర్జీలను స్వీకరించి అధికారులతో మాట్లాడారు. అర్జీలు త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. మొత్తం 50 అర్జీలు అందినట్లు చెప్పారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్, పలువురు వీఆర్‌వోలు, సర్వేయర్లు, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### బుడ్డపల్లెను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం


తర్లుపాడు : కేతగుడిపి పంచాయతీ బుడ్డపల్లెను ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. గ్రామంలో రూ.2.93కోట్లతో అన్ని మౌలిక వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో సీసీ డ్రైనేజీకి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఒక్కో గ్రామాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పలు సమస్యలను గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పి.గోపినాత్ చౌదరి, నాయకులు ఎన్.కాశయ్య, శ్రీను, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణంలో తనిఖీ

ఎరువుల స్టాకు నిల్వలను ఈపీవోఎస్ మిషన్ నమోదు చేయాలి,

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఏవో నీరజ కామాక్షి ఎరువుల దుకాణంలో తనిఖీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ కృత్రిమ కొరత సృష్టించవద్దని, అధికరేట్లకు అమ్మవద్దని సూచించారు. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లు ఇవ్వాలని ఆదేశించారు.

# ఏకదంతుడికి విశేష పూజలు



తూర్పువీధిలోని నంది వాహనంపై గణపతి

గాజుల అలంకరణలో కోనేటి వీధి గణేశుడు

విజయలక్ష్మి వీధిలోని వినాయకుడు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వినాయక చవితి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. కోనేటి వీధిలో ఏర్పాటు చేసిన గణపతికి గాజులతో అలంకరణ చేశారు. మెయిన్ బజార్, తూర్పువీధి, శివాలయం, విజయలక్ష్మి వీధులలో వినాయకుని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి పలు ప్రాంతాలలో వినాయకులను నిమజ్జనానికి తరలించారు.

ఎర్రగొండపాలెం : పుల్లలచెరువు రోడ్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన మండపంలో గణేశునికి విగ్రహాన్ని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, చీదెళ్ల నాగేశ్వరరావు, అడుసుమల్లి రామచంద్రరావు, కొత్తమాసు సుబ్రమణ్యం, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా రైతుల కోర్కెల దినోత్సవం



జెండాను ఆవిష్కరించిన రైతు సంఘం నాయకులు

త్రిపురాంతకం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతుల కోర్కెల దినోత్సవాన్ని గాంధీనగర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. సంఘ జెండాను నియోజకవర్గ కార్యదర్శి బాజాల రామయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నూర్జహాన్, లక్ష్మి, మేరమ్మ, రవణమ్మ పాల్గొన్నారు.

## కుక్కల బెడద నుంచి కాపాడాలని వినతి



సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

మార్కాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో కుక్కల బెడదతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని వేములకోట పంచాయతీకి చెందిన పలువురు సోమవారం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీ కోసం కార్యక్రమంలో మొత్తం 21 అర్జీలు అందాయి. వేములకోట పంచాయతీలోని అన్ని గ్రామాల్లో వీధి కుక్కలు అధిక సంఖ్యలో ఉన్నాయని జంకె చిన్నవెంకటరెడ్డి తెలిపారు. ఇప్పటికే సంవత్సర కాలంలో ముగ్గురు చిన్నారులను కరవడంతో తీవ్ర గాయాలపాలయ్యారన్నారు. పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని తెలిపారు.

## బడిబాట పట్టించండి

కంభం, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి) : మండలంలో బడి ఈడు పిల్లలను బడిబాట పట్టించేందుకు మండల విద్యాశాఖ అధికారి అబ్దుల్ సత్తార్ సోమవారం వీధిబాట పట్టారు. పట్టణంలోని అరాఫత్ నగర్, అర్బన్ కాలనీ, పూసల బజార్, నాయక్ వీధి, రంగా వీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి, దీర్ఘకాలికంగా బడికి రాని విద్యార్థులను అసలు బడిలో చేరని పిల్లలను గుర్తించారు. ఈ సందర్భంగా డ్రాప్‌అవుట్ పిల్లలు తల్లిదండ్రులతో చర్చించి విద్యా ఆవశ్యకతను, సామాజిక విలువలను తెలుపుతూ ఆరోగ్య అవగాహన కలిగించారు. చేతుల పరిశుభ్రతను వివరిస్తూ పొడవుగా పెరిగిన గోర్లను అప్పటికప్పుడు కత్తిరింపజేశారు. పాఠశాల విద్య ప్రాధాన్యతను, పథకాలను, ప్రతిఫలాలను వివరించి బడిబాట పట్టించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి మురళీమోహన్ పాల్గొన్నారు.

## కాశినాయనకు ప్రత్యేక పూజలు

గిద్దలూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మిట్టమీదిపల్లి క్రాస్ రోడ్డు వద్ద గల కాశినాయన ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతి సుబ్బారావు స్వామీజీ, యోగా గురూజీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## బోరుకు మరమ్మతులు

పుల్లలచెరువు,సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగుపల్లి చెంచుగూడెంలో చెడిపోయిన తాగు నీటి బోరకు అసిస్ట్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించారు. సోమవారం సంస్థ ప్రతినిధులు బోరుకు సామగ్రి బిగించి నీరు వచ్చేలా మరమ్మతులు చేయించారు. గిరిజనులు సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్ట్ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, శ్రీనివాసరావు, హనుమంతరావు, పోలయ్య పాల్గొన్నారు.



సింగుపల్లి చెంచుగూడెంలో తాగు నీటీ బోరును బాగుచేయించిన అసిస్ట్ సంస్థ

## నేడు మెగా జాబ్ మేళా

దర్శి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో దర్శిలో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. దర్శి - కురిచేడు రోడ్డులోని పీబీఎస్ కల్యాణ మండపంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో జాబ్ మేళాను నిర్వహిస్తున్నారు. ఈఅవకాశాన్ని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ లక్ష్మి కోరారు.

## అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు

పామూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు హెచ్చరించారు. పామూరు పంచాయతీ పరిధిలోని గోపాలపురం ప్రాంతంలో ఎక్స్‌కవేటర్‌తో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తుండటంతో సోమవారం రెవెన్యూ సిబ్బంది ఆప్రాంతాన్ని పరిశీలించారు. సంఘటనాస్థలంలో ఉన్న ఎక్స్‌కవేటర్, మూడు ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ప్రభుత్వ భూముల్లో, వాగు, వంకల్లో, చెరువుల్లో అక్రమంగా మట్టి త్రవ్వకాలు చేపడితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఆర్ఐ శ్రీరాం అజయ్‌కుమార్, వీఆర్వో దినేష్, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఆర్థికసాయం

పామూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మానవతా సంస్థ తరుపున నిరుపేదలకు ఆర్థికసాయం అందజేసినట్లు సంస్థ చైర్మన్ కె.రామిరెడ్డి తెలిపారు. మండలంలోని పుట్టనాంనాయుడుపల్లి గ్రామానికి చెందిన మేడిద ప్రసన్నకుమారి భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు పడుతుంది. సంస్థ తరుపున రూ. 5 వేలు, దాతల సహకారంతో రూ.3 వేలు అందజేశారు. కాటంవారిపల్లె గ్రామానికి చెందిన కాటం వెంకట సుబ్బయ్య తల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా సంస్థ తరుపున రూ.5 వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో వి.వెంకటేశ్వరరెడ్డి, టి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## 6న మండల సర్వసభ్య సమావేశం

పామూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పామూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 6 న ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

పీసీపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో హనుమంతరావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నేరేడుపల్లిలో ఆయన పర్యటించారు. గ్రామంలో నిర్మించిన ఇంకుడుగుంతలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకుడుగుంతలతో గ్రామంలో దోమలసమస్య తగ్గుతుందన్నారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

పామూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలో విద్యను అభ్యసిస్తున్న సింగిల్ పేరంట్స్ కలిగిన ఐదుగురు విద్యార్థినులకు ఎంఈవో -1 కోటిరెడ్డి సొంత ఖర్చులతో దుస్తులు, పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను సోమవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కె .కరుణకుమారి, ప్రిన్సిపాల్ కటకం సజన, తదితరులు పాల్గొన్నారు.

## స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయాలి

పామూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొట్లగూడూరు గ్రామ ఎస్సీ కాలనీ సెంటర్‌లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేసి ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలని టీడీపీ విభిన్న ప్రతిభావంతుల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్ ఆర్.వాసుదేవరావుకు వినతిపత్రం అందజేశారు. అలాగే, రఘునాథపురం చర్చి సెంటర్ స్పీడ్ బ్రేకర్ ఏర్పాటుచేయాలని కోరారు. కాగా, భూ సమస్యలకు సంభందించి మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

## నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.11 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థాన హుండీల ఆదాయం రూ.11 లక్షల 42వేల 810 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. భైరవకోన ఈవో డి.వంశీకృష్ణ పర్యవేక్షణలో ధర్మకర్త చిన్నఆదినారాయణ, ఈవో నరసింహబాబు సమక్షంలో ఆలయ సిబ్బంది సోమవారం హుండీలను లెక్కించారు. రెండు నెలల 29 రోజులకు సంబంధించి ప్రధాన హుండీ ద్వారా రూ.10,82,065, అన్నదానం హుండీ ద్వారా రూ.60,745 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

## కురిచేడుకు చేరుకున్న సైకిల్ యాత్ర

కురిచేడు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యారంగ పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ చేపట్టిన సైకిల్ యాత్ర సోమవారం సాయంత్రం కురిచేడుకు చేరుకుంది. సైకిల్ యాత్రకు ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు కంకణాల ఆంజనేయులు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య స్వాగతం పలికారు. ఈసందర్భంగా కురిచేడులో ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడారు. అనతంరం ప్రభుత్వ వసతి గృహాలను సందర్శించారు. కార్యక్రమంలో సీహెచ్ వినోద్, వీరాస్వామి, కె.విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



మొగళ్లూరులో పెన్షన్‌లు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

వెలిగండ్ల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మొగళ్లూరులో వృద్ధులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదుర్కుంటున్నా ప్రజలకు ఎటువంటి ఇబ్బందిలేకుండా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. అధికారంలోకి రాగానే పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు ఒకేసారి పెంచి కూట మి ప్రభుత్వం అందజేస్తుందన్నారు. పింఛన్ల కోసమే ఏడాదికి రూ.34 వేల కోట్లు వెచ్చుస్తుందన్నారు. ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా అమలుచేస్తుందన్నారు.

30 ఏళ్ల క్రితం తొలిసారి సీఎంగా ఇదే రోజున చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టారని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు. ఇప్పటికీ నాలుగుసార్లు సీఎంగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ముఖ్యమంత్రిగా ప్రభుత్వ వ్యవస్థను ప్రజల వద్దకు తీసుకెళ్లేలా ప్రజల వద్దకు పాలన, జన్మభూమి, నీరు-మీరు, పచ్చదనం- పరిశుభ్రత పథకాల ద్వారా పాలన సంస్కరణలు శ్రీకారం చుట్టారనారు. రైతు బజార్లు ఏర్పాటుచేసి మధ్యవర్తుల దోపిడీని అరికట్టారన్నారు. విభజన అనంతరం రాజధాని లేని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సీఎంగా బాధ్యతలు చూపట్టారన్నారు. అమరావతిగా రాజధాని కలను ఆవిష్కరించారన్నారు. మళ్లీ ప్రజా తీర్పుతో 2024 ఎన్నికల్లో మిత్రపక్షాలతో కలిసి అఖండ విజ యాన్ని సాధించారని చెప్పారు. వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా తయారైన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పడుతు న్నారన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మ న్ శ్యామల కాశిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, కొండు భాస్కర్‌రెడ్డి, బైసని సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాభివృద్ధిలో మైలురాయి మ్యాజిక్ డ్రైన్

ప్రత్యేక టెక్నాలజీతో గ్రామాల్లో మ్యాజిక్ డ్రైన్లను నిర్మించడమనేది కొత్త మైలురాయి అని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని చోడవరం గ్రామ పంచాయతీలో రూ. 12 లక్షల ఉపాధి నిధులతో చేపట్టిన మ్యాజిక్ డ్రైన్‌లకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల వెడల్పు తక్కువగా ఉన్న గ్రామాల్లో వీటి నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు.

కాల్వలను మూడు లేయర్లగా తవ్వి ఒక్కో లేయర్‌ను ఒక్కో సైజ్ మెటల్‌తో నిర్మిస్తార న్నారు. ఇళ్ల నుంచి వచ్చిన మురుగునీరు ఎక్కడికక్కడ ఇంకిపోయేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, ఏపీవో నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



రమణారెడ్డిపాలెంలో మ్యాజిక్ డ్రైన్‌కు భూమి పూజ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ముండ్లమూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రా మాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని రమణారెడ్డిపాలెంలో రూ.26 లక్షల ఉపాధి నిధులతో చేపట్టిన మ్యాజిక్ డ్రైన్‌ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీలతో ప్రజలు ఆరోగ్యపరంగా ఉండటమే కాకుండా ఎటువంటి వ్యాధులు దరిచేరవన్నారు. వేములబండ- ఈదర రహ దారికి త్వరలోనే నిధులు మంజూరవుతాయని చెప్పా రు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దర్శి పర్యటనకు వచ్చినప్పుడు రహదారి గురించి వివరించి నట్టు చెప్పారు. అనంతరం గ్రామస్థుల నుంచి అర్జీలను స్వీకరించారు. గ్రా మంలో ఇంటింటికి వెళ్లి డాక్టర్ లక్ష్మి పింఛన్‌లు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో టీడీపీ నియోజ కవర్గ నాయకుడు కడియాల లలిత్‌సాగర్, ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఏపీవో వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని వేములబండ గ్రామస్థులతో కొద్దిసేపు మాట్లాడారు.

# విద్యుత్ తీగ అపహరణ కేసులో పురోగతి

దర్శి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగ చోరీ కేసును పోలీసులు ఛేదించినట్టు సమాచారం. ఆ కేసులో నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలిసింది. దర్శి, కురిచేడు రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన ఎంఎస్ఎంఈ పార్క్‌లో 950 మీటర్ల విద్యుత్ తీగను వారంరోజుల క్రితం దుండగులు అపహరించిన విషయం తెలిసిందే. చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు వీలుగా పార్క్‌లో ఇటీవల నూతన స్తంభాలువేసి తీగలు బిగించారు. కొద్దిరోజుల క్రితం పార్క్‌ను ప్రారంభించారు. విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు సంసిద్ధమవుతున్న సమయంలో ఊహించనివిధంగా సుమారు రూ.4 లక్షలు విలువచేసే విద్యుత్ తీగను కత్తిరించుకెళ్లారు. ఎంఎస్ఎంఈ పార్క్ పొలాల్లో ఉండటంవల్ల రాత్రిపూట జనసంచారం కనిపించదు. పాత గుంటూరు జిల్లాకు చెందిన దుండగులు విద్యుత్ తీగలను అపహరించినట్టు తెలిసింది. ఈ నిందితులు పొలాల్లో జనసంచారంలేని ప్రదేశాల్లో విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు దొంగలించి సొమ్ము చేసుకుంటున్నట్టు సమాచారం. పోలీసు విచారణలో అన్ని విషయాలు బయటపడే అవకాశం ఉంది.

# అర్హులందరికీ పింఛన్లు



దర్శిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య, టీడీపీ నాయకులు

దర్శి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అర్హులైన అందరికీ పింఛన్లు అందిస్తుందని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. గత 14 నెలలుగా క్రమంతప్పకుండా 1వ తేదిన పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. దర్శి పట్టణంలో సోమవారం ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వృద్ధులకు, దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఓర్వలేక అనేక రకాలుగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు అన్నివిషయాలను గమనిస్తున్నారన్నారు. పద్ధతి మార్చుకోకుంటే భవిష్యత్తులో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లచెరువు చిన్నా, మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, నారపుశెట్టి మధు, కౌన్సిలర్లు , తదితరులు పాల్గొన్నారు.

### పింఛన్లతో కుటుంబాలకు భరోసా

పామూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్‌లతో పేద కుటుంబాలకు భరోసా కలుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని వీరభద్రాపురంలో జరిగి న పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అలాగే, పామూ రు పట్టణంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఉప్పలపాటి హరిబాబు, బొల్లా నరసింహారావు, సయ్యద్ అ మీర్‌బాబు, జనసేన జిల్లా కార్యదర్శి వై.రహీముల్లా, తదితరులు పాల్గొన్నారు. సీఎస్‌పురం మండలంలో జరిగిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి.వెంగయ్య, బొయిళ్ల నారాయణరెడ్డి, షేక్ రజ్జబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

### పెన్షన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



కనిగిరి: దివ్యాంగుడికి పింఛన్‌ను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

తాళ్లూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ల పంపిణీలో సచివాలయ సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో ఎస్.సత్యం హెచ్చరించారు. మాధవరం, తూర్పుగంగవరం, విఠలాపురం, మన్నేపల్లి గ్రామపంచాయతీలందు జరుగున్న ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ల పంపిణీని ఎంపీడీవో సోమవారం పరిశీలించారు. తూర్పుగంగవరం, మాధవరం గ్రామాల్లో పెన్షన్లు పంపిణీ చేసే సిబ్బంది పెన్షన్‌దారులకు అందుబాటులో లేక పెన్షన్ దారులు ఇబ్బందులుపడుతుండటంతో వారిని పిలిపించి పంపిణీ చేయించారు.

కాగా, మన్నేపల్లిలో సొసైటీ చైర్మన్ గొంది రమణారెడ్డి పెన్షన్లు అందజేశారు.

### వృద్ధులకు భరోసాగా ఉండాలి

కనిగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీయార్ భరోసా పింఛన్ వృద్ధులకు, దివ్యాంగులకు భరోసానివ్వాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. పట్టణ సమీపంలోని కాశిరెడ్డి కాలనీలో సోమవారం లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీచేశారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా గణేష్ ఉత్సవాలు

» కొనసాగుతున్న నిమజ్జనాలు



దర్శిలో కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహం వద్ద కోలాటం వేస్తున్న మహిళలు

దర్శి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో గణేష్ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మరోవైపు నిమజ్జనాలు కూడా కొనసాగుతున్నాయి. వినాయక చవితి సందర్భంగా మండలంలో సుమారు 200 విగ్రహాలను ఏర్పాటుచేశారు. ఆరోజునుంచి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నారు. కొన్నిచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులోభాగంగా సోమవారం కాకతీయ కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విగ్రహం వద్ద మహిళలు కోలాటం వేశారు. చిన్నారులు భరతనాట్యం ప్రదర్శించారు. ఇంకా పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు

ఈఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారి వర్షాలు పుష్కలంగా కురవటం, సాగర్ కాలువలకు సాగునీరు విడుదల చేయటంతో అన్నదాతలు ఆనందంతో అధికసంఖ్యలో విగ్రహాలు ఏర్పాటుచేశారు. దర్శి పట్టణంతో పాటు గ్రామాల్లో కూడా ఉత్సవాలు జాతరలా జరుగుతున్నాయి. గణేష్ విగ్రహాల వద్ద లడ్డూలను వేలాది రూపాయలకు. పాడి సొంతం చేసుకుంటున్నారు. రాజంపల్లిలో ఒక భక్తుడు రూ.1.5 లక్షలకు పాట పాడి సొంతం చేసుకున్నాడు. దర్శిలో రూ.75 వేలకు పాట పాడి ఒక విగ్రహం వద్ద లడ్డూ సొంతం చేసుకున్నాడు. త్రిపురసుందరిపురంలో రూ. లక్షా 15వేలు పలికింది. నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చేశారు.

**ముండ్లమూరు:** మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను ఐదు రోజుల పాటు విశేషంగా పూజలు నిర్వహించి సోమవారం నిమజ్జనానికి తరలించారు. కెల్లంపల్లి, బసవాపురం, భీమవరం, తమ్మలూరు, ముండ్లమూరు బీసీ కాలనీ, వేంపాడు, మారెళ్ళ, ఈదర, కొమ్మవరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను అద్దంకిలోని గుండ్లకమ్మ, రెడ్డినగర్ వద్ద సాగర్ కాలువల్లో నిమజ్జనం చేశారు. వినాయక విగ్రహాలు నిమజ్జనం సందర్భంగా భక్తులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ కె.కమలాకర్ నిర్వాహకులకు సూచించారు. తమ్మలూరు, కెల్లంపల్లి, వేంపాడులలో నిర్వాహకులతో మాట్లాడారు.

### రూ.2 లక్షలు పలికిన లడ్డు

పామూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గణనాథుల నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక వాసవీమాత దేవస్థానం వద్ద ఏర్పాటుచేసిన వినాయని మండపంలో లడ్డును వేలం నిర్వహించగా, ఉపసర్పంచ్ వైవీ సాంఋకిరణ్ దంపతులు రూ.2 లక్షల 10 వేలకు దక్కించుకున్నారు. ఆకులవీధి సీతారామచంద్రస్వామి దేవస్థానం వద్ద ఏర్పాటుచేసిన మండపంలో గణపతి లడ్డును వాయినేని రాఘవ రూ.50 వేలకు, వెండి కలశంను కటకం వేణు, నాగేశ్వరి దంపతులు రూ.27 వేలకు దక్కించుకున్నారు. కాగా, సీఎస్‌పురం మండలకేంద్రంలోని డీజీపేట రోడ్డులో ఏర్పాటుచేసిన వినాయక మం డపంలో సోమవారం ఎస్ఐ వెంకటేశ్వర నాయక్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ నారాయణరెడ్డి పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఎస్ఐ ప్రారంభించారు.

## ఉరేసుకొని మహిళ మృతి

కనిగిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని మహిళ మృతి చెందింది. ఈఘటన సోమవారం రాత్రి మండలంలోని మాచవరం ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. ఎస్ఐ టి.శ్రీరాం తెలిపిన వివరాల ప్రకారం కుడుములు మరియమ్మ (34) భర్త యోహానుతో కలసి తన పుట్టినిల్లు ఎర్ర ఓబనపల్లి గ్రామంలో వివాహ వేడుక నిమిత్తం భర్తతో కలసి వెళ్ళింది. వేడుక అనంతరం మృతురాలి సోదరుడు సాల్మన్ దంపతులిద్దరిని కనిగిరి పట్టణంలోని పామూరు బస్టాండు వద్ద సోమవారం ఉదయం బైక్‌పై దించి వెళ్ళాడు. వారిరువురు ఆటోలో స్వగ్రామమైన మాచవరానికి వెళ్ళారు. మధ్యాహ్న సమయంలో మృతురాలి భర్త యోహాను కనిగిరికి వచ్చారు. సాయంత్రం సమయంలో ఇంటికి క్యరీస్ తీసుకెళ్ళేందుకు భార్యకు ఫోన్ చేయగా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో ఆయన వదినకు తెలపగా, ఆమె వెళ్ళి చూడగా తలుపుకు లోపలివైపు గడియ పెట్టుకుని నిద్రపోతున్నట్టు తెలిపింది. తిరిగి గంట తర్వాత యోహాను ఫోన్ ద్వారా ప్రయ త్నించగా ఎలాంటి స్పందన లేకపోవటంతో తన సోదరుడు విజయ్‌కు చెప్పి వెళ్ళి చూడాలని చెప్పాడు. అతను తలుపును బద్ధలుకొట్టి లో పలికి వెళ్లిచూడగా, ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉండటాన్ని గమనించి యోహానుకు చెప్పాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శీరాం సంఘటనా స్థలికి చేరకుని మరియమ్మ మృతదేహాన్ని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వివాదాస్పదంగా మారిన పంచాయతీ స్థలం

ముండ్లమూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు పంచాయతీ సర్వే నెంబరు 168 ప్రభుత్వ స్థలంలో ఇటీవల ఆక్రమణలను తొలగించారు. ఈస్థలంలో వైసీపీ మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి అక్రమంగా షాపులు నిర్మించుకోవడంతో గత నెలలో పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీసులు సంయుక్తంగా ఆక్రమణలను తొలగించారు. ఈక్రమంలో తాము దేవుడికి ఇచ్చిన స్థలమని పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. అయితే, ఆదివారం రాత్రి వైసీపీ మండల కన్వీనర్ కుటుంబసభ్యులతో పాటు మరికొంతమంది తాము దేవుళ్ళకు ఇచ్చామని చెప్పుకుంటున్న స్థలంలో ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. లక్ష్మీనరసింహా స్వామి, ఆంజనేయ స్వామి విగ్రహాలను ఏర్పాటుచేస్తున్నట్టు భూమి పూజ కూడా నిర్వహించారు. ఇందుకుసంబంధించి సోమవారం సాయంత్రం పంచాయతీ అధికారి మౌలాలి ఇన్‌చార్జ్ ఎంపీడీవో అబ్దుల్ రహీంకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

## మాలకొండయ్యకు నివాళి



మన్నె మాలకొండయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు

పామూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అందరితో కలిసిమెలసి ఉంటే మన్నె మాలకొండయ్య గ్రామంలో మంచి మనిషిగా గుర్తింపు తెచ్చుకున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని వీరభద్రాపురం గ్రామంలో జరిగిన మన్నె మాలకొండయ్య దశదిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాలకొండయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కుటుంబసభ్యులు మన్నె మాల్యాద్రి, బసవమ్మ, మల్లికార్జున, వెంగమ్మ, పాములపాటి లక్ష్మీరాజ్యం, సుబ్బారావు, చిరుకూరి ధనలక్ష్మి, శ్రీనివాసరావు, లక్ష్మణరావు, సర్పంచ్ పువ్వాడి జయమ్మ, పువ్వాడి చినలక్ష్మయ్య, పువ్వాడి రామారావు, తదితరులు ఉన్నారు.

## దొనకొండ మీదుగా తిరుపతికి ప్రత్యేక రైళ్లు

దొనకొండ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు ఏర్పాటుచేశారు. 07013 నెంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 9 నుంచి నవంబరు 25 వరకు ప్రతి మంగళవారం చర్లపల్లిలో రాత్రి 9.25 గంటలకు బయలుదేరుతుంది. నల్గొండ, నడికుడి, పిడుగురాళ్ల, వినుకొండ మీదుగా దొనకొండకు రాత్రి 2.28 గంటలకు చేరుకుంటుంది. మార్కాపురం, గిద్దలూరు, నంద్యాల, ప్రొద్దుటూరు, కడప, రేణిగుంట మీదుగా తిరుపతికి బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుతుంది. 07014 నెంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 10 నుంచి నవంబరు 26 వరకు తిరుపతిలో ప్రతి బుధవారం సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరుతుంది. రేణిగుంట, కడప, నంద్యాల, గిద్దలూరు మీదుగా దొనకొండకు రాత్రి 12.48 గంటలకు చేరుకుంటుంది. వినుకొండ, నడికుడి, నల్గొండ మీదుగా గురువారం ఉదయం 8 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు.


## వాటర్ ప్లాంట్ బహూకరణ

దర్శి సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుచౌటపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు పాపసాని ఆదిరెడ్డి, మరి కొంతమంది దాతలు కలిసి రూ.80వేలు విలువచేసే వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. మంచినీటి వసతి లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని హెచ్ఎం సీతమ్మ దాతల దృష్టికి తీసుకెళ్లగా వారు కొనుగోలు చేసి పాఠశాలకు సమర్పించారు. కార్యక్రమంలో దాతలు పాపసాని నాగిరెడ్డి, బిజ్జం రవిచంద్రారెడ్డి, కె.చిన్నసుబ్బారెడ్డి, బాలవెంకటరెడ్డి, దాసరి బాలకోటయ్య, బొల్లినేని చంద్రబాబు, అశోక్‌రెడ్డి, అచ్చయ్య, చంగల్‌రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## బీడు భూములను ఆన్‌లైన్ చేయొద్దు

తాళ్లూరు,సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సోమవరప్పాడు పరిదిలోని సర్వే నంబర్ 229లోని ఉమ్మడి బీడు(తిప్పబీడు)190.50 ఎకరాలను కొందరు ఆన్‌లైన్ కోసం దరఖాస్తులు పెడుతున్నారని నాగంబొట్లపాలెం సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బయ్య పేర్కొన్నారు ఈభూములు ఆన్‌లైన్ కాకుండా చర్యలు తీసుకోవాలని సోమవారం గ్రీవెన్‌సెల్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మాధవరంగ్రామంలో రీసర్వేవల్ల తమ భూములవివరాలు రికార్డుల్లో కన్పించటం లేదని, పరిశీలించి తమ భూములను రికార్డుల్లో నమోదు చేయాలని గ్రామస్థుడు కొడిమెల వెంకట్రావు వినతిపత్రం అందజేశారు.

## సోలార్ ప్రాజెక్టు కోసం భూసేకరణ



భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏఈ తదితరులు

పీసీపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదయిర్లపాడులో ఏర్పాటుచేయనున్న సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకోసం సోమవారం భూసేకరణను అధికారులు చేపట్టారు. తహసీల్దార్ సీహెచ్ ఉష, విద్యుత్ ఏఈ పవన్ గ్రామంలోని రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పీఎం కుసుమ సోలార్ ప్రాజెక్టు ద్వారా పునరుత్పాదకశక్తి ఉత్పత్తే లక్ష్యంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తుందన్నారు. ఈప్రాజెక్టుకు 20ఎకరాల భూమి అవసరమవుతుందన్నారు. భూములిచ్చిన రైతులకు ఎకరాకి సంవత్సరానికి రూ.30 వేలు కౌలు చెల్లిస్తారని చెప్పారు. అలాగే ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రైతులకు ఇచ్చే కౌలు దరను ప్రభుత్వం 5శాతం పెంచి ఇస్తుందని తెలిపారు. అధికారులు చెప్పిన ప్రభుత్వ నియమ నిబంధనలను అంగీకరించిన ఐదుగురు రైతులు సోలార్ ప్రాజెక్టు కోసం భూములను కౌలుకు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కుబడిగా అధికారుల హాజరు

ముండ్లమూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్‌కు తహసీల్దార్ లక్ష్మీనారాయణ మాత్రమే పూర్తిగా ఉన్నారు. మిగతా మండల స్థాయి అధికారులు సంతకాలు పెట్టి వెంటనే వెళ్ళిపోయారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి సమస్యలు విన్నవించు కోవటానికి వచ్చిన అర్జీదారులు వెనుదిరిగిపోయారు. ఏపీవో మాత్రం రమణారెడ్డిపాలెంలో జరిగిన గొట్టిపాటి లక్ష్మి పర్యటనలో పాల్గొన్నారు.





# ప్రాజెక్టులకు.. జలకళ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

- నాగార్జున సాగర్‌లో 301.36 టీఎంసీలు
- పులిచింతలలో 37.91 టీఎంసీలు
- కొనసాగుతున్న నీటి ప్రవాహం
- 11 లక్షల ఎకరాలకు సాగు నీరు
- అన్నదాతల మోముల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటే బంగారు పంటలే పండుతాయి.. అన్నది నిత్య సత్యం. ఇప్పుడు కృష్ణమ్మ సాగర్ అయకట్టులో పరుగులిడుతోంది. పంటల సాగుకు పుష్కలంగా నీటిని అందిస్తోంది. లక్షలాది ఎకరాల్లో పంటలు సాగవు తున్నాయి. అన్నదాతల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జూలై చివరిలో జలాశయానికి ప్రారంభమైన వరద ప్రవాహం నేటికీ కొనసాగుతూనే ఉంది. నాగార్జున సాగర్, దిగువన ఉన్న పులిచింతల జలాశయాలు నిండుకుండల్లా కళకళలాడుతున్నాయి. సాగర్ కుడి కాల్వకు నీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని కుడి కాల్వ అయకట్టులోని 11.11 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు. వరద ప్రవాహం ఇంకొన్ని రోజులు కొనసాగవచ్చని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

**నిండిన నాగార్జున సాగర్..**

నాగార్జున సాగర్ జలాశయంలో 96.57 శాతం నీటి నిల్వ ఉంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా, సోమవారం డ్యాంలో నీటి నిల్వ 301.36 టీఎంసీలు ఉంది. 590 అడుగులకు.. 586.2 అడుగుల నీటి మట్టం చేరింది. జలాశయానికి 3,28,037 కూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. కుడి, ఎడమ కాల్వల ద్వారా సాగుకు, విద్యుదుత్పత్తికి వినియోగిస్తున్న నీటితో కలిపి మొత్తం 3,28,037 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం కుడి కాల్వకు 9,500 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

**నిండుగా పులిచింతల..**

సాగార్జున సాగర్ దిగువన ఉన్న కేఎస్‌రావు పులిచింతల జలాశయం కూడా పూర్తిస్థాయి నీటి నిల్వతో తొణికిసలాడుతోంది. ఈ జలాశయం కూడా ఆగస్టు రెండో వారంలో నిండింది. అప్పటి నుంచి నేటి వరకు పూర్తిస్థాయి నీటి నిల్వ కొనసాగుతోంది. పులిచింతల పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టిఎంసీలు కాగా 37.91 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులకు.. 169.68 అడుగుల నీటి మట్టం ఉంది. జలాశయంలోకి నీటి ప్రవాహం 2,89,144 క్యూ సెక్కులు కాగా, 2,76,599 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


పులిచింతల జలాశయం




పొదుపు సంఘ సభ్యులకు చెక్కు అందజేస్తూ..

ప్రసంగిస్తున్న హోం మంత్రి అనిత, వేదికపై మంత్రి గొట్టిపాటి రవి, ఎమ్మెల్యే యరపతినేని, మాజీ ఎమ్మెల్సీ జంగా, కొమ్మాలపాటి



# తల్లి,చెల్లి ఉసురుతోనే.. జగన్ ఓటమి

ఈ గడ్డ మీద నిలబడే ఎన్టీఆర్ మాట్లాడారు. ఈ గడ్డ మీద నుంచే చంద్రబాబు ఆత్మగౌరవ యాత్ర ప్రారంభించారు. ఈ గడ్డమీదే నారా లోకేశ్ యువగళం వాణి వినిపించారు. ఇప్పుడు ఇదే గడ్డ మీద నన్ను నిలబెట్టి మాట్లాడించడానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఇంత పెద్ద మహా సభ ఏర్పాటు చేయడం జీవితంలో మర్చిపోలేను.
- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత


మంత్రి గొట్టిపాటికి వేంకటేశ్వరుడి ప్రతిమ అందిస్తున్న యరపతినేని

సభకు హాజరైన మహిళలు, కార్యకర్తలు, ప్రజలు

- చంద్రబాబు అరెస్టుతో సైకో పతనం ప్రారంభం
- మహిళల భద్రతకు కూటమి పెద్దపీట
- పల్నాడులో ప్రతి మహిళ ఒక నాగమ్మే
- యరపతినేని సభను జీవితంలో మర్చిపోలేను: హోంమంత్రి అనిత

పిడుగురాళ్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తల్లిని, చెల్లిని మోసం చేసి ఇంట్లో నుంచి గెంటేసిన జగన్ మహిళల ఉసురు తగిలి ఓడిపోయాడని, చివరకు చిన్నాన్న చనిపోయిన సంగతి తేల్చమని చెల్లి సునీత ప్రాధేయపడినా కూడా కనికరం చూపించని దుర్మార్గుడని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత విమర్శలు గుప్పించారు. గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్లలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఏర్పాటు చేసిన స్త్రీ శక్తి విజయోత్సవ సభలో హోం మంత్రి అనిత ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహి ళల ఉసురు తగలబట్టే 11 సీట్ల కు పరిమితమై ప్రతిపక్ష హోదా ను జగన్ అడుక్కుంటున్నాడని ఎద్దేవా చేశారు. జగన్ పాలనలో సోషల్ (మిగతా 6వ పేజీలో)

# బారు.. బేజారు!

- ఎక్సైజ్ శాఖ ఇన్‌చార్జి ఈఎస్ వెంకటేశ్వర్లు ఆకస్మిక బదిలీ
- ప్రకాశం జిల్లా డీపీఈవోకు ఇన్‌చార్జి బాధ్యతలు
- మరో ఇద్దరు సీఐలపైనా చర్యలకు రంగం సిద్ధం?
- బార్ లైసెన్సుల్లో నామమాత్రపు స్పందనే కారణమా !


కలెక్టర్ వెంకటమురళిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇన్‌చార్జి డీపీఈవో ఆయేషాబేగం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లు.. బార్ లైసెన్సులకు స్పందన కరువు.. ఎక్సైజ్ శాఖ అధికారుల మెడకు చుట్టుకుంది. జిల్లా డీపీఈవో(డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్)గా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న బి. వెంకటేశ్వర్లును విజయవాడలోని కమిషనరేట్ కార్యాలయంలో రిపోర్టు చేయాలనే ఆదేశాలు శనివారమే వెలువడ్డాయి. ప్రకాశం డీపీఈవో ఎస్కే. ఆయేషా బేగంను బాపట్ల జిల్లా ఇన్‌చార్జిగా నియమించగా.. ఆమె సోమవారం బాధ్యతలు తీసుకున్నారు మరో ఇద్దరు ఎక్సైజ్ సీఐలపై కూడా బదిలీ వేటు పడనుందని తెలుస్తోంది. ఈ చర్యల వెనుక ఆశించిన స్థాయిలో బార్ల ఏర్పాటుకు దరఖాస్తులు రాకపోవడమే కారణంగా ఉన్న ట్లు సమాచారం. జిల్లాలో మొత్తం 17 బార్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా.. గడువు ముగిసే నాటికి నిబంధనల ప్రకారం రెం డు బార్లకే దరఖాస్తులు రావడంతో వాటికే లాటరీ ప్రక్రియ ముగించి బార్లను కేటాయించారు. గీత కార్మికు లకు రాయితీపై కేటాయించిన రెండు బార్లకు కూడా లైసెన్సుల జారీ ప్రక్రియ ముగిసింది. 17 బార్లకు గాను రెండింటికే దరఖాస్తులు రావడంపై ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. అత్యంత పూర్ పర్ఫామెన్స్ ఇచ్చిన రెండు జిల్లాల్లో ఒకటి బాపట్లగా ఉండడంతో వెంటనే చర్యలకు దిగినట్లు తెలుస్తోంది.

**ఇదేం తీరు..**

ప్రభుత్వం నిర్దేశించిన దరఖాస్తు రుసుంతోపాటు, లైసెన్సు ఫీజు కూడా భారీగా ఉండడమే ఆశావహుల వెనకంజకు కారణమనేది బార్ల వ్యాపారంలో ఏళ్ల తరబడి ఉన్న వారి అభిప్రాయం. బార్ల ఏర్పాటు చేసే ప్రాంతాల జనాభా వారీగా చూసుకున్న ఈ రుసుంలతో ఆర్థికంగా వర్కవుట్ కాదనే లెక్కలతోనే దరఖాస్తు చేయలేదనేది బహిరంగ రహస్యం. బార్ల ఆశావహులు లాభనష్టాల బేరీజు లెక్కలతోనే మిన్నకుండిపోయారు తప్పితే.. ఇందులో ఎక్సైజ్‌శాఖ తప్పిదమేమిటో అర్థం కావడం లేదని సిబ్బంది వాపోతున్నారు.

**ఎక్సైజ్ శాఖ అంటే భయం లేదా...**

బార్ల దరఖాస్తుల అంశాన్ని ముడి పెట్టి ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు చర్యలకు దిగడం ఆ విభాగంలో పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. నోటిఫికేషన్ జారీ చేసిన దగ్గరి నుంచి దర ఖాస్తుల కోసం తాము చేయని ప్రయత్నం లేదని, కానీ నిర్వాహ కులు ముందుకు రాలేదని ఎక్సైజ్ శాఖ సిబ్బంది వాపోతున్నారు. బార్ల ఆశావహులకు ఎక్సైజ్ శాఖ అంటే భయం లేకపోవడమే, దరఖాస్తులు రాకపోవడానికి (మిగతా 6వ పేజీలో)

# ఏపీ విద్యా ప్రతిష్ట.. లీప్!

ఈ విద్యా సంవత్సరం నుంచే లీప్ స్కూల్స్


లీప్ స్కూల్‌లో ఓ తరగతి గది

- నియోజకవర్గానికి ఒకటి వంతున ఏర్పాటు
- నిడమర్రులో తొలి లీప్ మోడల్ స్కూల్
- రూ.15 కోట్లతో సమగ్రాభివృద్ధి
- 2029-30 కల్లా పాఠశాల విద్య బలోపేతం
- విద్యా ప్రమాణాల పెంపునకు లోకేశ్ వ్యూహం




లీప్ స్కూల్‌లో బి బ్లాకు

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

పేరుకు డిగ్రీలు చదివినా.. ఇంగ్లీషు చదవడం రాదు.. తెలుగు ఉచ్చారణ అసలే పలకదు. చిన్న చిన్న లెక్కలు.. ఎక్కాలు చెప్పమంటే అన్నీ శుద్ధ తప్పులే! ఇదీ 2024 వార్షిక విద్యా స్థితి (యాసర్) నివేదిక. ఈ నిరాశజనకమైన ఫలితాలను చూసి ఖిన్నుడైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు.. దిద్దుబాటు చర్యలు తీసుకున్నారు. అందులో భాగమే.. లీప్ పాఠశాలల స్థాపన. ఈ కొత్త ప్రాజెక్టు ప్రాథమిక విద్యలో నాణ్యతను పెంచుతుంది. తద్వారా దేశంలోని ఇతర రాష్ట్రాలతో సమ ఉజ్జీగా (మిగతా 6వ పేజీలో)

# బర్లీకి గోడౌన్లు కావలెను

- ఇప్పటికే 33 చోట్ల పొగాకు నిల్వలు
- మరో 11 కేంద్రాల్లో ప్రస్తుతం కొనుగోళ్లు
- ప్రైవేటు గోదాములపై మార్క్‌ఫెడ్ దృష్టి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ కొంటున్నప్పటికీ వాటిని నిల్వ ఉంచే గోదాముల లభ్యత ప్రస్తుతం సవాల్‌గా మారింది. కొనుగోళ్ల ప్రక్రియ రెండు నెలల నుంచి జరుగుతుండగా ఇప్పటికే ఎఫ్‌సీఐ, వేర్ హౌసింగ్ కార్పొరేషన్, మార్కెటింగ్ గోడౌన్‌లు ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్.. అక్కడే నిల్వ ఉంచింది. ప్రకాశం జిల్లా పొదిలితో పాటు బాపట్లలోని వేర్ హౌసింగ్ గోడౌన్‌లను కూడా ఇందుకోసం ఇప్పటికే ఉపయోగించారు. బాపట్లతో పాటు గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలోని 33 గోడౌన్‌లు ఇప్పటికే బర్లీ పొగాకుతో నిండిపోయాయి. మరో 11 కేంద్రాల్లో ప్రస్తుతం బర్లీ కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇవి కూడా మరో రెండు మూడు రోజుల్లో నిండిపోనున్నాయి. తదుపరి కొనే బర్లీని ఎక్కడ నిల్వ ఉంచాలనేదే ఇప్పుడు మార్క్‌ఫెడ్‌కు సవాల్‌గా మారింది. బాపట్లతో పాటు గుంటూరు జిల్లాలోని ప్రైవేటు గోడౌన్‌లపై అధికారులు దృష్టి సారించారు. అయితే.. అవి కూడా రైతులు తమ ఉత్పత్తులను అద్దె ప్రాతిపదికన నిల్వ ఉంచుకోవడంతో ఖాళీగా లేవని క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. దీంతో నిల్వ విషయంలో ఏం చేయాలో పాలుపోవడం లేదని అధికారులు వాపోతున్నారు. ఇతర జిల్లాల్లో ప్రభుత్వ విభాగాల గోడౌన్‌లు కొంత మేర అందుబాటులో ఉన్నప్పటికీ, అక్కడికి రైతులు బర్లీని తీసుకెళ్లడం అంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని.. ఈ నాలుగు జిల్లాల పరిధిలోనే గోడౌన్‌ల కోసం వెతుకుతున్నామని (మిగతా 6వ పేజీలో)


బర్లీ పొగాకు బేళ్లతో నిండిపోయిన పర్చూరు ఏఎంసీ గోడౌన్

**రైతుల ఖాతాల్లో రూ.110 కోట్లు జమ**

ఇప్పటి వరకు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన పొగాకుకు సంబంధించి రైతుల ఖాతాల్లో దాదాపు రూ.110 కోట్లు జమ చేయనుంది. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఇటీవలే ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి నిధుల విడుదలపై చర్చించారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని మార్క్‌ఫెడ్ చెబుతోంది.

# జిల్లాలో మరిన్ని డీసీఎంఎస్ కేంద్రాలు

- చైర్మన్ వడ్రాణం

గుంటూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల ఇబ్బంది లేకుండా త్వరలోనే బాపట్ల జిల్లాలో మరిన్ని డీసీఎంఎస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు తెలిపారు. సోమవారం బాపట్ల జిల్లా డీసీఎంఎస్ కేంద్రాల్ని ఆయన సందర్శించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులెవ్వరూ నష్టపోకుండా.. డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువులను మార్క్‌ఫెడ్, ఇఫ్కో, కోరమండల్ సంస్థల ద్వారా ఎన్డీఏ ప్రభుత్వం కొనుగోలు చేసి, డీసీఎంఎస్ కేంద్రాలకు సమృద్ధిగా పంపిందన్నారు. రైతు సోదరులకు రాయితీ ధరలకే ఎరువులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ హరిగోపాల్, రేపల్లె మార్కెట్ యార్డ్ చైర్మన్ మత్తి అనురాధ భాస్కర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్, మార్కెట్ యార్డ్ సెక్రటరి వేణు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పింఛన్లు

**మంత్రి గొట్టిపాటి రవికుమార్**

పంగులూరు, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక పింఛన్లు అందజేయడం జరుగుతుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. పంగులూరులో సోమవారం పింఛను నగదును ఆయన స్వయంగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.3వేల పింఛను నగదును రూ.4 వేలకు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. భర్తను కోల్పోయిన లక్షా పదివేల మంది ఒంటరి మహిళలను గుర్తించి వారందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేశామని మంత్రి చెప్పారు. అర్హత ఉన్న దివ్యాంగుల పింఛను కొనసాగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆయన ఈ సందర్భంగా ఆదేశించారు. రాష్ట్రంలో అర్హత ఉన్న కొత్త వారిని గుర్తించి పింఛను సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే పంగులూరు, కొరిశపాడు మండలాలకు చెందిన 41 మంది బాధితులకు రూ.19,28,404ల ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ కింద దరఖాస్తు చేసుకున్న 450 మందికి తగిన సాయం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


పంగులూరులో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

## రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రభుత్వ విద్యార్థుల సత్తా

పందిళ్లపల్లి(చీరాల), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో వేటపాలెం మండలం పందిళ్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. భీమవరంలో గత నెల 29, 30 తేదీలలో జరిగిన పోటీల్లో యతిన్, కార్తికేయ పాల్గొని ఫాయిల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం దక్కించుకున్నారు. సోమవారం విజేతలను పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు దీప్తి, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, పరమేశ్వరీ, భవానీ తదితరులు అభినందించారు.

## 'బర్లీ'కి గోడౌన్లు కావలెను!

(5వ పేజీ తరువాయి)
మార్క్‌ఫెడ్ చెబుతోంది.

ఇంకా రైతుల వద్ద లక్ష క్వింటాళ్లు..

రైతుల వద్ద ఇంకా లక్ష క్వింటాళ్ల వరకు బర్లీ పొగాకు నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఒక్క బాపట్ల జిల్లాలోనే 1.08 లక్షల క్వింటాళ్లను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. గుంటూరు జిల్లాలో 23,500, పల్నాడులో 17,300, ప్రకాశం జిల్లాలో 12,800 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసిన బర్లీ గోడౌన్‌లకు చేరింది. నాలుగు జిల్లాల పరిధిలో 8,500 మంది రైతులకు మేలు జరిగింది. అధికారుల లెక్కల ప్రకారమే బర్లీని అమ్ముకోవడం కోసం రిజిష్టర్ చేసుకున్న రైతుల సంఖ్యే ఇంకా 8,000 వరకు ఉండగా, ఒక్క బాపట్ల జిల్లాలోనే 5,800 మంది వరకు రైతులు తమ వంతు కోసం వేచి ఉన్నట్లు సమాచారం. గోడౌన్‌లు అందుబాటులో లేకపోవడంతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. మరో వైపు ఇప్పటికే దాదాపు ప్రభుత్వ గోడౌన్‌లన్నింటిలోనూ బర్లీ నిల్వలే పూర్తి స్థాయిలో దర్శనమిస్తున్నాయి. నెలల తరబడి అక్కడ నిల్వ ఉంచడం, నిత్యం పర్యవేక్షణ కూడా కీలకం కానుంది. ఇప్పటికే ఒకటి రెండు చోట్ల పొగాకు బేళ్లు దెబ్బతిన్నట్లు తమ దృష్టికి వచ్చిందని యంత్రాంగం చెబుతోంది. మరో వైపు ఖరీఫ్ దిగుబడుల నాటికి గోదాముల అవసరం మరింతగా ఉండనుంది.

## బారు.. బేజారు!

(5వ పేజీ తరువాయి)
కారణమనే వింత వా దనసుపై అధికారులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇన్‌చార్జి ఈఎస్‌ను బదిలీ చేసిన ప్రభుత్వం, ఇద్దరు సీఐలపై కూడా రంగం సిద్ధ చేసి ఇంకో అవకాశం ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. జిల్లాలో మిగిలినన 15 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేస్తామని, అప్పుడు కూడా స్పందన లేకపోతే చర్యలు తప్పవనే సంకేతాలు కమిషనరేట్ నుంచి వచ్చినట్లు సమాచారం. జిల్లా కేంద్రం బాపట్లలో కూడా ఒక్క బార్‌కు కూడా లాటరీ తీయడం జరగలేదని, ఇది కచ్చితంగా పేలవ పనితీరుకు నిదర్శనమేనని ఉన్నతాధికారులు వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది

### మార్చి నెలలో అప్పటి ఈఎస్ దేవదత్తు సరెండర్

పనితీరు ప్రామాణికంగా ఎక్సైజ్ సూపరిటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దేవదత్తును ఈ ఏడాది మార్చిలో కలెక్టర్ వెంకటమురళి సరెండర్ చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఇన్‌చార్జి ఈఎస్‌గా వెంకటేశ్వర్లు విధులు నిర్వహిస్తూ వస్తున్నారు.

## 'స్త్రీశక్తి'పై మహిళల కృతజ్ఞతా ర్యాలీ

సింగరాయకొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకంపై మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించినందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ మండల టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి కందుకూరు రోడ్డు వరకు ఇది సాగింది. తొలుత ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళా నేతలు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రజా ప్రభుత్వం నేరవేరుస్తున్నదన్నారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ రూ.13వేల చొప్పున ఇవ్వడం ద్వారా కుటుంబాలపై ఆర్థికభారాన్ని తగ్గించారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య, నేతలు వేల్పుల సింగయ్య, సందానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, చీమకుర్తి కృష్ణ, చంటి, ముళ్లపూడి సత్యనారాయణ, కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు,

## తాగునీటి సమస్యను పరిష్కరిస్తా

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. సోమవారం గిద్దలూరు పట్టణంలో రూ.70లక్షలతో 4 నూతన మంచి నీటి పథకాలకు శంకుస్థాపన చేసి డీప్‌బోర్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హామీలన్నింటిని ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు దూసుకుపోతుందన్నారు.

# 'గుండ్లకమ్మ'లో చేపల వేట ప్రారంభం

### దాదాపు 2 వేల మందికి ఉపాధి

### వారం రోజుల్లో పూర్తి వేటకు సిద్ధమవుతున్న జాలర్లు


రిజర్వాయర్‌లో చేపల వేట సాగిస్తున్న జాలర్లు, వలలు సిద్ధం చేసుకుంటున్న జాలర్లు

అద్దంకి, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో విస్తరించి ఉన్న గుండ్లకమ్మ రిజర్వాయర్ పరిధిలో సోమవారం నుంచి చేపల వేట ప్రారంభమైంది. ప్రతి ఏటా జూలై, ఆగస్టు నెలలో వేట విరామం నేపథ్యంలో చేపల వేటపై నిషేధం కొనసాగుతుంటుంది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి అద్దంకి మండలంలోని మణికేశ్వరం, మోదేపల్లి, తిమ్మారెడ్డిపాలెం, ధేనువకొండ, కొరిశపాడు మండలంలోని అనమనమూరు, యర్రబాలెం, తమ్మవరం, మద్దిపాడు మండలంలోని పలు గ్రామాల జాలర్లతో పాటు తాళ్లూరు, చీమకుర్తి, అద్దంకి మండలాల పరిధిలోని సుమారు 2 వేల మంది జాలర్ల కుటుంబాలు గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో చేపల వేట సాగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో తొలి రోజు కొంత మంది జాలర్లు వేట ప్రారంభించగా, మరికొంత మంది జాలర్లు వేట సాగించేందుకు అవసరమైన వలలు, పడవలు సిద్ధంచేసుకుంటున్నారు. మరో వారం రోజుల్లో పూర్తి స్థాయిలో వేట సాగించే అవకాశం ఉంది. దీంతో అద్దంకి, ఒంగోలు ప్రాంత ప్రజలకు గుండ్లకమ్మ రిజర్వాయర్ చేపలు అందుబాటులోకి రానున్నాయి. అదే సమయంలో చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు కూడా చేపలు ఎగుమతి చేయనున్నారు.

# తల్లి, చెల్లి ఉసురుతోనే జగన్ ఓటమి!

(5వ పేజీ తరువాయి)
మీడియాను ఆధారం చేసుకొని మహిళలను అనేక రకాలుగా అవమానించారని ఆవేదన చెందారు. సొంత చెల్లెలు షర్మిలపై కూడా తప్పుడు ప్రచారాలు చేయించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడును 53 రోజులు జైల్లో పెట్టించిన నాడే జగన్ పతనం మొదలైందని మంత్రి అనిత పేర్కొన్నారు. పల్నాడులో వీర నారీమణి నాగమ్మ కత్తితో పోరాటం చేస్తే.. గడిచిన ఎన్నికల్లో ఓటుతో మహిళలు పోరాటం చేశారన్నారు. పల్నాడు ప్రాంత ప్రతి మహిళ నాగమ్మ కితాబిచ్చారు. కొన్ని వేల మందికి పసుపు కుంకుమ కార్యక్రమాలు చేపట్టిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దొరకడం మహిళామణుల అదృష్టమని ప్రశంసించారు.

### అప్పులు చేయకుండానే రాష్ట్రాభివృద్ధి: మంత్రి గొట్టిపాటి

సంపద సృష్టించి.. అప్పులు చేయకుండా.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదేనని.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. అర్హత లేని ఎందరికో.. గత పాలనలో దొంగ పింఛన్లు ఇచ్చారని ఆరోపించారు. అర్హులైన ఏ ఒక్కరి కూడా పింఛన్ పోదని సీఎం చంద్రబాబు స్పష్టం చేసిన విషయాన్ని మంత్రి గొట్టిపాటి గుర్తుచేశారు. 70 శాతానికిపైగా ఆర్టీసీ బస్సుల్లో లక్షలాది మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తున్నారన్నారు. విద్యుత్ శాఖలో ఖాళీలను భర్తీ చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి తెలిపారు. గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఏ కార్యక్రమం తలపెట్టినా ప్రభంజనం సృష్టిస్తారనేందుకు స్త్రీ శక్తి విజయోత్సవ సభే నిదర్శనమన్నారు.

### సెప్టెంబరు 1తోనే రాష్ట్రంలో కీలక మార్పు : ఎమ్మెల్యే యరపతినేని

నాయకురాలు నాగమ్మ దగ్గర నుంచే.. మహిళలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చే పల్నాడు గడ్డపై.. మరో మహిళా ప్రభంజనాన్ని స్త్రీ శక్తి పథకం విజయోత్సవ సభతో చూస్తున్నానని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. సెప్టెంబరు 1వ తేదీ తన రాజకీయ జీవితంలో మరుపురాని ఘట్టమన్నారు. ఆగస్టు 21, 1995న వైస్రాయ్ హోటల్ వద్ద జరిగిన ఘటన నుంచి సెప్టెంబరు 1న చంద్రబాబు మొదటిసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన ఘటన మర్చిపోలేనిదన్నారు. 2013 సెప్టెంబరు 1న పొందుగల వద్ద ఆత్మగౌరవ యాత్రతో రాష్ట్రంలోనే టీడీపీ జెండా రెపరెపలాడేందుకు దోహదపడిందన్నారు. ఆనాడు ఎంతో మంది పార్టీ పెద్దలు చంద్రబాబు పర్యటనకు వెనుకంజ వేసినా.. తాను చూపిన భరోసా పర్యటన ఆసాంతం విజయవంతమైందన్నారు. రాష్ట్రం, రాజధాని ప్రాంత మహిళలపై వైసీపీ నేతలు అసభ్యకర పోస్టులు పెడుతున్నారన్నారు. తల్లిని, చెల్లిని బజారున పెట్టిన జగన్ రాష్ట్రంలో మహిళలకు ఇంకేమి గౌరవం ఇస్తాడని ప్రశ్నించారు. దళిత తేజం, సీమంతం, షష్టి పూర్తి, పసుపు కుంకుమ పెట్టిన విషయాన్ని గుర్తుచేస్తూ సంక్రాంతి నుంచి పిడుగురాళ్లలోని ప్రతి కుటుంబానికి ఒక సిలిండర్‌ను ఉచితంగా అందజేస్తానని ప్రకటించారు. ఆనాడు ఎన్టీఆర్, ఆ తర్వాత చంద్రబాబు, లోకేశ్ ఇప్పుడు స్త్రీ శక్తి విజయోత్సవ సభ ఒకే వేదికపై జరుగడం మరో విశేషమన్నారు. పురుషులకు ధీటుగా సక్సెస్ చేసిన మహిళా మణులకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### పిడుగురాళ్ల ఘటనతోనే రాజకీయ అరంగేట్రం: ఎమ్మెల్యే గళ్లా మాధవి

పల్నాడు రాజకీయాల్లో ఎమ్మెల్యే యరపతినేనికి సాటి మరెవరూ రారని, ఏ కార్యక్రమం తలపెట్టినా విజయవంతం చేస్తారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. గతంలో పసుపు, కుంకుమ, సీమంతాల కార్యక్రమాలతో ఎన్నో కుటుంబాలకు అన్నగా, పెద్ద కొడుకుగా ఆయన అండగా నిలిచిన ఘటనలు ఎందరో నోట విన్నానని ఆమె గుర్తుచేసుకున్నారు. గత పాలనలో పిడుగురాళ్లలో ఎదురైన ఘటనలతోనే తాను రాజకీయ అరంగేట్రం చేయాల్సి వచ్చిందన్నారు.

### ఆత్మగౌరవ యాత్రతోనే టీడీపీ ప్రభంజనం: కొమ్మాలపాటి

సమైఖ్య నినాదం ఉన్న 2014లో చంద్రబాబు నాయుడు పర్యటన ఎక్కడి నుంచి మొదలుపెట్టాలనే తర్జనభర్జన పడుతున్న సమయంలో గురజాల నుంచే మొదలు పెట్టాలని.. తానే ముందుంటానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు భరోసా ఇచ్చారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గుర్తుచేశారు. దీంతో చంద్రబాబు ఆత్మగౌరవ యాత్ర ప్రారంభించారని తెలిపారు. 30 ఏళ్ల క్రితం సెప్టెంబరు 1న చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మహిళలకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. తల్లికి వందనం, ఉచిత బస్సు, దీపం పథకం అమలుతో మహిళలందరూ చంద్రబాబు పక్షాన ఉంటారని కొమ్మాలపాటి పేర్కొన్నారు.

### రిజర్వేషన్ల ఘనత ఎన్టీఆర్‌దే: జంగా కృష్ణమూర్తి

రాష్ట్రంలో మహిళలకు రిజర్వేషన్, ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్‌ది అయితే.. దానిని కొనసాగిస్తున్న చంద్రబాబును రాష్ట్ర మహిళలు మర్చిపోలేరన్నారు. గురజాలలో ఎమ్మెల్యే యరపతినేని తలపెట్టిన ఏ కార్యక్రమం అయినా విజయవంతం కావడానికి ఆయన నిబద్ధత, వెన్నంటి ఉండే వేలాది మంది కార్యకర్తలే కారణమన్నారు.

### కష్టకాలంలో పార్టీకి యరపతినేని అండ : నన్నపనేని రాజకుమారి

పల్నాటి గడ్డపై మరోసారి పల్నాటి పౌరుషాన్ని చూపేలా యరపతినేని స్త్రీశక్తి విజయోత్సవ సభ జరిపారని మహిళా కమిషన్ మాజీ చైర్మన్ నన్నపనేని రాజకుమారి పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న ఒకానొక దశలో పల్నాడులో టీడీపీకి, కార్యకర్తలకు అండగా ఉన్న యరపతినేని అంటే చంద్రబాబుకు ఎంతో ఇష్టమన్నారు. చంద్రబాబుపైనే కాకుండా టీడీపీ నేతలపై అనేక అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టించిన జగన్‌ను రాష్ట్ర ప్రజలు చాచి లెంపకాయ కొట్టారన్నారు. ఎన్నడూ రాజకీయాలకు బయటకు రాని భువనేశ్వరి పిలుపుతో రాష్ట్రంలోని లక్షలాది మంది మహిళలు రోడ్డెక్కారని గుర్తుచేశారు. ఒక చేత్తో ఓటు వేస్తూ.. మరో చేత్తో జగన్‌కు బైబై చెప్పారన్నారు. పిడుగురాళ్లలో ఒకే వేదికపై మూడు తరాల నేతలతో సభలు పెట్టి సక్సెస్ అయిన ఘనత యరపతినేనికే దక్కిందన్నారు.

# ఏపీ విద్యా ప్రతిష్ఠ..'లీప్'!

(5వ పేజీ తరువాయి)
రాష్ట్రానికి సమున్నత గౌరవాన్ని ఆపాదిస్తుంది. ఈ లీప్ పాఠశాలలను రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి వంతున ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందుకు తొలి పైలెట్ ప్రాజెక్టుగా తన సొంత నియోజకవర్గం మంగళగిరిలో లీప్ పాఠశాలను ఏర్పాటు చేయిస్తున్నారు. అలాగే రాజధాని గ్రామాల్లో ఒకటైన నిడమర్రులో లీప్ పాఠశాలను ఈ విద్యా సంవత్సరం నుంచే ఆరంభిస్తున్నారు. సుమారు రూ.15 కోట్ల వ్యయంతో నిడమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలను లీప్ స్కూల్‌గా అభివృద్ధి చేస్తున్నారు.

### లీప్ స్కూల్స్...ఎందుకంటే!


రాష్ట్రంలో పాఠశాల విద్యను 2029-30 విద్యా సంవత్సరం నాటికి పూర్తిగా బలోపేతం చేయాలన్నదే లక్ష్యంగా లీప్ పాఠశాలల వ్యవస్థను మంత్రి లోకేశ్ తీసుకువస్తున్నారు. ఇది ఆట ఆధారిత అభ్యాసం, డిజిటల్ అక్షరాస్యత, 21వ శతాబ్దాపు నైపుణ్యాలను కలుపుతూ ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా శాస్త్రాన్ని విద్యార్థుల్లో పెంపొందించడానికి రూపొందించిన.. ఫలిత ఆధారిత వ్యూహమని చెప్పుకోవాలి. ఈ విధానంలో విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంచుకుని నిజ జీవిత నైపుణ్యాలను బలంగా మెరుగుపరుచుకుంటారు. అంటే కేవలం విద్యా పరంగానే కాకుండా భవిష్యత్తుకు సంసిద్ధులై ఉంటారు. ప్రత్యేకించి ప్రభుత్వ పాఠశాలల్లో గణనీయంగా తగ్గిపోతున్న హాజరు శాతాన్ని వేగంగా పెంచేందుకు లీప్ స్కూల్ వ్యవస్థ తోడ్పడుతుంది. డ్రాప్ అవుట్స్‌లో 95 శాతం మందిని తిరిగి పాఠశాలలకు చేర్చి.. ప్రవేశాలను మెరుగుపరుచుకోవడం దీని ప్రధాన లక్ష్యంగా చెబుతున్నారు. లీప్ పాఠశాలల్లో పాఠ్యాంశాలన్నీ 2020 జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఉంటాయి. తద్వారా పరిశోధన, ఆవిష్కరణ అవకాశాలకు ఊతమిస్తుంది. సృజనాత్మక ఆలోచన, వ్యవస్థాపకతను విద్యార్థుల్లో ప్రోత్సహిస్తుంది. ఆరు, తొమ్మిదవ తరగతి విద్యార్థు కోసం బ్రిడ్జి కోర్సులను కూడా అందిస్తారు.

### రాష్ట్రంలో తొలి మోడల్ స్కూల్..

రాష్ట్రంలో తొలి లీప్ మోడల్ స్కూల్‌గా నిడమర్రు జడ్పీ ఉన్నత పాఠశాలను తీర్చిదిద్దనున్నారు. ఇది నిడమర్రు - కురగల్లు గ్రామాల మధ్య సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో ఉంది. నాలుగేళ్ల క్రితం ఇంటర్మీడియెట్ విద్యను ఇక్కడ అందుబాటులోకి తెచ్చారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ఇక్కడ బోధన జరుగుతుంది. పదవ తరగతి విద్యార్థులు 70 మంది, జూనియర్ ఇంటర్‌లో 22 మంది (ఎంపీసీ), సీనియర్ ఇంటర్‌లో ఎనిమిదిమంది (ఎంపీసీ, బైపీసీ) విద్యార్థులున్నారు. ఇక ఒకటి నుంచి తొమ్మిదవ తరగతి వరకు 420 మంది విద్యనభ్యసిస్తున్నారు. దీంతో ఈ విద్యాలయాన్ని మోడల్ ప్రాజెక్టుగా మంత్రి నారా లోకేశ్ ఎంచుకున్నారు.

### రూ.15 కోట్లతో..అత్యాధునిక సౌకర్యాలు

రూ.15 కోట్లకు పైగా వ్యయంతో నిడమర్రు జడ్పీ హైస్కూల్‌ను లీప్ స్కూల్‌గా అభివృద్ధి చేస్తున్నారు. దీనికి సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ 24 నుంచే పనులు ప్రారంభించి.. శరవేగంగా పూర్తి చేస్తున్నారు. గత వేసవి సెలవుల్లో రోజుకు రెండొందల మంది కార్మికుల వంతున నిత్యం పనిచేశారు. ఇందులో ఏ బ్లాకు పేరిట ప్రధాన భవన నిర్మాణాన్ని జీ ప్లస్ వన్ భవన సముదాయంగా యు ఆకృతిలో నిర్మించారు. ఇందులో మొత్తం 29 తరగతి గదులు ఉన్నాయి. మొత్తం ప్రాంగణంలో తూర్పు వైపున బీ బ్లాకు పేరుతో మరో 12 తరగతి గదుల భవనాన్ని నిర్మించారు. దీని పక్కనే సీ బ్లాకు పేరుతో మరో చిన్న భవనాన్ని నిర్మించి దానిని డైనింగ్ హాలుకు కేటాయించారు. ఇండోర్ గేమ్స్ ఆడుకునేందుకు ఓపెన్ థియేటర్‌ను అధునాతనంగా ఏర్పాటు చేశారు. దీని పక్కనే స్విమ్మింగ్ పూల్‌ను ఏర్పాటు చేశారు. 33 సెంట్ల విస్తీర్ణంలో ఓ సైన్స్ పార్కును కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇంకో అరెకరం విస్తీర్ణంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం కిడ్స్ ప్లే గ్రౌండ్‌ను ఏర్పాటు చేసి, టాయ్‌లెట్లను నిర్మిస్తున్నారు. ఇక పాఠశాల ప్రధాన ద్వారానికి దక్షిణంగా 600 సీటింగ్ సామర్థ్యం గల ఓపెన్ యాంఫీ థియేటర్‌ను సరికొత్తగా నిర్మిస్తున్నారు. పాఠశాల మధ్యలో 200 మీటర్ల వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తూ.. దాని నుంచి వర్షపు నీటిని బయటకు పంపేందుకు ప్రత్యేక డ్రెయినేజీ వ్యవస్థను నిర్మిస్తున్నారు. వీటి సమీపంలోనే ఖోఖో, వాలీబాల్, ఫుట్ బాల్ కోర్టులను తీర్చిదిద్దుతున్నారు. ఈ పనులన్నీ ఈ నెలాఖరులోగా పూర్తవ్వొచ్చని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.


బురదలోనే మృతదేహాన్ని మోసుకువెళ్తున్న దళితులు

## శ్మశానానికి దారి చూపండి

రాచర్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మృతదేహాలను శ్మశానానికి తీసుకువెళ్లాలంటే దారిలేక ఇబ్బందులు పడుతున్నామని శ్మశానానికి దారి చూపాలని రాచర్ల గ్రామానికి చెందిన దళితులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విజ్ఞప్తి చేశారు. గ్రామ సమీపంలో తమకు తమ పూర్వీకుల నాటి నుంచే శ్మశాన స్థలం ఉందని అక్కడికి వెళ్లేందుకు సగిలేరు కాల్వ వెంట రస్తా కూడా ఉండేదని అయితే దానిని కొందరు వ్యక్తులు దున్నడం వలన రస్తా అంతా కుచించుకుపోయిందన్నారు. దీంతో శ్మశానానికి దారిలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల మరణిస్తే అతని శవాన్ని తీసుకెళ్లడానికి దారి లేక బురద గుంటలోనే తీసుకువెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## పత్తి దిగుమతులపై పన్ను రద్దు దారుణం

### సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు సంఘాల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

మార్కాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పత్తి దిగుమతులపై 11 శాతం పన్ను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి చెప్పారు. పన్ను రద్దును నిరసిస్తూ రైతు సం ఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యమని ఆగస్టు 15న ఎర్రకోటపై ఘనంగా ప్రసంగించిన ప్రధాన మోదీ 15 రోజుల్లోనే పత్తి రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా జీవో తీసుకురావడం దుర్మార్గ చర్య అన్నారు. ఈ దిగుమతి సుంకం రద్దు వలన దేశంలో పత్తిని నమ్ముకుని సాగు చేస్తున్న ఆరు కోట్ల మంది రైతుల జీవనం ప్రశ్నార్థకంగా మారనుందని అన్నారు. దేశంలో ఇప్పటికే పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. జిల్లా నాయకులు డి.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తిరోగమన విధానాల ఫలితంగా రైతులు పెద్ద ఎత్తున సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు అందె నాసరయ్య, ఎస్‌కే ఖాశిం, ఢాకాల పుల్లయ్య, బాణాల రామయ్య, జోసఫ్, కె.కొండయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు డి.సోమయ్య, డి.పాపిరెడ్డి, గాలి వెంకటరామిరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ పాల్గొన్నారు.



## సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

అద్దంకిటౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద అధ్యాపకులు, సిబ్బంది మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని అనేక ఏళ్లుగా పోరాటం చేస్తున్న ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని, ఇప్పటికైనా సీపీఎస్‌ను రద్దు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వీహెచ్ సురేష్‌కుమార్, అశోక్‌కుమార్, వేటి ప్రసాద్ పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీని పరిశీలించిన ప్రత్యేకాధికారి


పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న డ్వామా పీడీ విజయలక్ష్మి

చినగంజాం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మున్నంవారిపాలెంలో సోమవారం జరుగుతున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని పర్చూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ విజయలక్ష్మి, కడవకుదురు గ్రామంలో ఎంపీడీవో ఎస్.విజయలు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. మండల పరిధిలోని 5,881 మంది పింఛన్‌దారులకు 5,411 మందికి పింఛన్లు అందజేసి 92శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. చినగంజాం గ్రామంలో గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, టీడీపీ బాపట్ల పార్లమెంట్ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు మోటుమర్రి రామసుబ్బారావు, పర్చూరు నియోజకవర్గ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు పర్వతరెడ్డి పార్థసారథి, టీడీపీ నాయకులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

## బాలింతలకు అవసరమైన వస్తువులు అందజేత


బాలింతలకు వస్తువులు అందిస్తున్న ప్రతినిధులు

చీరాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాలింతలకు రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి ప్రతినిధులు పండ్లు, జుబ్బాలు, హగ్గీస్‌లను అందజేశారు. క్లబ్ చార్టర్ అధ్యక్షుడు అడ్డగడ మల్లికార్జునరావు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు బాచిన నాగమల్లేశ్వరరావు, సెక్రటరీ వంశీకృష్ణ, రావి వెంకట రమణ, వైద్యులు సుభాషిణి పాల్గొన్నారు.

## దళిత హక్కులపై సంఘటితం కావాలి

### చీరాలలో ఘనంగా దళిత చైతన్య దినోత్సవం


మహనీయులకు నివాళులు అర్పిస్తున్న ప్రతినిధులు

చీరాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దళిత హక్కుల సాధన కోసం సంఘటితంగా పాటుపడాలని పలువురు దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో కారంచేడు ఘటన నేపథ్యంలో జరిగిన 40వ దళిత మహాసభ చైతన్య దినోత్సవానికి గొర్రెపాటి రవికుమార్ అధ్యక్షత వహించారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సభ్యులు చర్చించారు. అంతకుముందు మహనీయుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పరంజ్యోతి, రాజ్ వినయ్‌కుమార్, గోసాల ఆశీర్వాదం, మాచర్ల మోహన్‌రావు, దామర్ల శ్రీకృష్ణ, చుండూరి వాసు, చిట్టిబాబు, భగత్‌సింగ్, ఊటుకూరి వెంకటేశ్వర్లు, మోహన్‌కుమార్ ధర్మ, రవి పాల్గొన్నారు.

## అర్హుల పింఛన్లను తొలగించం : మంత్రి స్వామి


మాట్లాడుతున్న స్వామి

మర్రిపూడి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. మండలంలోని పన్నూరులో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను ఆయన ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈసందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలును అడిగి తెలుసుకున్నారు. పింఛన్‌ల పంపిణీపై వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దని ప్రజలను కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. అర్హుల పింఛన్‌లను ఎట్టిపరిస్థితుల్లోనూ తొలగించబోమని స్పష్టం చేశారు. పింఛన్‌ల పంపిణీపై మాట్లాడే కనీస అర్హత కూడా వైసీపీ నేతలకు లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పింఛన్ మొత్తాన్ని రూ.2వేల నుంచి రూ.3వేలకు పెంచేందుకు 5 సంవత్సరాలు పట్టిందని ఎద్దేవా చేశారు. దివ్యాంగులకు రూ.6 వేలు, మంచానికే పరిమితమైన రోగగ్రస్థులకు రూ.15వేలు పింఛన్ అందిస్తున్న ఘనత దేశంలోనే మన రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈరోజు ఒక చారిత్రక దినమని మంత్రి అభివర్ణించారు. దార్శనిక నేత చంద్రబాబునాయుడు 30ఏళ్ల క్రితం ఇదేరోజు ముఖ్యమంత్రి పదవి చేపట్టారని పేర్కొన్నారు. తెలుగుజాతి కీర్తి ప్రతిష్ఠను ప్రపంచ నలుమూలలకూ విస్తరింపచేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని కొనియాడారు. ప్రతి ఆడపడుచుకూ ఉచిత బస్సు సౌకర్యం కల్పించి ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీని నెరవేర్చామని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంతర్గత రహదారులను అభివృద్ధి చేయాలని ప్రజలు మంత్రిని కోరారు. రక్షిత నీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని మహిళలు విజ్ఞప్తి చేయగా స్పందించిన మంత్రి వెంటనే వాటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ జనార్దన్, ఎంపీడీవో ఖాసింపీరా, కొండపి సీఐ సోమశేఖర్, మర్రిపూడి, చిమట సొసైటీ అధ్యక్షులు యర్రమోతు శ్రీనివాసులు, మలసాని కోటేశ్వరరావు, నాయకులు రేగుల వీరనారాయణ, శ్రీనివాసరెడ్డి, నరసింహారావు, కిలారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొండపి : మండలంలోని చినకండ్లగుంట గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో సోమవారం జరిగిన పూజా కార్యక్రమంలో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా స్థానికులతో ఆయన మాట్లాడారు.

## అవీ..ఇవీ..

### రెడ్‌క్రాస్ అధునాతన అంబులెన్స్ ప్రారంభం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రెడ్‌క్రాస్ అధునాతన అంబులెన్స్‌ను సోమవారం ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. వైద్యసాయం కోరే ప్రజలకు అతితక్కువ ధరతో రెడ్‌క్రాస్ సహకారంతో వాహనం అందించనున్నట్లు వివరించారు. అలాగే వాహనంలో కొన్ని అధునాతన వసతులతో పాటు ఏసీ సౌకర్యం కూడా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాహనం కోసం 92474 66776, 83095 60685 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ గోపీకృష్ణ, డివిజనల్ సర్వేయర్ మునలయ్య, రెడ్‌క్రాస్ ప్రతినిధులు సర్విశెట్టి సుబ్బరామయ్య, పాల్గొన్నారు.

### వామన జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు

చెరుకూరు(పర్చూరు), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో వేంచేసిన శ్రీ త్రివిక్రమస్వామి దేవస్థాన ఆవరణలో ఈ నెల 3 నుంచి 5వరకు మూడురోజుల పాటు వామన జయంతి సందర్భంగా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి దామా నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో చివరిరోజు 5న స్వామివారి కల్యాణం నిర్వహిస్తారని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

సంతమాగులూరు సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి ) : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల దే కీలకపాత్ర అని ఎంఈవో వేమవరపు కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం మండలంలోని వెల్లలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం గీంజుపల్లి వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ సభలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందన్నారు. మేధావులను తయారు చేసేది ఉపాధ్యాయులేనన్నారు. సమాజంలో డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలను, మేధావులను తయారు చేసేది ఉపాధ్యాయులే నన్నారు. ఈ సందర్భంగా గీంజుపల్లి వెంకటేశ్వర్లు ఆయన సతీమణి రజినీలను అతిథులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 దినేష్ కుమార్, గ్రామ నాయకులు ఆలూరి శ్రీనివాసరావు, చింతా రామారావు, గోవింద తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

● ఘటన జరిగిన తీరుపై స్పష్టత కరువు

అద్దంకి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన అద్దంకి పట్టణంలో సోమవారం చోటుచేసుకొంది. స్థానికుల కథనం మేరకు అద్దంకి మండలం మణికేశ్వరానికి చెందిన మురికిపూడి అయ్యన్న మోటార్‌సైకిల్‌పై మణికేశ్వరం వెళ్తుండగా ఆశావర్కర్ బండి అరుణ కూడా ఇంటికి వెళ్లేందుకు మోటారు సైకిల్ ఎక్కింది. అదే సమయంలో వేలమూరిపాడుకు చెందిన హనుమంతరావు కూడా అద్దంకి పట్టణంలో నుంచి మోటార్‌సైకిల్ పై ఇంటికి వెళ్తున్నాడు. పట్టణంలోని నామ్‌రోడ్డులో వాసవినగర్ సమీపంలో ఈ రెండు మోటారు సైకిళ్లు పక్కకు పడి ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుండి అయ్యన్న, అరుణ, హనుమంతరావులను మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో ఆయా కుటుంబాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అయితే ప్రమాదం ఎలా జరిగింది అనే విషయంపై స్పష్టత లేకుండా ఉంది. మోటార్‌సైకిళ్లు అదుపు తప్పి పడిపోయారా..? లేక వేరే ఏదైనా వాహనం ఢీ కొట్టిందా..? అన్న విషయంపై స్పష్టత లేకుండా ఉంది. పోలీసుల విచారణలో ప్రమాదం జరిగిన తీరు వెల్లడి కావాల్సి ఉంది.


### ప్రజలకు, ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాలి



సమావేశంలో మట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకరరావు

చినగంజాం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సిబ్బంది ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా సక్రమంగా పనిచేసి ప్రజలకు, ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. ఆయన తన కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సోమవారం సమీక్ష నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మంత్రులు, కలెక్టర్, ఆర్‌డీవో, తహసీల్దార్ కార్యాలయం నుండి వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అర్జీదారుల సమస్యలు ఓర్పుతో, ఓపికగా, శ్రద్ధగా విని వారికి మన పరిధిలో మన పరిధిలో సమస్యలు పరిష్కరించగలమో లేదో తెలపాలన్నారు. చినగంజాం, పెదగంజాం గ్రామంలో ఎఫ్‌పోలర్‌ను త్వరగా పూర్తిచేయాలన్నారు. నీటి తీరువా పన్నులను త్వరగా వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుజాత, ఇన్‌చార్జ్ ఆర్ఐ బండారు దానియేలు, గ్రామ రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### తెలుగు తమ్ముళ్ల సంబరాలు



కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న తెలుగు తమ్ముళ్లు

కారంచేడు (పర్చూరు), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబునాయుడు తన రాజకీయ ప్రస్థానంలో ముఖ్యమంత్రిగా 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కారంచేడులోని టీడీపీ కార్యాలయంలో తెలుగు తమ్ములు సంబరాలు చేసుకున్నారు. సోమవారం కేక్ కట్‌చేసి సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. తొలుత చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చౌదరి, ప్రహ్లాద, లక్ష్మీనారాయణ, హుస్సేన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### పొగాకు కొనుగోళ్ల బకాయిలు చెల్లింపు

● బ్యాంకు నగదు జమకావడంపై రైతుల్లో ఆనందం

పర్చూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా ప్రభుత్వం నల్లబర్లి పొగాకును కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. సాంకేతిక కారణాలతో వీరికి నగదు చెల్లింపులో కొద్దిపాటి జాప్యం జరిగింది. ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టి సమస్యను చక్కదిద్దింది. సోమవారం ఎక్కువ మంది రైతుల ఖాతాలలో పొగాకు నగదు జమయ్యింది. దీంతో పొగాకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పొగాకు రైతుల సమస్యపై స్పందించి ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంన్నాయుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పింఛన్లు

● కోనంకిలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ● నియోజకవర్గాల్లో పండుగలా పింఛన్ల పంపిణీ

మార్టూరు, సెప్టెంబరు 1: అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పింఛన్లను అందజేయనున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. మండలంలోని కోనంకి గ్రామంలో ఎన్‌టీఆర్ పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని వృద్ధులను పలకరిస్తూ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎస్సీకాలనీలో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లను పరిశీలించారు. కొత్తగా నిర్మాణం చేసిన షెడ్డును పరిశీలించారు. గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలన్నారు. అనంతరం ఈ ఏడాది రైతులు ఏఏ పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారని రైతులను అడిగి తెలుసుకున్నారు. సాగర్ జలాలు విడుదల కావడంతో ఆనందంగా ఉందని పలువురు రైతులు ఎమ్మెల్యే ఏలూరికి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంబాబు, తహసీల్దార్ టి.ప్రశాంతి, స్థానిక నాయకులు కోటపాటి సురేష్, ఏసుపాదం, వీరవల్లి శ్రీరాములు, సుబ్బారావు, కొర్రపాటి కాజారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**పండుగలా పింఛన్ల పంపిణీ**

చీరాల : పేదలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని, ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న పింఛన్ పంపిణీ కార్యక్రమం సోమవారం నియోజకవర్గంలో పండుగ వాతావరణాన్ని తలపించింది. ఎమ్మెల్యే కొండయ్య రామాపురం, విజయలక్ష్మీపురం, మున్సిపల్ పరిధిలోని 2వ వార్డుల్లో పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హుల జాబితాపై ఆందోళన చెందవద్దని సూచించారు. ఆయా ప్రాంతాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి అందిన అర్జీలను స్వీకరించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు, కమిషనర్ అబ్దుల్ రషీద్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**జర్నలిస్టుకు అండగా ప్రభుత్వం**

అర్హత కలిగిన ప్రతీ జర్నలిస్టుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. ఇటీవల మరణించిన ప్రముఖ పాత్రికేయులు, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏపీయుడబ్ల్యుజె మాజీ అధ్యక్షులు కడియం మురళీ సంస్మరణ సభకు టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీతో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. మురళీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల అభ్యున్నతికి కృషి చేస్తుందని వివరించారు.

బల్లికురవ : ప్రభుత్వం అర్హులైన వారికి పించన్లను అందజేస్తోందని, ఎంపీడీవో కుసుమకుమారి పేర్కొన్నారు. మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో పించన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి పించన్లను అందజేయాలని సిబ్బందికి సూచించారు. మెదటిరోజు మండలంలో 92 శాతం పించన్లు పంపిణీ చేశామన్నారు అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోడ్ల వెంబడి చెత్త లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అద్దంకిటౌన్ : అర్హత కలిగిన లబ్ధిదారులందరికీ, ప్రభుత్వం నెల మొదటి తేదీలలోనే పెన్షన్లను పంపిణీ చేస్తోందని ఎంపీడీవో బత్తిన సింగయ్య తెలిపారు. సోమవారం మండలంలోని జార్లపాలెంతో పాటు పలు గ్రామాలల్లో పర్యటించి పెన్షన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. పలువురు లబ్ధిదారులు ఎంపీడీవో చేతుల మీదుగా పెన్షన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు నెలలలో పెన్షన్‌లు పొందిన దివ్యాంగు లందరికీ, సెప్టెంబరు నెలలలో కూడా పెన్షన్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నోటీసులు అందుకున్నవారికి పెన్షన్ పంపిణీ జరుగుతోందన్నారు. మండలంలో మొత్తం 93 శాతం పంపిణీ పూర్తిచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.

బల్లికురవ : ప్రభుత్వం అర్హులైన వారికి పించన్లను అందిస్తోందని ఎంపీడీవో కుసుమకుమారి పేర్కొన్నారు. మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో పించన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి పించన్లను అందజేయాలని సిబ్బందికి సూచించారు. మెదటిరోజు మండలంలో 92 శాతం పించన్లు పంపిణీ చేశామన్నారు. అదేవిధంగా గ్రామాలు పరిశుభ్రంగా చూడాలే చూడాలని పంచాయతీ సిబ్బందికి ఆమె సూచించారు.



పింఛన్ సొమ్మును అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు





వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, అద్దంకిలో పంపిణీ చేస్తున్న ఎంపీడీవో సింగయ్య

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రోత్సాహం

సైకిళ్లు పంపిణీ చేసిన మంత్రి రవికుమార్

పంగులూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ సైకిళ్లు అందజేయాలనే లక్ష్యంతో ఉన్నత పాఠశాల అందచేయాలని కృషి చేస్తున్నట్లు మంత్రి రవికుమార్ తెలిపారు. మండల కేంద్రమైన పంగులూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అసిస్ట్, మేఘా సంస్థల సహకారంతో 316 మంది విద్యార్థులకు సైకిళ్లను మంత్రి రవికుమార్ చేతుల మీదగా పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు 10వేల సైకిళ్ల పంపిణీ లక్ష్యంగా కార్యాచరణ రూపొందించామన్నారు. మెఘా సంస్థ సీఎస్ఆర్ నిధి కింద రూ.50లక్షలు సమకూర్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఏకరూప దుస్తులు, బ్యాగులు, పుస్తకాలను సమకూరుస్తున్నారన్నారు. వీటితో పాటు సన్నబియ్యంతో కూడిన నాణ్యమైన భోజనం అందజేస్తున్నట్లు తెలిపారు. పంగులూరు ఉన్నత పాఠశాలలో భోజనశాల, బాలికల విశ్రాంతి కోసం ప్రత్యేకవసతి ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అసిస్ట్ డైరక్టర్ జాష్టి రంగారావు, అసోసియేట్ డైరెక్టర్ విష్ణుప్రియ, ఆర్‌డీవో చంద్రశేఖర్ నాయుడు, ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ సింగారావు, ఎంఈవో వీరాంజనేయులు, పాఠశాల హెచ్.ఎం. సోమేపల్లి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, తెలుగు మహిళ అధ్యక్షురాలు గొట్టిపాటి వెంకటరత్నం, కుక్కపల్లి ఏడుకొండలు, కో వీ.సుబ్బారావు, చింతలసహదేవడు, శేఖర్, శ్రీనివాసరెడ్డి, పలుగ్రామాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంగులూరు : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభగల విద్యార్థులు ఉన్నత చదువుకు విద్యోన్నతి ఫౌండేషన్ అందిస్తున్న ఆర్థిక సేవలు అభినందనీయమని మంత్రి రవికుమార్ అన్నారు. పంగులూరు, అద్దంకి, ఇంకొల్లు మండలాలపరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన పోటీపరీక్షలో ప్రతిభచాటిన 30 మంది విద్యార్థుల ఇంటర్ చదువుకోసం విద్యోన్నతి ఫౌండేషన్ సమకూర్చిన రూ.3లక్షల విలువైన నగదు చెక్కులను మంత్రి గొట్టిపాటి పంపిణీ చేశారు. మూడేళ్ళుగా ఫౌండేషన్ ద్వారా పీ-4 తరహాలో విద్యార్థులకు సాయం అందిస్తున్న డైరక్టర్ ధూళిపాళ్ల వీరనారాయణను అభినందించారు. కార్యక్రమంలో బాచిన చెంచుప్రసాద్, కరి కమలేశ్వరరావు, ఎంఈవో. వీరాంజనేయులు, ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ సింగారావు, రావూరి రమేష్, బోడెంపూడిశంకర్, ఏడుకొండలు, రావి శ్రీనివాసరావు, శిరిగిరిశ్రీను, విద్యార్థుల తల్లిదండ్రులుపాల్గొన్నారు.

**ఖోఖో క్రీడాకారులకు అభినందన**

ఈనెల 24,25,26,తేదీలలో తిరుపతిలో జరిగిన అమరావతి ఖోఖో ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలలో విజేతలుగా నిలిచిన బాపట్ల జిల్లా జట్టును మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభినందించారు. 22 సంవత్సరాల పురుషుల విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి లక్షరూపాయల ప్రైజ్‌మనీ సాధించినట్లు ఖోఖో అసోషియేషన్ రాష్ట్రకార్యదర్శి యం.సీతారామిరెడ్డి మంత్రికి తెలిపారు. క్రీడలకు తమవంతు సహకారం అందిస్తామని మంత్రి గొట్టిపాటి అన్నారు.



సైకిళ్లను అందజేస్తున్న మంత్రి రవికుమార్

### 'భిక్షువర్షీయసి'కి పోలీసుల సాయం

● రోడ్డువెంబడి నిస్సాయస్థితిలో పడి ఉన్న వృద్ధురాలు
● 'ఆంధ్రజ్యోతి' సమాచారంతో స్పందించిన పోలీసులు



రోడ్డుపక్కన దీనావస్థలో ఉన్న వృద్ధురాలు

పర్చూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కదలలేని స్థితిలో ఉన్న వృద్ధురాలు(90) సోమవారం పర్చూరు పర్చూరు పోలీసులు సాయం చేశారు. 108 వాహనంలో చీరాల ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. స్థానిక బొమ్మల కూడలిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు రోడ్డుపక్కనే వృద్ధురాలు పడి ఉంది. వచ్చే పోయేవారివైపు దీనంగా చూస్తున్న తీరు, పలువురిని కంటతడి పెట్టించింది. తనంతట తాను అక్కడికి వచ్చే అవకాశం లేని ఆ వృద్ధురాలు అక్కడకు ఎలా వచ్చింది..! కుటుంబ సభ్యులు తీసుకువచ్చారా..? అనేది చెప్పలేని స్థితిలో ఉంది. కనీసం యాచన కూడా చేయలేని స్థితిలో ఉన్న ఆ వృద్ధురాలికి సాయం అందించేవారు కరువయ్యారు. ఇంచుమించు శతాబ్దకాలం క్రితమే పూర్వమే మహాకవి శ్రీశ్రీ 'భిక్షువర్షీయసి' కవితను ఈమె లాంటి వారిని చూసే రాశాడా..! అన్న తీరుగా రోడ్డువెంబడి వృద్ధురాలు పడి ఉంది. దీంతో వృద్ధురాలి దీనావస్థను గమనించిన 'ఆంధ్రజ్యోతి' సోమవారం సాయంత్రం స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చింది. స్పందించిన సీఐ జీఎల్ శ్రీనివాసరావు, ఎస్ఐ జీవీ.చౌదరిలు 108 వాహనంలో ఆమెను చీరాల ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అందించి వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. ఆమె కుటుంబ సభ్యుల గురించి ఆరా తీస్తామన్నారు.

### చంద్రన్నతో తెలుగు ఖ్యాతి విశ్వవ్యాప్తం

● ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే లక్ష్యంగా సంస్కరణలకు రూపకల్పన చేసి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచి, విజన్ అనే ఆయుధంతో తెలుగు రాష్ట్రాల ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుదేనని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం మార్టూరు మండలం, ఇసుక దర్శి క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. దశాబ్దాలుగా కార్యాలయాలకే పరిమితం అయిన పాలనను ప్రజల వద్దకు తీసుకువచ్చి, పాదర్శక పాలనకు చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారన్నారు. ప్రస్తుతం ప్రజాకూటమి ప్రభుత్వంలో రూ.500 కోట్లతో జన్మభూమి 2.0కి శ్రీకారం చుడుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చరిత్రలో విమానాశ్రయాల విస్తరణ ఒక మైలురాయి అన్నారు. చంద్రబాబు దూరదృష్టి, ప్రణాళిక ఆలోచనతో దేశంలో తొలి ప్రైవేటురంగ విమానాశ్రయం రూపుదిద్దుకుందన్నారు. సమాచార సాంకేతిక రంగంలో చంద్రబాబు తెచ్చిన సంస్కరణలు దేశ రూపురేఖల్ని మార్చాయని పేర్కొన్నారు. ప్రతి పేదవానికి రూ.5 కే నాణ్యమైన భోజనం అందించేలా అన్నక్యాంటీలను ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పేదలు, కూలీలు, తక్కువ ధరకే ఆహారం తినగలుగుతున్నారన్నారు.

### అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా పనిచేయాలి

● మంత్రి రవికుమార్‌కు సమస్యలను వివరించిన ప్రజలు

అద్దంకి, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందేలా క్షేత్రస్థాయిలో కూటమినేతలు, అధికారులు పనిచేయాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలోని ఇందిరానగర్‌లో మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మాబు అనారోగ్యం తో బాధపడుతుండగా మంత్రి రవికుమార్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా అద్దంకి పట్టణంలోని పలువురు తమ సమస్యలను మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకు వచ్చారు. ప్రధానంగా వృద్ధ మహిళ తనకు పింఛన్ రావడం లేదని చెప్పడంతో వెంటనే అన్ని పత్రాలు తీసుకొని పింఛన్‌కు దరఖాస్తు చేయించాలని మున్సిపల్ కమీషనర్ రవీంద్ర, స్థానిక నేతలకు చెప్పారు. స్థలాల సమస్యను మంత్రి దృష్టికి తీసుకురావడంతో వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీచరణ్‌ను చెప్పారు. అద్దంకి పట్టణంలో జరుగుతున్న విద్యుత్ టవర్ లైన్ల పనుల గురించి ఈఈ నల్లూరి మస్తాన్‌రావును మంత్రి రవికుమార్ అడిగి తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో పనులు పూర్తి కావాలంటే ఇంకా ఎంతమేర టవర్‌లు అవసరం అని అడిగి వెంటనే అంచనాలు తయారు చేసి పంపాలని ఆదేశించారు. పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

### ఘనంగా పదహారురోజుల ఉత్సవం



పొంగళ్లు సమర్పిస్తున్న మహిళలు

పంగులూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): చిలుకూరివారి వంశదేవర భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో పదహారురోజులు ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి, స్వామివారికి ఈ సందర్భంగా విశేష పూజలు చేశారు. చిలుకూరివారి ఆడపడుచులు పొంగళ్ళు సమర్పించారు. వేద పండితులు వేముల శ్రీహరి, త్రినాథ్‌లు స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో చిలుకూరి వీరరాఘవయ్య, మేడ సుబ్బారావు, రామాంజనేయులు, మిల్లు ఆంజనేయులు, కోటయ్య, మల్లవరం సర్పంచ్ చిలుకూరి హియ్య, వెంకటేశ్వర్లు పలుగ్రామాలకు చెందిన చిలుకూరి వంశస్థులు పాల్గొన్నారు.

### నేడు చినఅంబడిపూడిలో ఉచిత వైద్య శిబిరం

బల్లికురవ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన అంబడిపూడి గ్రామంలో నేడు మంగళవారం ఉదయం కాటూరి వైద్యశాల తరపున ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ పెద్దలు దద్దాల అంజయ్య, గంగవరపు నాయుడులు తెలిపారు. ఈ శిబిరంలో గుండె, కీళ్ల నరాలు, కంటి పరీక్షలు వైద్యులు చేస్తారని అవసరమైన వారికి ఉచితంగా అపరేషన్లు చేస్తారని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

### రూ.3.50 లక్షలు పలికిన లడ్డూ వేలం



రూ.3.50 లక్షలకు లడ్డును దక్కించుకున్న కుటుంబ సభ్యులు

మార్టూరు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి):పట్టణంలో మద్దిసీతాదేవి నగర్‌లో వినాయకుని మండపం వద్ద ఆదివారం రాత్రి లడ్డువేలంపాటలో ఉప్పు చిన్నగురవయ్య రూ.3.50 లక్షలకు లడ్డూను వేలంపాటలో దక్కించుకున్నారు. దీంతో గురవయ్య కుటుంబసభ్యులకు పూజారి ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం లడ్డూను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. తదుపరి ఆయన లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు.



నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

అద్దంకి : గణేష్ నిమజ్జనాల ఊరేగింపులు సోమవారం సందడిగా సాగాయి. పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన 15 వినాయక విగ్రహాల నిమజ్జనం సోమవారం నిర్వహించారు. పట్టణంలోని విజయలక్ష్మి సినిమాహాల్ సమీపంలో కార్పెంటర్స్ అండ్ హార్డ్‌వేర్ షాపుల వర్కర్ లు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జనం ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. మండలంలోని ధర్మవరం, మోదేపల్లి లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు ఊరేగింపు ఉత్సాహంగా సాగాయి. సీఐ సుబ్బరాజు, ఎస్సై నరశింహ, పీఎస్సై వెంకటేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఘనంగా వినాయక నిమజ్జనాలు

బల్లికురవ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండగ సందర్భంగా పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన గణనాధుల విగ్రహాలను సోమవారం నిమజ్జన వేడుకలు నిర్వహించారు. గుంటుపల్లి గ్రామంలో అసిస్టు కానలీలో, మరియు బ్రహ్మగంగారి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాల నిమజ్జనం కోలాహలంగా చేపట్టారు. ఈసందర్భంగా మహిళ భక్తులు ఒకే రకమైన చీరలు ధరించి గ్రామంలో గణనాధుడికి నీటితో వారులు పోసి పూజలు నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా తాము అంతా ఒకటే అనే విధంగా వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొప్పెరపాలెం గ్రామంలో వినాయకుని వద్ద పూజలందుకున్న లడ్డును అదే గ్రామానికి చెందిన యర్రా అంజయ్య, భారతి దంపతులు రూ. 96 వేలకు వేలం పాటలో దక్కించుకొన్నారు. ఈసందర్భంగా గ్రామంలో గ్రామోత్సవం చేపట్టి లడ్డును బంధు మిత్రులకు పంపిణీ చేశారు.



ముప్పవరంలో నిమజ్జనంలో పాల్గొన్న మహిళలు


పంగులూరు : మండలంలోని పంగులూరు, ముప్పవరం, చందలూరు గ్రామాలలో గణనాధుని నిమజ్జనోత్సవ ఊరేగింపు ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గత ఐదురోజులుగా ప్రత్యేక మండపాలలో కొలువుదీరిన గణనాదునికి శాస్త్రోక్తంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. సోమవారం స్వామివారిని నిమజ్జనం చేసేందుకు ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలలో గణనాదుని తోడ్కొని సముద్రంలో నిమజ్జనం చేసేందుకు భక్తులు భజనలు చేస్తూ, బాణాసంచా కాల్చుతూ అధిక సంఖ్యలో ఊరేగింపుగా తరలివెళ్లారు.

అద్దంకి: గణేష్ నిమజ్జనాల ఊరేగింపు లు సోమవారం సందడి గా సాగాయి. అద్దంకి పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన 15 వినాయక వి గ్రహాల నిమజ్జనం సోమవారం జరిగింది. అద్దంకి పట్టణంలోని విజయలక్ష్మి సినిమాహాల్ సమీపంలో కార్పెంటర్స్ అండ్ హార్డ్‌వేర్ షాపుల వర్కర్ లు ఏర్పాటు చేసిన వినాయక వి గ్రహం నిమజ్జనం ఊరేగింపు వైభవంగా సాగింది. మండలంలోని ధర్మవరం, మోదేపల్లి లలో ఏర్పాటు చేసిన వినాయక వి గ్రహాలు ఊరేగింపు ఉత్సాహంగా సాగాయి. సిఐ సుబ్బరాజు, ఎస్సై నరశింహ, పీఎస్సై వెంకటేశ్వరరెడ్డి ల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.





కొప్పెరపాలెంలో లడ్డును దక్కించుకున్న అంజయ్య, గుంటుపల్లిలో నిమజ్జనోత్సవంలో పాల్గొన్న మహిళలు



## ఇన్‌చార్జి డీఆర్వోగా విజయకుమార్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ అధికారి (ఇన్‌చార్జి)గా ఎన్.విజయకుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ ఓ. ఆనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన సోమవారం డీఆర్వో చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. విజయకుమార్ ప్రస్తుతం జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిగా పని చేస్తున్నారు. డీఆర్వోగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు.




ఏఎస్‌పేటలోని శ్రీశ్రీశ్రీ హజరత్ సయ్యద్ ఖాజారహమతుల్లా నాయబ్ రసూల్ సతీమణి దొరసానమ్మ గంధమహోత్సవంలో భాగంగా సోమవారం భక్తిశ్రద్ధలతో చిరాగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దర్గాలోని కోనేరు, పరిసరాలలో భక్తుల దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సంద్భంగా విద్యుద్దీప వెలుగుల్లో దర్గా ప్రాంతం శోభిల్లింది. మంగళవారం తహలీల్ ఫతేహాతో గంధమహోత్సవం ముగియనున్నది.

- ఏఎస్‌పేట (ఆంధ్రజ్యోతి)



## అర్హులందరికీ 'అన్నదాత సుఖీభవ'

మొదటి విడతలో నగదు అందనివారికి 2వ విడతలో జమ

- యూరియా కొరత లేదు.. విస్తృతంగా టాస్క్‌ఫోర్స్ తనిఖీలు
- జిల్లాలో 31,231 మట్టి నమూనాలు సేకరించడమే లక్ష్యం
- డ్రోన్ల కోసం దరఖాస్తు చేసుకోండి!
- 'ఆంధ్రజ్యోతి'తో డీఏవో సత్యవాణి

ఇంటర్వ్యూ

అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి అన్నదాత సుఖీభవ పథకం నిధులు అందుతాయని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి పేర్కొన్నారు. మొదటి విడతలో దాదాపు 1.97 లక్షల మందికి రూ.5 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేసిందని, ఇంకా 4 వేల మంది వరకు ఎన్‌పీసీఐ చేయించాల్సి ఉందని, అదేవిధంగా 320 మంది వరకు ఈకేవైసీ చేయాలని చెప్పారు. మొదటి విడతలో వివిధ కారణాల వల్ల నగదు జమ కాని అర్హత కలిగిన రైతులకు రెండో విడతలో నగదు జమవుతుందని చెప్పారు. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అన్నదాత సుఖీభవ, ఖరీఫ్‌లో పంటసాగు, యూరియా కొరత తదితర అంశాలపై సత్యవాణి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

- వివరాలు 8లో..




## ఉదయగిరి వైద్యశాలకు మహర్దశ

- రూ.5.75 కోట్లు మంజూరు

ఉదయగిరి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి మహర్దశ పట్టనుంది. వైద్యశాల అభివృద్ధికి రూ.5.75 కోట్లు మంజూరు చేస్తూ సోమవారం వైద్యం, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో పాత భవనాలను తొలగించి వాటి స్థానంలో ప్రత్యేక ప్రసూతి కేంద్రం నిర్మాణంతోపాటు మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టనున్నారు. జిల్లాకు సుదూర ప్రాంతంలో ఉన్న ఉదయగిరివాసులకు మెరుగైన వైద్యసేవలు అందకపోవడంతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వైద్యశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు వైద్యశాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాష్ట్రంలోని తొమ్మిది సామాజిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.51.75 కోట్లు మంజూరు చేయగా అందులో ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి కూడా చోటు లభించింది. వైద్యశాలకు రూ.5.75 కోట్లు మంజూరు కావడంపట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పొదలకూరు సర్పంచి చెక్ పవర్ రద్దు

- ఉత్తర్వులు జారీ చేసిన డీపీవో

పొదలకూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు మేజర్ గ్రామ సర్పంచ్ మల్లికా చిట్టెమ్మ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ డీపీవో ఎల్ శ్రీధర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధుల వినియోగంలో అవకతవకలపై గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బి మల్లికార్జున నాయుడు ఆధారాలతో లిఖితపూర్వకంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి లేఖ రాయడంతో ఈ ఏడాది జనవరిలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై జూన్‌లో నెల్లూరు డీఎల్‌పీవో నిర్వహించిన విచారణ నివేదికల ఆధారంగా సర్పంచ్ చిట్టెమ్మ ఇచ్చిన సంజాయిషీ అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్పంచ్ చెక్ పవర్‌ను ఆరు నెలలపాటు రద్దు చేశారని పొదలకూరు ఎంపీడీవో నరసింహారావు సోమవారం తెలిపారు. చెక్ పవర్‌ను ఎంపీడీవోకు అప్పగించారు.


## క్లినిక్‌లో కదలిక!

- ఏడాదిలో అన్నీ నిర్మించేలా ప్రభుత్వ నిర్ణయం

- పొదలకూరు మండలంలో ఎక్కువగా 22 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ యంత్రాంగం నిర్ణయించగా ఇందులో 10 నిర్మాణాలు పూర్తయ్యాయి. 8 వరకు బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయి.. నాలుగింటి నిర్మాణం మొదలే కాలేదు. ఇందుకు స్థలాల మంజూరు కూడా కాలేదు.
- మనుబోలు మండలంలో 13 క్లినిక్‌ల నిర్మాణానికి అనుమతులుండగా ఏడు మాత్రమే నిర్మాణానికి నోచుకున్నాయి. ఆరు క్లినిక్‌ల పనులు ప్రారంభం కాలేదు. ఇదిగో.. అదిగో అంటూ ప్రభుత్వం ఐదేళ్లు గడిపేసింది.
- కావలి రూరల్ మండలంలో 14 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం ఐదు చోట్ల నిర్మాణాలు పూర్తి కావస్తున్నా మిగిలినవి పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. పనులు నత్తనడకన సాగుతున్నాయి.



పొదలకూరు మండలం ఇనుకుర్తి గ్రామంలో బేస్‌మెంట్‌కే పరిమితమైన విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం



పొదలకూరులో పిచ్చిచెట్ల మధ్య అసంపూర్తిగా భవనం

### అసంపూర్తిగా విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు
### 487 భవనాలకు 74 మాత్రమే పూర్తి
### వాటిలోనూ సగమే వినియోగం
### పనులకు త్వరలో నిధులు విడుదల


నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పల్లెప్రజలకు ప్రాథమిక వైద్యం అందించేందుకు నిర్దేశించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు సొంత భవనాలకు నోచుకోవడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం 2022 మార్చిలో ఈ క్లినిక్‌లు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఉపాధిహామీ పథకం కింద 50 శాతం, వైద్య శాఖకు ద్వారా మరో 50 శాతం నిధులతో పీహెచ్‌సీలకు అనుబంధంగా గ్రామాల్లో వీటిని నిర్మించాల్సి ఉంది. అయితే నాటి ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవటం, స్థలం కేటాయింపులో కొరవడిన చొరవతో నిర్మాణాలు ముందుకు సాగనంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలపై దృష్టిపెట్టింది. వీటిని ఏడాదిలోపు పూర్తి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఆయా నిర్మాణాలకు రూ. 17 లక్షలు ఖర్చవుతుండగా ప్రస్తుతం భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.26 లక్షలు కేటాయిస్తోంది. ఇందుకు అవసరమైన నిధులు కూడా త్వరలో విడుదల చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. అదేవిధంగా స్థల సమస్య ఉన్నచోట పరిష్కార మార్గాలనూ అన్వేషిస్తోంది.

### రూ.12.39 లక్షల అద్దె

జిల్లాకు 487 హెల్త్ క్లినిక్‌లు మంజూరుకాగా ఇప్పటివరకు 74 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. వాటిల్లో 36 భవనాల్లోనే క్లినిక్‌లు నడుస్తున్నాయి. దీంతో 451 క్లినిక్‌లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇందుకుగాను ప్రభుత్వం నెలకు రూ.12.39 లక్షలు వెచ్చిస్తోంది. సకాలంలో స్వంత భవనాలు పూర్తి చేసి ఉంటే ఈ నిధుల భారం తగ్గి ఉండేది.

## సోలార్ ప్యానల్ ఏర్పాటుకు ప్రభుత్వ భూమి పరిశీలన

8



## సోమశిల.. జలకళ!

- 65 టీఎంసీలకు చేరువలో డ్యాం
- ఇక నిర్లక్ష్యం తగదు
- అప్రమత్తతే శ్రీరామరక్ష

అనంతసాగరం సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి వస్తున్న వరదతో సోమశిల ప్రాజెక్టు 65 టీఎంసీలకు చేరువైంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా వరదలు వచ్చే సమయంలో 70 నుంచి 75 టీఎంసీల మధ్య నీటినిల్వకు అధికారులు చర్యలు తీసుకొంటారు. అయితే, భారీ వరద కొనసాగితే నీటినిల్వ తక్కువగా ఉంచుకోవడం శ్రేయస్కరం. గత వైసీపీ హయాంలో భారీవరద కొనసాగే సమయంలో అవగాహన లేక 76 టీఎంసీలు నిల్వ చేసి ప్రాజెక్టు మనుగడ దెబ్బతీశారు. అలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకొని మనుగడ కాపాడేలా ముందస్తు చర్యలు తీసుకొంటే మంచిదని రైతాంగం కోరుతోంది. గడిచిన కొంతకాలంగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా రోజువారీగా 2 టీఎంసీల నీరు సోమశిలకు చేరుతోంది. దీంతో కండలేరు జలాశయానికి వరద కాలువ ద్వారా సరఫరా చేస్తూ అక్కడి నీటినిల్వ పెంచారు. పెన్నా క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురవక ముందే సోమశిల, కండలేరు జలాశయాలు నిండుకుండలా మారాయి. ప్రస్తుతం వస్తున్న వరదతోపాటు పెన్నాపరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురిస్తే సోమశిలకు భారీవరద నమోదై సూచనలు ఉన్నాయి. దీంతో వచ్చే వరద, కడప, కర్నూల్, అనంతపురం, చిత్తూరు ప్రాంతాల్లో కురిసే వర్షాలను బేరీజు వేసుకొంటూ సోమశిలలో నీటినిల్వ పెంచుకోవడం ఉత్తమంటూ నిపుణులు భావిస్తున్నారు.

**సిబ్బంది కొరత**

సోమశిల ప్రాజెక్టు వద్ద సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఉన్నవారు ఉద్యోగ విరమణ పొందడం, కొత్తగా సిబ్బందిని నియమించకపోవడంతో ఉన్నవారిపై పనిభారం పెరిగింది. ఇక్కడ 40 నుంచి 50 మంది వరకు ఉద్యోగులు పని చేయాల్సి ఉండగా కేవలం 10 మందిలోపు మాత్రమే ఉన్నారు.

- 23,031 క్యూసెక్కుల వరద

జలాశయానికి సోమవారం 23,031 క్యూసెక్కులు వస్తుండగా 62.650 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,500, డెల్టాకు 1,850 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.




ఉదయగిరి మండలం దాసరిపల్లిలో శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనం

## పంచాయతీలకు మంచిరోజులు

శాశ్వత భవన నిర్మాణాలకు నిధులు

40 పంచాయతీలకు రూ.12.8 కోట్ల కేటాయింపు

నెల్లూరు, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): సొంతభవనాలు కూడా లేకుండా కునారిల్లుతున్న జిల్లాలోని పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శుభవార్త చెప్పాయి. మొదటి విడతలో 40 పంచాయతీలకు పాలన భవనాల నిర్మాణం కోసం అనుమతులు మంజూరయ్యాయి. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఈ భవనాలను నిర్మించనున్నారు. జిల్లాలో మొత్తం 722 పంచాయతీలు ఉండగా, అందులో 127 పంచాయతీలకు సొంత భవనాలు లేవు. ఈ పంచాయతీల్లో నూతన భవనాలు నిర్మించేందుకు జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికీ పంపగా, మొదటిదశలో 40 భవనాలు నిర్మించేందుకు అనుమతులు లభించాయి. ఒక్కో పంచాయతీ భవనాన్ని రూ.32లక్షలతో నిర్మించనున్నారు. మొత్తం 40 పంచాయతీల భవనాలకు రూ.12.80 కోట్లు కేటాయిస్తూ పంచాయతీ రాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భవనాల నిర్మాణాల బాధ్యతలను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి అప్పగించారు. త్వరలోనే టెండర్లు పిలవనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా మిగిలిన 87 పంచాయతీల్లో కూడా దశలవారీగా నూతన భవనాలు నిర్మించనున్నట్లు పంచాయతీ అధికారులు చెబుతున్నారు.

**ఎంపికైన పంచాయతీలు ఇవే..**

చెముడుగుంట (వెంకటాచలం), పెద్దపాళెం (విడవలూరు), దాసరిపల్లి (ఉదయగిరి), పైనంపురం, మామిడిపూడి (ముత్తుకూరు), దేవరాయపల్లి, కొత్తపల్లి (అనంతసాగరం), మన్నంగిదిన్నె (కావలి), ఆరవీటి కిస్తీపురం (వింజమూరు), కొమ్మలపూడి, కాగితాలపూరు (మనుబోలు), మండపం (టీపీగూడూరు), వేములపాడు (జలదంకి), రాపూరు, సోమరాజుపల్లి (ఇందుకూరుపేట), పుట్టుపల్లి, తూర్పుపల్లి (చేజర్ల), మల్లికార్జునపురం, పాపిరెడ్డిపాళెం (టీపీ గూడూరు), లింగపాళెం (వీవీ పాళెం), అమ్మవారిపాళెం (పొదలకూరు), నెల్లేపల్లి, శానాయిపాళెం (రాపూరు), కలువాయి (చేజర్ల), కుమ్మరకొండూరు (కలిగిరి), చాటగొట్ల, మర్రిపల్లి (పొదలకూరు), పెరంకొండ (కలువాయి), ఊచగుంటపాళెం, ఎలమంచిపాడు, అడకలూరు (దగదర్తి), మహ్మదాపురం (వరికుంటపాడు), ఎస్‌వీ కండ్రిగ (బోగోలు), రామవరప్పాడు (జలదంకి), గాంధీజన సంఘం (సంగం), శెట్టిపాళెం (కొండాపురం), మేదరమిట్టపాళెం (లింగసముద్రం), బ్రహ్మేశ్వరం (దుత్తలూరు), రాళ్ళపాడు (గుడ్లూరు), బసవాయిపాళెం (కొడవలూరు).

## ఏఆర్‌టీ, సరోగసి కేంద్రాలకు అనుమతి తప్పనిసరి : డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏఆర్‌టీ, సరోగసి కేంద్రాల ఏర్పాటుకు వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు తప్పనిసరని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా అనుమతుల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఏఆర్‌టీల కింద 9 మంది వైద్యులు, లెవల్ 1 క్లినిక్‌లకు 12 మంది వైద్యులు, లెవల్ 2 క్లినిక్ ఏఆర్‌టీ బ్యాంకులకు ఆరుగురు వైద్యులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వివరించారు. సరోగసి కింద ఒకరు అనుమతి తీసుకున్నారని తెలిపారు.

## రంగనాథుడి పవిత్రోత్సవాల ప్రారంభం



అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో సోమవారం రాత్రి పవిత్రోత్సవాలకు అంకురార్పణ జరిగింది. స్వామి వారికి ఏడాది పొడవునా జరిగే సేవల్లో తెలిసో తెలియక జరిగిన దోషాల నివారణకు ఈ పవిత్రోత్సవాలను ఏడాదికి ఓసారి నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలు ఈ నెల 7 వరకు జరుగుతాయి. పవిత్రోత్సవాలకు ఆండాళ్ సన్నిధిలో హోమ గుండాల నిర్మాణం పూర్తయింది. అంకురార్పణ పూజల్లో ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, అర్చకులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభాగ్యులకు ఆదరణేది!?

- దివ్యాంగుల సంక్షేమంలో అధికారుల నిర్లక్ష్యం 8లో..

## పేకాట అడ్డాపై పోలీసుల సీరియస్!

- ఐజీ నుంచి సీఎం కార్యాలయం వరకు ఆరా
- స్థావరాలపై దాడులకు ప్రత్యేక బృందం
- నిర్వాహకుల అరెస్ట్‌కు ఆదేశాలు
- కందుకూరు పరిధిలోని ఎస్ఐలకు మెమోలు

- వివరాలు 8లో..

**చికెన్ ధరలు**
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 120 |
| స్కిన్ చికెన్ | 220 |
| స్కిన్‌లెస్ | 242 |

కోడిగుడ్ల ధర (100): 560

## తాత్కాలికంగా నిలిచిన ఆధార్ సేవలు

లింగసముద్రం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 20 రోజుల క్రితం జిల్లా ఐటీడీఏ పీడీ ఆదేశాలతో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. వారం రోజుల క్రితం ఆధార్ కేంద్రంలో పనిచేసే ఆపరేటర్ రోడ్డు ప్రమాదానికి గురై వైద్యశాలలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుం టున్నారు. దీంతో ఆధార్ సేవలు తాత్కాలికంగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



# అంతర్గత రోడ్లకు మహర్దశ!

● సీసీ రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు ● రూ.17.61 కోట్లతో 185 పనులు ● 'ఉదయగిరి' పల్లెలకు పండుగ



చిరుజల్లులకే బురదమయంగా మారిన తూర్పుఎర్రబల్లి పంచాయతీ మన్నంవారిపల్లె రోడ్డు

కొండాపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో చినుకుపడితే చిత్తడిగా మారి ప్రజ లకు ఇబ్బందులు కలిగిస్తున్న అంతర్గతరోడ్లకు మహర్దశ పట్టనుంది. ఉదయగిరి నియోజకవర్గం లోని గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పల్లెకు పండగ కార్యక్రమంలో భాగంగా దాదాపు రూ.17.61 కోట్ల మంజూరు చేసింది. ఈ నిధులతో రోడ్ల నిర్మాణం పూర్తయితే ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు దర్శనమిస్తాయి.

**● నియోజకవర్గంలో 185 పనులు**

ఉదయగిరి నియోజకవర్గంలో ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, జలదంకి, కలిగిరి, కొండాపురం మండలాలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో అంతర్గత రోడ్లు ఎక్కువ భాగం ఇప్పటికీ మట్టి రోడ్లు ఉన్నాయి. వర్షాకాలంలో చిరుజల్లులకే రోడ్లు చిత్తడిగామారి ద్విచక్రవాహనాలపైనే కాకుండా కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి. ఈ క్రమంలో గ్రామాల్లో అంతర్గత రోడ్లను సీసీ రోడ్లగా మార్చేందుకు ప్రభుత్వం విరివిగా నిధులు మంజూరు చేసింది. ఈ నిధులను ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేయడంతో ఉపాధి హామీ కూలీలకు వేతనం లభిస్తోంది. మంజూరైన 185 పనులు, నిధుల వివరాలు ఇలా ఉన్నాయి.

| నెం | మండలం | మంజూరైన పనులు | నిధులు(రూ.కోట్లలో) |
|---|---|---|---|
| 1. | కొండాపురం | 31 | 2 |
| 2. | కలిగిరి | 16 | 2.12 |
| 3. | జలదంకి | 21 | 2 |
| 4 | వింజమూరు | 25 | 1.80 |
| 5. | దుత్తలూరు | 24 | 2 |
| 6. | ఉదయగిరి | 23 | 2.1 |
| 7. | సీతారామపురం | 19 | 1.46 |
| 8. | వరికుంటపాడు | 26 | 3.6 |

**త్వరలో పనుల ప్రారంభిస్తాం**

మంజూరైన నిధులతో త్వరలో పనులు ప్రారంభిస్తాం. గతేడాది చేసిన పనులకు సంబంధించి 40 శాతం నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. మిగిలిన నిధులు త్వరలోనే విడుదల చేస్తుంది. పనులను ప్రారంభించి వీలైనంత త్వరలో పూర్తి చేస్తాం.

- సీహెచ్.మణికుమార్, డీఈ, పీఆర్

## న్యూస్ బాక్స్

### జీ.మేకపాడును కనిగిరి నియోజకవర్గంలో కలపండి

కందుకూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలో ఉన్న జీ.మేకపాడు గ్రామాన్ని జిల్లాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా కనిగిరి నియోజకవర్గంలో కలిపేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం గ్రామసర్పంచు గూడపాటి బ్రహ్మయ్య, గ్రామ పెద్దలు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. మా గ్రామం మండల కేంద్రమైన కందుకూరుకు 45 కిలోమీటర్ల దూరంలో, నియోజకవర్గ కేంద్రమైన కనిగిరి పట్టణానికి అతి సమీపంలో ఉందన్నారు. దీంతో ఏ పనిమీద కందుకూరుకు రావాలన్నా అనేక ఇబ్బందులు పడుతున్నామని, దీంతో కనిగిరి నియోజకవర్గంలో కలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మీకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు లక్కిరెడ్డి సుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఉప్పతి శ్రీనివాసులురెడ్డి, దాదాని వెంకటేశ్వర్లు, నేలపాటి దావీదు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా బీబీ జానమ్మ గంధమహోత్సవం

కొండాపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవోలులో బీబీ జానమ్మ దర్గాలో ఆదివారం రాత్రి గంధమహోత్సవం ఘనంగా జరిగింది. కొమ్మికి చెందిన షేక్ ఖాజావలి ఇంటి వద్ద నుంచి ఊరేగింపుగా ముస్లింలు గంధాన్ని దర్గాకు తరలించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముజావర్లు గంధాన్ని బీబీ జానమ్మకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

### అగ్రిమెంట్‌పై కొనుగోలు భూములకు 1బీ ఇవ్వాలి

బిట్రగుంట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అగ్రిమెంట్‌పై భూములు కొనుగోలు చేసి వ్యవసాయం చేస్తున్న రైతులకు 1బీ, అడంగలు అందచేయాలని టీడీపీ రైతునేత దేవరాల తిరుపతియాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో దాదాపు చిన్నకారు రైతులు చాలా మంది అగ్రిమెంట్ ద్వారా కొనుగోలు చేసి భూముల్లో వ్యవసాయం చేస్తు జీవనం సాగిస్తున్నారన్నారు. వారికి 1బీ, అడంగలు అందచేసినట్లైతే ప్రభుత్వం అందచేసే రాయితీలు ఉపయోడపడతాయన్నారు. ఆయన వెంట కొల్లా రవీంద్రబాబు, ప్యాట్రిక్, శ్రీనివాసులు, బుర్రి వెంకట్రావు, ఎం.ఇజ్రయేల్ తదితరులు ఉన్నారు.

### గుడ్లూరు పథకం నుంచి ఆగిన మంచినీటి సరఫరా

లింగసముద్రం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపవనికి గుడ్లూరు మంచినీటి పథకం నుంచి ఆరు రోజులుగా మంచినీటి సరఫరా ఆగిపోయిందని గ్రామస్థులు తెలిపారు. దీంతో గ్రామంలోని ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని, చేతి పంపుల నీటితో తమ అవసరాలను తీర్చుకుంటున్నారని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### జడ్పీ హెచ్‌ఎస్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

కావలి(టౌన్), సెప్టెంబరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా తోట వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రధానోపాధ్యాయులు పీవీ రమణ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో వెంకటేశ్వర్లు పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఆయనను సహచర ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించి అభినందించారు.

## వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఆక్రమణలు



వ్యవసాయ పరిశోధన కేంద్రం పంట కాలువలో వేసిన సిమెంటు పైపులు

లింగసముద్రం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపవని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సత్యనారాయణపురంకు చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడ్డారు. దౌర్జన్యంగా ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు నిర్మాణం చేపట్టి పరిశోధన కేంద్రానికి చెందిన పంట కాలువలో సిమెంటు పైపులు వేశారు. కేంద్రానికి చెందిన ఇనుప ఫెన్సింగ్‌ను తొలగించారు. పరిశోధన కేంద్రానికి సమీపంలో ఉన్న వారి పొలాల్లోకి వెళ్లేందుకు ఈ విధంగా ఆక్రమణలకు పాల్పడ్డారని అధికారులు తెలిపారు. అయితే వారి పొలాల్లోకి వెళ్లేందుకు ఉన్న రోడ్డును వారి పొలాల్లో కలుపుకొని, పరిశోధనా కేంద్రంలో రోడ్డును దౌర్జన్యంగా వేశారని చెప్పారు. కాగా 2021 జనవరి 7న అప్పటి ప్రభుత్వం ఈ వ్యవసాయ విత్తనాభివృద్ధి క్షేత్రం భూములలోని 540 ఎకరాలలో సుమారు 410 ఎకరాలను అపరాలు, చిరుధాన్యాల పరిశోధనా కేంద్రం ఏర్పాటు కోసం ఆచార్య ఎన్జీ రంగా యూనివర్శిటీకి బదలాయించిన విషయం తెలిసిందే. దీంతో అక్కడ పనులు జరుగుతున్నాయి.

**ఆక్రమణలు తొలగించండి**



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న డాక్టర్ శ్రీనివాసరెడ్డి, నాగార్జున

మండలంలోని చినపవని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఆక్రమణలు తొలగించాలని ఆ కేంద్రం ఇన్‌చార్జ్, సీనియర్ సైంటిస్టు డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, సైంటిస్టు నాగార్జున కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దారు కార్యాలయంలో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో తహసీల్దారు ఎం.కోటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ పరిశోధన కేంద్రానికి సమీపంలోని సత్యనారాయణపురంకు చెందిన కొందరు బలవంతంగా పరిశోధన కేంద్రం ఉత్తరం-పడమర దిక్కుల మధ్యలో ఉన్న ఫెన్సింగ్‌ను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి, ఇరిగేషన్ కాలువపై సిమెంటు పైపులు వేసి, పరిశోధన కేంద్రంలోకి అక్రమంగా ప్రవేశించి రోడ్డు వేశారని చెప్పారు. ఇది తీవ్ర అభ్యంతరకరమని, అలాగే పరిశోధన కేంద్రం నిబంధనలను అడ్డుకోవడమేనని చెప్పారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## వైసీపీ ఫేక్ ప్రచారాలు నమ్మొద్దు

● అర్హులందరికీ పింఛన్లు
● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కందుకూరు పట్టణంలోని 7వ వార్డులో పింఛను నగదు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఫేక్ ప్రచారాలను నమ్మవద్దని, పేదప్రజల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న టీడీపీ ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు ఇచ్చితీరుతుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పట్టణంలోని 7వ వార్డులో సోమవారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అర్హులైన ఏ ఒక్కరి పేర్లను తొలగించలేదని, రాష్ట్రంలో ప్రశాంత వాతావరణంకు భంగం కలిగించేందుకు వైసీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి అర్హుల పింఛన్లు తీసివేస్తున్నట్లుగా ప్రచారం చేస్తూ కొత్త డ్రామాలకు తెరతీస్తున్నాడని విమర్శించారు. వార్డు నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును శాలువాతో సత్కరించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.అనూష, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, షేక్ గౌస్‌బాషా, ఉన్నం భాస్కర్, షేక్ రూబీ, సయ్యద్ అహ్మద్‌బాషా, మున్నా, ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధికి ఆద్యుడు చంద్రబాబు**

ఆంధ్రరాష్ట్రాన్ని ఆధునికతవైపు నడిపిస్తున్న దార్శనికుడు చంద్రబాబు అని, తెలుగు రాష్ట్రాలలో అభివృద్ధికి ఆయనే ఆద్యుడని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు స్వీకరించి నేటికి 30 ఏళ్ల పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 73 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.43.07 లక్షల చెక్కులను, 3లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే ఇంటూరి బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, పూరిమిట్ల గురునాథం, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధు తదితరులు పాల్గొన్నారు.

## రెండు మూడు రోజుల్లో కరేడుకు వస్తా

● బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్



కరేడు వాసులతో మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

ఉలవపాడు, సెప్టంబరు 1(ఆంధ్రజ్యోతి): రెండు మూడు రోజుల్లో కరేడును సందర్శించి ఇండోసోల్ భూసేకరణ బాధితులతో మాట్లాడతానని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ కరేడు రైతులకు భరోసా ఇచ్చారు. సోమవారం విజయవాడ నుంచి పుంగనూరు వెళుతూ మార్గమధ్యంలో కరేడు రైతులను కలుసుకుంటానని ముదస్తు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుని జాతీయ రహదారి నుంచి కరేడుకు వెళ్లే ప్రధాన రహదారి వద్ద కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో పోలీసు బలగాలు మోహరించాయి. విషయం తెలుసుకున్న రామచంద్రయాదవ్ ప్రకాశం జిల్లా సింగరాయకొండ బైపాస్ కే బిట్రగుంట దాబా దగ్గర ఆగాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలో పోలీస్ 30 యాక్ట్ అమల్లో ఉన్నందున కొత్త వ్యక్తులు రావడం, సమావేశాలు నిర్వహించడం నిషేధం కావడంతో సుమారు 100 మంది రైతులు ఆయనను సింగరాయకొండ బైపాస్ దాబా వద్ద కలిసి మాట్లాడారు. రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా చట్ట బద్ధంగా అన్ని అనుమతులతో రెండు మూడు రోజుల్లో కరేడులో పర్యటించి బాధితులకు అండగా నిలుస్తానని చెప్పారు. కరేడు రైతుల భూపోరాటంలో ఎంతదూరమైనా పోరాడి ఇండోసోల్ కంపెనీకి ప్రభుత్వం కట్టబెట్టాలని చూస్తున్న భూములను ఇవ్వకుండా అడ్డుకుంటానని స్పష్టం చేశారు.

## పలువురికి సన్మానం

బిట్రగుంట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో నూతనంగా ఎంపికైన పలువురిని టీడీపీ మండల కన్వీనరు మాలేపాటి నాగేశ్వరరావు సోమవారం సన్మానించారు. ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు, కావలి ఏఎంసీ డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేసిన లేళ్లపల్లి సుధీర్‌బాబు, గణేషం రమేష్ రెడ్డి, జమున ఎల్లమ్మలను శాలువలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కోడూరు వెంకటేశ్వరరెడ్డి, శివకోటయ్య, చిలకజానకి రామయ్య తదితరులు ఉన్నారు.

## నిమజ్జనానికి తరలిన గణనాథులు



గ్రామోత్సవంలో పూజలందుకుంటున్న గణనాథుడు

లింగసముద్రం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథులు సోమవారం నిమజ్జనానికి తరిలాయి. మండలంలోని అన్నెబోయినపల్లి, వీఆర్ కోట, తిమ్మారెడ్డిపాలెం, యర్రారెడ్డిపాలెం, లింగసముద్రం గ్రామాలలోని వినాయకుని విగ్రహాలను భక్తులు అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి ఊరేగించారు. అనంతరం రాళ్లపాడు ప్రాజెక్టు, స్థానిక చెరువులలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

## సందడిగా గణనాథుడి నిమజ్జనం



గణేశ్ మహరాజ్ ఉత్సవంలో నృత్యం చేస్తున్న యువత

బిట్రగుంట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో సోమవారం గణేష్ నిమజ్జనం సందడిగా జరిగింది. ఎస్వీపాలెం పంచాయతీలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆక్వా గణేష్ విగ్రహం ఊరేగింపు నిర్వహించారు. వెంకటేశ్వరపురం, ఎస్వీపాలెంలో గణేష్ విగ్రహాల ఊరేగింపు అనంతరం తాటిచెట్లపాలెం సముద్రతీరానికి తరలించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆక్వా గణేష్ కమిటీ సభ్యులు కే.కృష్ణప్రసాద్‌రెడ్డి, ఆర్.భానుచంద్రారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఏ.నాగేంద్ర, పీ.రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ చానల్ పనుల్లో అవకతవకలపై

## విజిలెన్స్ విచారణ జరిపించాలి

● ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి



కావలి ఇన్‌చార్జి ఈఈ ఖాన్‌తో మాట్లాడుతున్న సుబ్బానాయుడు

కావలి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): దగదర్తి- రాచర్లపాడు(డీఆర్) చానల్ పనుల్లో పాత ప్రతిపాదనలు మార్చి జరుగుతున్న అవకతవ కలపై విజిలెన్స్ విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్ మెంట్ కార్పొరే షన్ (ఏఐడీ) చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం కావలి జలవనరు లశాఖ ఇన్‌చార్జి ఈఈ ఖాన్‌ను ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 3 మండలాల పరిధిలోని 23 గ్రామాల్లో 23 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ఈ కాలువ నిర్మాణంలో జరుగుతున్న అవకతవకలపై ఇప్పటికే జలవనరులశాఖ ఈఈ, ఎస్ఈ, సీఈలకు వినతిపత్రాలు అందించానని, అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ఈ కాలువకు గత టీడీపీ ప్రభుత్వంలో రూ.30 కోటను సీఎం చంద్రబాబునాయుడు మంజూరు చేయగా అప్పట్లో జీరో నుంచి 6.7 కి.మీ వరకు కాలువకు కాంక్రీట్ గోడలు నిర్మించేలా ప్రతిపాదనలు చేశారన్నారు. అయితే ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో దానిని నిర్లక్ష్యం చేశారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పాతప్రతి పాదనలను కాంట్రాక్టర్లకు అనుకూలంగా మార్పించుకుని కొత్త ప్రతిపాదనలు పంపి నాసిరకంగా పనులు చేస్తున్నందున రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. డీఆర్ చానల్ బాగుంటేనే డీఎం చానల్‌కు నీరు వస్తోందని చెప్పారు. కాలువపై బ్రిడ్జీలు కట్టకుండా సైఫన్‌లు కట్టాలని అప్పుడే రైతులకు సక్రమంగా నీరు పారుతోందన్నారు. ఒక రైతుగా కాలువ నిర్మాణంలో జరుగుతున్న అవకతవకలపై తాను పోరాడుతానన్నారు.

## రైల్వేఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి



ఆర్డీవోకి వినతిపత్రం ఇస్తున్న వామపక్షాల నాయకులు

కావలి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెదపవని రోడులో 15 ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న రైల్వేఓవర్ బ్రిడ్జి నిర్మాణం తక్షణం పూర్తి చేయాలని వామపక్షాల నాయకులు కోరారు. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో సోమవారం వామపక్షాల నాయకులు కావలి ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేసారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పూర్తి చేసి ఉన్నారని, రైల్వే శాఖ తన పరిధి వరకు వంతెన నిర్మాణం పూర్తి చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాల్సిన వంతెన ను గత వైసీపీ ప్రభుత్వం, నిర్లక్ష్యం చేయగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం ఉదయగిరి రోడ్డులోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై వాహనాల రద్దీ పెరిగి అది దెబ్బతింటుందన్నారు. పొరపాటున అది దెబ్బతింటే ప్రత్యేమ్నాయ రాకపోకలకు ఎలాంటి మార్గాలు లేవన్నారు. వెంటనే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా స్వామిక హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ కరువది భాస్కర్, దామా అంకయ్య, సభ్యులు వై. కృష్ణమోహన్, బోసు, దర్గాబాబు, ఆమంచి సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల ఎదుట యథేచ్ఛగా ఆక్రమణలు

కావలి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : పలు శాఖల కార్యాలయాల సముదాయంతో ఉన్న కావలి తహసీల్దారు కార్యాలయం ఎదుట రోడ్డు వెంబడి ఆక్రమించి బొంకులు ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అక్కడ తహసీల్దారు, సబ్‌రిజిస్ట్రార్, వ్యవసాయశాఖ డివిజన్, మండల శాఖ కార్యాయలయాలు, రూరల్ పోలీస్‌స్టేషన్, సర్కిల్, ఉపఖజానా, సబ్‌జైలు కార్యాలయాలు ఒకే సముదాయంలో ఉన్నాయి. అయితే ఆ కార్యాలయాలు కనిపించకుండా వాటి ముందు బొంకులు వెలిసినా ఎవరూ పట్టించుకోవడంలేదు. ఆ కార్యాలయాలలో ప్రధానంగా రెవెన్యూ, పోలీస్‌శాఖలు ఉన్నప్పటికీ ఆక్రమణలను ఎందుకు నివారించలేకపోతున్నారో అర్థం కావడంలేదని స్థానికులు అంటున్నారు. కార్యాలయాల ముందు బొంకులు వెలవడంతో ఆయా కార్యాలయాలు పూర్తిగా కనిపించకుండా పోయాయి. దీంతో ఆయా కార్యాలయాలకు పనులుపై వచ్చిన వ్యక్తులకు కార్యాలయాలు కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వ కార్యాలయాల ముందు వెలిసిన ఆక్రమణల వలన కార్యాలయాల వాతావరణమే కనిపించకుండా అక్కడ అపరిశుభ్రంగా తయారయ్యాయి. అక్కడ ఆక్రమణదారుల ను రెవెన్యూ అధికారులు ఎవరైనా ప్రశ్నిస్తే తాము మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నామని చెపుతున్నట్లు సమాచారం. అధికారులు స్పందించి తహసీల్దారు కార్యాలయ సముదాయం ముందు ఉన్న ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.





తహసీల్దారు కార్యాలయం ప్రధానగేట్ ఉత్తర, దక్షణం వైపున వెలిసిన బంకులు

## ఇండోసోల్‌లో ఉద్యోగ అర్హత పొందిన వారికి శిక్షణ

కావలి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ కంపెనీలో ఉద్యోగ అర్హత పొందిన వారికి నైపుణ్యాభివృద్ధిపై మండలంలోని రుద్రకోట పాలటెక్నిక్ కళాశాలలో సోమవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. గతనెల 20వ తేదీన గుడ్లూరు మండలం చేవూరు వేదికగా జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 70 మంది ఉద్యోగ అర్హత లెటర్స్ పొందారు. వారికి నెల్లూరు స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఇండోసోల్ సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై శిక్షణ ప్రారంభించారు. ఈ శిక్షణ 30 రోజుల పాటు కొనసాగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్‌ఖయూం, పాలటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సుశీలకుమార్ ప్రియ, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బన్న, ఇండోసోల్ కంపెనీ ప్రతినిధులు పీ.రాజశేఖర్, సుబ్బారావు, హరీష్, భారతి, సాఫ్ట్‌స్కిల్ ట్రైనర్స్ లావణ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇండోసోల్ సంస్థ ప్రతినిధి



## ఐదేళ్లు.. 8 దేశాలు

### సైకిల్‌పై తమిళ యువకుడి యాత్ర

ఈ చిత్రంలో సైకిల్‌పై ఉన్న వ్యక్తి తమిళనాడుకు చెందిన ముత్తు. ఎంబీఏ ఫైనాన్స్ చదివాడు. 8 దేశాలు సైకిల్‌పై తిరిగి ఐదేళ్లలో 11 లక్షల మొక్కలు నాటించి గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించాలన్న ఆశయంతో యాత్ర సాగిస్తున్నాడు. 2023 నుంచి ఇదిగో.. ఇలా సైకిల్‌పై మూడు దేశాలు చుట్టేసి సోమవారం నాటికి మనుబోలు చేరుకున్నాడు. అక్కంపేటలో ఉన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని కలిశారు. తన పర్యటన వివ రాలు, లక్ష్యాలను ఆయనకు వివరించి, ప్రముఖుల అభినంద నల చిత్రాలను చూపించారు. దీంతో ముత్తు సైకిల్ యాత్ర విజయవంతం కావాలని అభినందిస్తూ రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రాన్ని ఎమ్మెల్యే అందించారు ఎక్కువ మొక్కలు నాటితే దేశానికి, పర్యావరణానికి ఎంతో మంచి దని, అందుకే తాను సైకిల్‌యాత్ర చేస్తూ మొక్కలు నాటిస్తు న్నట్లు ముత్తు చెప్పుకొచ్చారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

## రైతుల కోసం కొత్త ఆవిష్కరణలు చేయాలి

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలు రైతులకు ఉపయోగపడే కొత్త ఆవిష్కరణలు చేయాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జీ.శివనారాయణ అన్నారు. నెల్లూరులోని కేవీకేను సోమవారం ఆయన సందర్శించారు. సబ్జెక్ట్ మ్యాటర్ స్పెషలిస్టులు రూపొందించిన సాంకేతిక కార్యక్రమాలు, రైతులకు అందిస్తున్న సేవలు, శిక్షణ కార్యక్రమాలు, విస్తరణ కార్యక్రమాల్లో పురోగతి వంటి అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల ఆదాయం రెట్టింపు కావాలంటే ఆధునిక సాంకేతిక రైతులకు సమయానికి అందించడం ఎంతో ముఖ్యమన్నారు. పంటల వైవిధ్యకరణ, మార్కెటింగ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రదర్శనల వల్ల రైతులకు సాంకేతికతపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. అనంతరం కేవీకేలోని పంటల విభాగం, పౌల్ట్రీ, మత్స్య పెంపకం, తేనెటీగల



రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేస్తున్న శివనారాయణ, లలితాశివజ్యోతి తదితరులు

పెంపకం, వర్మీకంపోస్టు డెమో యూనిట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్‌సీఎస్‌పీ లబ్ధిదారులకు స్ప్రేయర్లు, ఇన్క్యుబేటర్లు తదితర వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ జీ.లలితాశివజ్యోతి, శాస్త్రవేత్తలు లోకేష్‌బాబు, విజయకుమార్‌లతోపాటు రైతులు, మహిళా సంఘాలు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం); సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను సోమవారం కలెక్టర్ ఆనంద్ నగరంలోని మూలాపేటలో పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ నాగరాజ కుమారి పడుగుపాడులో పింఛన్లను పంపిణీ చేశారు. మూలాపేటలోని ఈఎస్ ఆర్ఎం స్కూల్ ప్రాంతంలో మంచానికే పరిమితమైన డయాలసిస్ రోగి సిరివెళ్ల శ్రీనివాస్‌కు రూ.15వేలు, ఒంటరి మహిళ శారదకు రూ.4వేల పింఛను మొత్తాన్ని కలెక్టర్ అందచేశారు. కలెక్టర్ స్వయంగా వచ్చి పింఛన్ అందచేయటం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం 94 శాతం పింఛన్లను పంపిణీ చేశారు.



## జాప్యం లేకుండా వినతులు పరిష్కరించండి

● పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ ఆనంద్ ● 436 అర్జీల్లో రెవెన్యూవే 174



పీజీఆర్‌ఎస్‌లో అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం); సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన అర్జీలను జాప్యం లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ ఓ ఆనంద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్‌ఎస్‌లో ప్రధానంగా భూసమస్యలు, రెవెన్యూ అంశాలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రజలు సంతృప్తి చెందేలా, నిర్దిష్ట గడువులోగా పరిష్కారం చూపించాలని పేర్కొన్నారు. ఒకవేళ సమస్యలను పరిష్కరించలేకపోతే ఎందుకు పరిష్కరించలేక పోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు.

**● మొత్తం అర్జీలు 436**

ఈ కార్యక్రమానికి 436 అర్జీలు వచ్చాయి. వాటిలో రెవెన్యూశాఖవి 174, మున్సిపల్‌శాఖవి 41, సర్వేకు 18, పీఆర్‌వి 38, మిగిలినవి వివిధ శాఖలవి ఉన్నాయి ఈ కార్యక్రమంలో జేసీ కే. కార్తీక్, ఇన్‌చార్జి డీఆర్వో విజయకుమార్, జడ్పీ సీఈవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**● క్యాంపస్‌లోనే ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలి**

నెల్లూరు (వైద్యం) (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూ క్యాంపస్ పరిధిలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆనంద్‌కు కాంగ్రెస్ పార్టీ నేతలు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో సిటీ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సంజయ్‌కుమార్ మాట్లాడారు. వీఎస్‌యూకి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆత్మకూరులో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ కళాశాలలు మూతపడుతున్న దశలో క్యాంపస్‌లోనే ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ధనుంజయ్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ పీజీఆర్‌ఎస్‌కి 79 ఫిర్యాదులు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌కు జిల్లావ్యాప్తంగా తరలివచ్చిన 79 మంది బాధితులు వారి సమస్యలను పోలీసు అధికారులకు తెలిపారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య బాధితుల నుంచి ఫిర్యాదులు అందుకొని, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులన్నింటిని చట్ట



ఫిర్యాదుదారుల సమస్య వింటున్న ఏఎస్పీ సౌజన్య

ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామన్నారు. సమస్యలను పోలీసు అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ కేసీహెచ్. రామారావు, లీగల్ అడ్వైజర్ టీ. శ్రీనివాసులురెడ్డి, ఎస్‌బీ సీఐ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కావలి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి స్థానిక ఉదయగిరి రోడ్డులో బుడంగుంట క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కావలి పట్టణం బుడంగుంటకు చెందిన గొల్లపూడి రామకృష్ణ (78) ఆదివారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో పట్టణంలోని ముసునూరులో ఉన్న తమ కుమార్తె గోసల జ్యోతి వద్దకు వెళ్లేందుకు బయలుదేరాడు. ఉదయగిరి రోడ్డులో బుడంగుంట క్రాసింగ్ వద్ద వాహనం కోసం నిలబడి ఉండగా జలదంకి వైపు నుంచి వేగంగా వచ్చిన ఓ ట్రక్ వాహనం ఆయనను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బలమైన గాయాలైన ఆయనను చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దళారుల దోపిడీ నుంచి ఆదుకోండి

అల్లూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : రెండో కారు పంట దిగుబడి సమయంలో దళారుల దోపిడీ నుంచి తమను ఆదుకోవాలని రైతులు కోరారు. దళారులు చేస్తున్న మోసానికి గురై తీవ్రంగా నష్టపోతున్నామంటూ సోమవారం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంటీయూ 1010 రకం ధర రూ.15,500 ఉండగా సన్నాల ధరలు రూ.16,200కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



## గణేశుడికి గంగ కరువు

● స్వర్ణాల చెరువు, పెన్నా నదిలో మునగని విగ్రహాలు



పెన్నానదిలో నిమజ్జనం కాకుండా నీటిపై తేలియాడుతున్న వినాయక విగ్రహాలు





గణేశ్ ఘాట్‌లో నీట మునగని భారీ బొమ్మలు

విఘ్నాలను తొలగించే వినాయకుడికి చవితి ఉత్సవాల్లో పరిపూర్ణత కరువైంది. నీటి వనరుల్లో నిమజ్జన చేస్తే గణపతి బొమ్మలు మునగని పరిస్థితి నెల్లూరు నగరంలో నెలకొంది. నగరంలో 5రోజులు గణేశ్ ఉత్సవాలు పోటాపోటీగా జరిగాయి. నగరం అంతా జై గణేశా... జైజై గణేశా అనే నామస్మరణ మారుమోగింది. ఉత్సవాలకు నెల రోజుల ముందే యంత్రాంగం ఏర్పాట్లు ప్రారంభించింది. నిమజ్జనం కోసం స్వర్ణాల చెరువు గణేశ్ ఘాట్, రంగనాయకులపేట సమీపంలో పెన్నా నది వద్ద ఏర్పాట్లకు సుడా, కార్పొరేషన్ నిధులు దాదాపు రూ.3కోట్లకుపైగా ఖర్చు చేశారు. గణేశ్ ఘాట్ వద్ద నిమజ్జనం ఏర్పాట్లపై విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి, సంబంధిత అధికారులతో రూరల్ ఎమ్మెల్యే రెండుసార్లు సమన్వయ, సమీక్ష సమావేశాలు నిర్వహించారు. వినాయకుడి విగ్రహాలు మునిగిపోయేంతగా నీటి మట్టం పెంచాలని ఇరిగేషన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆ శాఖ ప్రతీ ఏటా మాదిరిగానే ఈసారి కూడా తగినంత నీటిని నిల్వ చేయలేదు. దీంతో పెద్ద విగ్రహాలు నీట మునగక పైకే కనిపిస్తున్నాయి. భక్తులు వీటిని చూసి 'అయ్యో.. వినాయకా!' అనుకుంటున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

## 'పేకాట అడ్డా'పై పోలీసుల సీరియస్!

● స్థావరాలపై దాడులకు ప్రత్యేక బృందం ● నిర్వాహకుల అరెస్టుకు ఆదేశాలు ● ఎస్‌ఐలకు మెమోలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కందుకూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలో విచ్చలవిడిగా మారిన పేకాట స్థావరాలపై పోలీసు యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. 'కందుకూరు గడ్డ పేకాటకు అడ్డా' శీర్షికన గత నెల 27న ఆంధ్రజ్యోతిలో ఓ కథనం ప్రచురితం అయ్యింది. రేయింబవళ్లు పేకాటలు జరుగుతున్న తీరు, పోలీసులు అటువైపు కన్నెత్తిచూడకపోతున్న వైనంపై ఎస్పీ కృష్ణకాంత్‌తోపాటు ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. సీఎం కార్యాలయం కూడా పేకాట నిర్వహణపై సీరియస్ కావటంతో స్థానిక పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ఇక్కడి పరిస్థితులపై ఐజీ సమగ్ర నివేదిక తెప్పించుకుని తగు ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. ఈ మేరకు పేకాట నిర్వహిస్తున్న వారిని తక్షణం అరెస్టుచేసి రిమాండ్‌కు పంపాలని, ఎక్కడా పేకాట జరగడానికి వీల్లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశాలు జారీచేశారు. దీంతో కందుకూరు సీఐ అన్వర్‌బాషా నేతృత్వంలో పేకాట స్థావరాలపై దాడులకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశారు.

**● పరారీలో నిర్వాహకులు**

రామాయపట్నం పరిసరాల్లోని ఓ రిసార్ట్‌లో పేకాట నిర్వహణ బాధ్యతలు చూస్తున్న కందుకూరువాసి, ఉలవపాడు మండలంలో పేకాట నిర్వహిస్తున్న అధికార పార్టీ నేత నాలుగు రోజులుగా పరారీలో ఉన్నారు. వీరు ఎప్పుడు వచ్చినా అరెస్టు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

**● ఎస్‌ఐలకు మెమోలు : డీఎస్పీ**

కందుకూరు నియోజకవర్గంలో పేకాట నిరోధానికి కఠిన చర్యలకు ఉపక్రమించినట్లు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఉలవపాడు, గుడ్లూరులతోపాటు మిగిలిన 4 స్టేషన్ల ఎస్‌ఐలకూ మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. ఎక్కడ పేకాట జరిగినా వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆదేశించినట్లు తెలిపారు. అలాగే, పేకాట నిర్వాహకులుగా గుర్తింపు పొందిన వారి వివరాలు ఎస్‌ఐలకు అందజేశామని వారి కదలికలపై నిఘా ఉంచామన్నారు. కందుకూరు సీఐ అన్వర్‌బాషా నేతృత్వంలో పేకాట స్థావరాలపై దాడులకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను నియమించినట్లు చెప్పారు.

## రైతులకు మద్దతు ధర దక్కనివ్వని దళారులు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధాన్యానికి పుట్టికి 20- 22వేల రూపాయల మద్దతు ధర కల్పిస్తుంటే వాటిని దళారులు 15-16 వేల వరకే కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం బుచ్చిలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా పదాధికారుల సమావేశం జరిగింది. ప్రతి మండలంలో బీజేపీ మండల కమిటీలు వేసి, ఈ నెల 17న ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని అక్టోబరు 2వరకు పువా పక్షోత్సవాల పేరుతో సేవా కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులను మోసం చేస్తున్న దళారులపై అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు బత్తల కృష్ణయ్య, పెంచలయ్య, శ్రీనివాసులు, శివపార్వతి, మల్యాద్రి పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ...

## అర్హులందరికీ అన్నదాత సుఖీభవ

● యూరియా కొరత లేదు..
● విస్తృతంగా టాస్క్‌ఫోర్స్ తనిఖీలు
● 'ఆంధ్రజ్యోతి'తో డీఏవో సత్యవాణి

? ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం ఎంత

! జలవనరుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 1,00,315 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేశారు. 62,390 హెక్టార్లలో వరి, 37,925 హెక్టార్లలో వివిధ రకాల ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. అల్లూరు, ఇందుకూరుపేట, కొడవలూరు తదితర ప్రాంతాల్లో వరి కోతలు కూడా ప్రారంభమయ్యాయి.

? యూరియా కొరత ఉందంటున్నారు

! దాదాపు 40వేల మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంచాం. అయితే వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన మోతాదు కంటే అధికంగా రైతుల వినియోగించడంతో ఈ సమస్య వచ్చింది. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి జిల్లా అవసరాలకు మించి యూరియాను దిగుమతి చేసుకుని, సరఫరా చేశాము.

? వ్యాపారుల హవా ఎక్కువైందంటున్నారు

! అధిక ధరకు యూరియా విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. యూరియాతోపాటు మరొకటి కొంటేనే ఇస్తామని కొంత మంది అనవసరమైన ఎరువులను కూడా అంటగట్టుతున్నారన్న సమాచారం ఉంది. దీనిపై విచారణ జరుగుతోంది. యూరియా నిల్వలు, విక్రయాలకు సంబంధించి టాస్క్ ఫోర్సు బృందాల ద్వారా ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి, చర్యలు తీసుకుంటున్నాము.

? మట్టి నమూనాల పరీక్షలు ఎంతవరకు వచ్చాయి

! జిల్లాలో 31,231 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటిదాకా 32వేల వరకు సేకరించాము. వీటిలో 13వేల నమూనాల పరీక్షలు పూర్తయ్యాయి. అక్టోబరు నెలాఖరుకు రైతులకు ఫలితాలు అందించడమే మా లక్ష్యం. బడ్జెట్ కూడా విడుదలైంది కాబట్టి ఇబ్బందేమీ లేదు.

? ఈ-క్రాప్ నమోదు ఎప్పటికి పూర్తవుతుంది

! ఈ-క్రాప్‌నకు సంబంధించి ప్రభుత్వం నూతన యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. క్షేత్రస్థాయిలో ఎలాంటి అవకతవకలకు పాల్పడేందుకు అవకాశం లేకుండా పొలంలో పంట ఉన్నా లేకున్నా ఈ-క్రాప్ నమోదు చేసేలా యాప్‌లో మార్పులు చేశారు. దాదాపుగా 2.60 లక్షల ఎకరాలకు ఈ-క్రాప్ నమోదు చేయాల్సి ఉండగా, 1.5లక్షల ఎకరాలకు పూర్తి చేశాము. సెప్టెంబరు 15లోగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయి. సమయానికి పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

? కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఇస్తున్నారా

! జిల్లాలో 38వేల మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలనేది లక్ష్యం. ఖరీఫ్‌లో 4,798 మందికి అందజేశాం. జిల్లాకు రబీ సీజన్ ఎంతో ప్రాధాన్యం. అక్టోబరులో రెన్యువల్స్ జరుగుతాయి. అర్హత కలిగిన కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ పథకాల రాయితీలు పొందుతారు.

? డ్రోన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చా!

! జిల్లాకు 41 డ్రోన్ల యూనిట్లు కేటాయించగా, 28 రైతు బృందాలకు డ్రోన్లను అందజేశాము. ఐదుగురు రైతులు బృందాలుగా ఏర్పడి రూ.2లక్షలు చెల్లిస్తే రూ.10లక్షల విలువైన డ్రోన్లను అందిస్తాము. పూర్తి వివరాలకు మండల వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలి.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

## అభాగ్యులకు ఆదరణేది!?

● దివ్యాంగుల సంక్షేమంలో అధికారుల నిర్లక్ష్యం
● సమన్వయ సమావేశాల నిర్వహణలో వైఫల్యం
● ప్రభుత్వ నిధులు రూ.14 లక్షలు వెనక్కు
● ట్రైసైకిళ్లు తయారు చేయించలేకపోయిన వైనం
● సంరక్షకులు లేని బాలికల వసతి గృహం
● స్వయం ఉపాధి రుణాలూ కరువే..!

నెల్లూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విధి వంచిత అభాగ్యులకు అండగా నిలవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దివ్యాంగుల సంక్షేమంలో అంతులేని అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ట్రైసైకిళ్ల తయారీకి ప్రభుత్వం నిధులిచ్చినా వాటిని ఉపయోగించుకోలేకపోవడంతో ఆ నిధులు వెనక్కు వెళ్లిపోయాయి. అదేమాదిరిగా ఇప్పుడు బాలికల వసతి గృహం విషయంలోనూ నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారు. నెల్లూరులోని ఈ వసతి గృహాన్ని చూసుకునేందుకు ఒక్కరంటే ఒక్క కేర్ టేకర్ కూడా లేరంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అఖరుకు యూడీఐడీ కార్డులపై అవగాహన కల్పించి దరఖాస్తులు చేయించడంలో గానీ, రెగ్యులర్‌గా లైన్ డిపార్టుమెంట్లతో సమన్వయ సమావేశాలు నిర్వహించి దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడంలోగానీ దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. మానసిక, శారీరక దివ్యాంగులైన బాలికల కోసం నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఓ హాస్టల్ ఉంది. ప్రస్తుతం ఇక్కడ 20 మంది వరకూ అభాగ్యులున్నారు. అ



యితే వీరికి కేర్ టేకర్‌గా ఉండాల్సిన నర్సు, వార్డెన్ ఇద్దరూ లేరు. ఏదైనా జరగరానిది జరిగితే ఆ దివ్యాంగులకు దిక్కెవరన్న ప్రశ్న తలెత్తుతోంది.

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లాలోని దివ్యాంగుల సంక్షేమానికి రూ.14 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో 200 ట్రైసైకిళ్ల తయారు చేసి పంపిణీ చేయాలని ఆదేశించింది. అయితే ఈ ప్రక్రియ జరగలేదు. అధికారులు టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్న కారణంతో మిన్నకుండిపోయారు. చివరకు ఆర్థిక సంవత్సరం ముగియడంతో ఈ ఏడాది మార్చి ఆఖరుకు ఆ నిధులన్నీ వెనక్కు వెళ్లిపోయాయి. ఆ తర్వాత హడావిడిగా రాష్ట్ర అధికారులకు లేఖలు రాసి చేతులు దులుపుకున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా నెల్లూరులో ఉండే ట్రైసైకిళ్ల తయారీ కేంద్రం మూతపడింది. అయితే కూటమి ప్రభుత్వం నిధులిచ్చినా ఈ కేంద్రాన్ని తిరిగి తెరిపిద్దామన్న ఉద్దేశం అధికారులకు లేకుండా పోయిందని దివ్యాంగులు ఆరోపిస్తున్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కార్యాలయంలో తమకు గౌరవం ఉండడం లేదని, కనీసం ఏదైనా సమస్య మీద వెళితే గైడ్ చేసే పరిస్థితి కూడా లేదని వాపోతున్నారు. యూనిక్ డిసేబులిటీ ఐడీ కార్డ్స్ దరఖాస్తుల విషయంలో ఇదే జరుగుతోందని చెబుతున్నారు. కాగా గడిచిన ఏడాది కాలంలో దివ్యాంగులకు ఒక్క రుణం కూడా మంజూరు చేయలేదు. సాధారణంగా ప్రతీ ఏటా ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకం కింద దివ్యాంగుల స్వయం ఉపాధికి రుణాలు మంజూరు చేస్తుంటారు. అయితే ఈ రుణాలపై కూడా ఎవరూ పట్టించుకోవడం లేదని దివ్యాంగులు వాపోతున్నారు.

### హాస్టల్‌ను నేనే చూసుకుంటున్నా

నెల్లూరులోని బాలికల వసతిగృహంలో ఉండాల్సిన నర్సు, వార్డెన్ ఇద్దరూ లేరు. ఈ విషయాన్ని పై అధికారులకు తెలియజేశాను. ప్రస్తుతం ఆ హాస్టల్‌ను నేనే చూసుకుంటున్నా. ట్రైసైకిళ్ల తయారీ కోసం వచ్చిన నిధులు వెనక్కి వెళ్లిపోవడంతో వాటిని మళ్లీ ఇవ్వాలంటూ రాష్ట్ర ఉన్నతాధికారులకు లేఖ రాశాం. ఇంకా అక్కడి నుంచి స్పష్టత రాలేదు.

- అయూబ్ ఖాన్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ

## సోలార్ ప్యానల్ ఏర్పాటుకు ప్రభుత్వ భూమి పరిశీలన

సంగం, సెప్టెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసేందుకు విద్యుత్, రెవెన్యూ శాఖ అధికారులు సోమవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సంగం కొండ వద్ద, సిద్దీపురం సబ్‌స్టేషన్ పరిధిలో పడమటిపాళెంలో ఖాళీ ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏడీ సతీష్ మాట్లాడుతూ ప్రతి మండ లంలో సుమారు 5 ఎకరాల్లో సోలార్ ప్యానల్ ఏర్పాటుచేసి రెండున్నర మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఆదేశించింది. ఇందుకు అయ్యే నూరుశాతం ఖర్చు కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. ఆమేరకు తహసీల్దారు సోమ్లానాయక్‌ను కలిసి స్థలం కోసం ప్రతిపాదించగా రెండు గ్రామాల్లో చూపించా రన్నారు. ఈ రెండింట్లో అనువైన స్థలంలో సోలార్ ప్యానల్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఈ మన్మధరావు, రెవెన్యూ సిబ్బంది, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు